తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం 13.10.2025 | సంపుటి :12 సంచిక : 83 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370
హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698




## 42% బీసీ రిజర్వేషన్ సాధనకు
# జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పాటు
### బీసీ రిజర్వేషన్ల ఉద్యమం ఉధృతం



- బీసీ జేఏసీ చైర్మన్‌గా ఆర్.కృష్ణయ్య, వర్కింగ్ చైర్మన్‌గా జాజుల శ్రీనివాస్ గౌడ్
- రిజర్వేషన్ల సాధన కోసం 18న బంద్ ఫర్ జస్టిస్ పేర రాష్ట్ర బంద్
- 13న రహదారుల దిగ్బంధం, 14న రాష్ట్ర బంద్ వాయిదా
- బీసీల నిరసనను గల్లీ నుంచి ఢిల్లీ దాకా సెగ పుట్టిస్తాం
- బీసీ జేఏసీ ఆవిర్భావం సందర్భంగా నేతల వెల్లడి

హైదరాబాద్ బ్యూరో, అక్టోబర్ 12 (జనంసాక్షి) తెలంగాణ రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ల ఉద్యమాన్ని ఉధృతం చేసి, ఎవరికివారుగా కాకుండా ఐక్యంగా ముందుకు తీసుకుపోవడానికి బీసీ ఐక్య కార్యాచరణ కమిటీ బీసీ జేఏసీ ఏర్పాటైంది. హైదరాబాద్ నగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో బీసీ సంఘాలు, కుల సంఘాలు, మేధావులు, ఉద్యోగులు ఆదివారం సమావేశమయ్యారు. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే విధించడం, సుప్రీంకోర్టుల ద్వారా కూడా అడ్డుకోవాలని మిగతా 2లో..

## ఇందుకు సంబంధించి 24 గంటల్లో జీవో తెస్తాం
# ఎస్సారెస్పీ-2కి రాంరెడ్డి దామోదర్ రెడ్డి పేరు
### నల్గొండకు గోదావరి జలాలను తెచ్చిన ఘనత ఆయనదే..



- తుంగతుర్తి ప్రజల కోసం దామన్న పనిచేశారు
- ఆయన కుటుంబానికి కాంగ్రెస్ అధిష్ఠానం అండగా ఉంటుంది
- వారి కుటుంబ సభ్యులకు రాజకీయంగా అవకాశం ఇస్తాం
- ఈ విషయం స్వయంగా సోనియా గాంధీయే చెప్పారు
- మాజీ మంత్రి సంస్మరణ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

తుంగతుర్తి (జనంసాక్షి) నల్గొండలో గోదావరి నీళ్లు ప్రవహిస్తున్నాయంటే దామన్న వల్లే అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఎస్సారెస్పీ-2కి ఆర్‌డీఆర్ (మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి) అని నామకరణం చేస్తామన్నారు. ఇందుకు సంబంధించి 24 గంటల్లో జీవో తెస్తామన్నారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలో రాంరెడ్డి దామోదర్ రెడ్డి సంస్మరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.'నల్గొండ జిల్లాలో కాంగ్రెస్ పార్టీని దామన్న నిలబెట్టారు. ఆనాటి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ఎస్సారెస్పీ ప్రాజెక్టును తీసుకొచ్చారు. తుంగతుర్తి ప్రజల కోసం దామన్న పనిచేశారు. ఆయన కుటుంబానికి కాంగ్రెస్ అధిష్ఠానం అండగా ఉంటుందని సోనియా గాంధీ చెప్పారు. ఆయన కుటుంబానికి రాజకీయంగా అవకాశం ఇస్తాం. దామన్న మృతి పట్ల సోనియా గాంధీ, మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ సంతాపం తెలిపారు" అని రేవంత్‌రెడ్డి తెలిపారు. కష్టకాలంలో కూడా తాను నమ్మిన కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతం కోసం చివరి శ్వాస వరకు కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం కృషి చేసిన మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి మరణం పార్టీకి తీరని లోటని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.ఆదివారం మండల కేంద్రంలో మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి సంతాప సభలో పాల్గొని ఆర్డీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మిగతా 2లో..



# హైదరాబాద్ శివారులో డ్రైపోర్టు

- రేపల్లె-మచిలీపట్నం రైల్వేలైనే కీలకం
- తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు
- తుది దశలో ఉన్న సర్వే ప్రక్రియ

హైదరాబాద్(జనంసాక్షి):రేపల్లె-మచిలీపట్నం రైలు మార్గం పూర్త యితే సరకు రవాణా సులభం - తుది దశలో ఉన్న రైల్వే సర్వే ప్రక్రియ - డ్రై పోర్టును నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వ కసరత్తు తెలం గాణ రాష్ట్రంలో తీరప్రాంతం లేకపోవడంతో హైదరాబాద్ శివారులో డ్రైపోర్టు నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టింది. ప్రతిపా దిత డ్రైపోర్టు నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని మచిలీపట్నం పోర్టును రైలు మార్గం ద్వారా కనెక్టివిటీ చేయాలన్నది ప్రణాళిక. ఇది కార్యరూపం దాలిస్తే తెలంగాణ నుంచి విదేశాలకు సముద్ర మార్గంలో జరిగే ఎగుమతులు, దిగుమతుల రవాణా మరింత సుల భతరమవు తుంది. ప్రస్తుతం హైదరాబాద్ నుంచి రేపల్లె వరకు మాత్రమే రైల్వే నెట్‌వర్క్ ఉంది. రేపల్లె-మచిలీపట్నం మధ్య ఇప్పటివరకు రైల్వేలైను లేదు గానీ దానికి సర్వే మంజూరై ఆ ప్రక్రియ చివరి దశలో ఉంది. నవంబ రుకల్లా సర్వే పూర్తి చేసి డిసెంబరులో రైల్వేబోర్డుకు నివేదిక మిగతా 2లో..

# సరిగ్గా వాదనలు వినిపించలేదనుకుంట

కేంద్రమంత్రిగా ఉన్నంత మాత్రాన రిజర్వేషన్ల విషయంలో నేను ఏం చేయలేను
సుప్రీంకోర్టు తీర్పునకు వ్యతిరేకంగా రాష్ట్రపతి కూడా ఏం చేయలేరు
మహారాష్ట్రలో మా ప్రభుత్వమే ఉన్నప్పటికీ ఏం చేయలేకపోయాం::కిషన్ రెడ్డి



హైదరాబాద్(జనంసాక్షి):బీసీరిజర్వేషన్లపై హైకోర్టులో వాదనలు వినిపించ డంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శిం చారు. ఆదివారం ఆయన మీడియాతో ఇష్టాగోష్టి నిర్వహించారు. " కేంద్ర మంత్రిగా కిషన్‌రెడ్డి ఉన్నంత మాత్రాన రిజర్వేషన్ల విషయంలో ఏం చేయ గలడు. సుప్రీంకోర్టు తీర్పునకు వ్యతిరేకంగా రాష్ట్రపతి కూడా ఏం చేయ లేరు. మిగతా 2లో..

# రెండేళ్ల తర్వాత కూడా కేసీఆర్‌ను నిందిస్తారా?

- కాంగ్రెస్ నేతలు ఇంకా ఆయన్ను విమర్శిస్తూనే ఉన్నారు
- హామీల అమలుపై ప్రశ్నిస్తే బెదిరింపులా!:కేటీఆర్



హైదరాబాద్(జనంసాక్షి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్‌ను ఓడించాలని పార్టీ శ్రేణులను భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కోరారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతున్నా కాంగ్రెస్ నేతలు ప్రతిదానికీ ఇంకా కేసీఆర్‌నే నిందిస్తున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలుపై సీఎం రేవంత్‌రెడ్డిని అడిగితే ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. జూబ్లీహిల్స్ ప్రజలు కారు కావాలా.. బుల్డోజర్ కావాలా నిర్ణయించుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ మిగతా 2లో..

# రిజర్వేషన్‌కు కట్టుబడ్డాం
### కాంగ్రెస్ చేసిన చట్టాలకు ఎన్డీయే తూట్లు పొడిచింది

- ఆర్టీఐ చట్టానికి సవరణలు చేసి.. దాని స్వతంత్రతను బలహీన పరిచారు
- ఈ చట్టాన్ని నీరు గార్చేందుకే కమిషనర్ పోస్టులను భర్తీ చేయట్లేదు
- దూరదృష్టితో యూపీఏ ప్రభుత్వం సమాచారహక్కు చట్టం తీసుకొచ్చింది
- టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ మహేశ్‌కుమార్ గౌడ్


హైదరాబాద్(జనంసాక్షి): ఎట్టిపరిస్థితుల్లోనూ బీసీ రిజర్వేషన్‌లకు కట్టుబడి ఉన్నామని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.కాంగ్రెస్ తీసుకొచ్చిన గొప్ప చట్టాలకు ఎన్డీయే ప్రభుత్వం తూట్లు పొడిచిందని అన్నారు. ఆర్టీఐ చట్టానికి సవరణలు చేసి.. దాని స్వతంత్రతను బలహీన పరిచారని మండిపడ్డారు. ఆర్టీఐను నీరు గార్చేందుకే కమిషనర్ పోస్టులను భర్తీ చేయట్లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలో 11 మంది ఆర్టీఐ కమిషనర్లు ఉండాల్సిన చోట ఇద్దరే ఉన్నారని చెప్పారు. ఆర్టీఐ తీసుకొచ్చి 25 ఏళ్లయిన సందర్భంగా దాని గొప్పతనం తెలియజేయాలనుకున్నామని పేర్కొన్నారు. దూరదృష్టితో యూపీఏ ప్రభుత్వం సమచారహక్కు చట్టం తీసుకొచ్చిందన్నారు."సరుకుల పంపిణీ, పెన్షన్‌లు, బకాయిలు, స్కాలర్‌షిప్‌లు వంటి హక్కులను సాధించుకునే శక్తిని ప్రజలకు ఇచ్చింది.ఉపాధి కోసం అప్పటి యూపీఏ ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని తీసుకొచ్చింది.ఈ చట్టం ప్రజలకు ప్రభుత్వ విభాగాల సమాచా



రాన్ని అందుబాటులోకి తెచ్చి పాలనలో పారద ర్శకత, బాధ్యతాయుతమైన విధానాన్ని తీసుకొచ్చింది.అటవీ హక్కుల చట్టం (2006),విద్య హక్కు చట్టం (2009), భూసేకరణ న్యాయమైన పరిహారం చట్టం (2013), ఆహార భద్రత చట్టం (2013) లో చట్టాలు ప్రజలకు సంపూర్ణ హక్కులను యుపిఎ ప్రభుత్వం కల్పించింది 2014లో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తూట్లు పొడుస్తోందని మహేశ్‌కుమార్ విమర్శించారు.

# సమసిన వివాదం

**విమర్శల వేళ మహిళా జర్నలిస్టులను ఆహ్వానించిన అఫ్గాన్ మంత్రి**



న్యూఢిల్లీ(జనంసాక్షి):అఫ్గాన్ విదేశాంగ మంత్రి ఆమిర్‌ఖాన్ ముత్తాఖీ దిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఉద్దేశపూర్వకంగానే మహిళలు పాల్గొనకుండా నిషేధం విధించారంటూ విమర్శలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆదివారం దిల్లీలో జరగనున్న విలేకరుల సమావేశానికి హాజరు కావాల్సిందిగా అఫ్గాన్ విదేశాంగ మంత్రి మహిళా జర్నలిస్టులను ఆహ్వానించారు.శుక్రవారం దిల్లీలోని అఫ్గానిస్థాన్ ఎంబసీలో ముత్తాఖీ మీడియా మిగతా 2లో..

## చీరాలలో విషాదం
### సముద్రంలో ఐదుగురు గల్లంతు



# సగం.. సగం

- ఎన్డీయే అభ్యర్థుల ఎంపిక కొలిక్కి..
- భాజపా, జేడీయూకు చెరో 101 స్థానాలు..
- నలుగురు సిట్టింగ్‌లకు ఉద్వాసన

పాట్నా(జనంసాక్షి):బిహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అధికార ఎన్డీయే కూటమి పార్టీల్లో సీట్ల కేటాయింపుపై ముమ్మర కసరత్తు కొనసాగుతోంది. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్‌కు చెందిన జేడీయూలో అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ కొలిక్కి వచ్చినట్లు సమాచారం. 243 స్థానాల్లో 103 స్థానాల్లో పోటీ చేసే అవకాశం ఉందని ఓ సీనియర్ నేత వెల్లడించారు. దాదాపు అన్ని స్థానాల్లో అభ్యర్థుల పేర్లు ఖరారయ్యాయని, నలుగురు సిట్టింగ్ ఎమ్మెల్యేలకు ఉద్వాసన పలికే అవకాశం ఉందని చెప్పారు. వారి పేర్లను మాత్రం ఆయన వెల్లడించలేదు."జేడీయూ పోటీ మిగతా 2లో..





# ట్రంప్ సుంకాల బెదిరింపులకు భయపడం





### వారి చర్యలను దీటుగా ఎదుర్కొంటాం • అమెరికా టారీఫ్‌లపై చైనా స్పందన

బీజింగ్(జనంసాక్షి): అగ్రరాజ్యం అమెరికా , డ్రాగన్ కంటీ చైనా మధ్య టారిఫ్‌ల విషయంలో మరో సారి మాటల యుద్ధం నడుస్తోంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన టారిఫ్‌ల అంశంపై తాజాగా చైనా స్పందించింది.ఈ సందర్భంగా అమెరికా ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తోందని తీవ్ర విమర్శలు చేసింది. ఇలాంటి నిర్ణయాలు రెండు దేశాల మధ్య ఆర్థిక, వాణిజ్య చర్చల వాతావరణాన్ని దెబ్బతీస్తాయని ఆగ్రహం వ్యక్తం చేసింది.ట్రంప్ నిర్ణయాలపై తాజాగా చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ కౌంటర్ ఇచ్చింది. అమెరికా ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తోందని విమర్శించింది. ఈ చర్యలు చైనా ప్రయోజనాలకు తీవ్రంగా హాని కలిగిస్తాయని పేర్కొంది. రెండు వైపులా ఆర్థిక, వాణిజ్య చర్చల వాతావరణాన్ని దెబ్బతీస్తాయని వివరించింది. ప్రతీ విషయంలోనూ చైనాపై అధిక సుంకాలు విధిస్తామని బెదిరించడం సరైన మార్గం కాదు. అమెరికా తన తప్పుడు పద్ధతులను వెంటనే సరిదిద్దుకోవాలి. చైనా-అమెరికా మధ్య స్థిరమైన వాణిజ్య సంబంధాలను మేము కోరుకుంటున్నాం. ట్రంప్ నిర్ణయాలు ఇలాగే కొనసాగితే చైనా తన చట్టబద్ధమైన హక్కులు, ప్రయోజనాలను కాపాడుకోవడానికి తగిన చర్యలు తీసుకుంటుంది అని హెచ్చరించింది .కాగా, అమెరికాకు అరుదైన ఖనిజాల ఎగుమతులపై చైనా ఆంక్షలు విధించడంపై ట్రంప్ ఇటీవల ఆగ్రహం వ్యక్తం చేశారు. సోషల్ మీడియా వేదికగా చైనా తీరు తనను షాక్‌కు గురిచేసిందని పేర్కొన్నారు. అనంతరం, చైనా ఉత్పత్తులపై అదనంగా 100 శాతం టారిఫ్‌లు విధించబోతున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరో బాంబు పేల్చారు. మిగతా 2లో..

## గాజా శాంతి ఒప్పందానికి
# హాజరు కండి
### ప్రధాని మోదీని ఆహ్వానించిన ట్రంప్!

వాషింగ్టన్(జనంసాక్షి): ఈజిప్టులోని షర్మ్-ఎల్ షేక్‌లో సోమవారం గాజా శాంతి ఒప్పందం జరగనుంది. ఈ శాంతి ఒప్పందానికి హాజరు కావాల్సిందిగా భారత ప్రధాని నరేంద్ర మోదీని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆహ్వానించినట్లు జాతీయ మీడియా వర్గాలు పేర్కొంటున్నాయి. ఈజిప్ట్ అధ్యక్షుడు అబ్దేల్ ఫత్తా అల్-సిసి సైతం మోదీని ఆహ్వానించినట్లు సమాచారం. చివరి నిమిషంలో ప్రధాని మోదీకి ఈ ఆహ్వానం అందినట్లు వార్తలు వస్తున్నాయి. అమెరికా-భారత్ మిగతా 2లో..





## మరో మహమ్మారి
# విజృంభణ
### జపాన్‌లో వ్యాపిస్తున్న ఇన్‌ఫ్లుఎంజా
### జనజీవనం అతలాకుతలం.. పాఠశాలలు మూసివేత

టోక్యో(జనంసాక్షి):ఇన్‌ఫ్లుఎంజా (ఫ్లూ) మహమ్మారితో జపాన్ అతలాకుతలమవుతోంది. సుమారు ఐదు వారాలుగా ఈ వ్యాధి విస్తృతంగా వ్యాపిస్తోంది. ఫ్లూ కేసుల పెరుగుదల దేశంలో ఆరోగ్య అత్యవసర పరిస్థితికి దారి తీసింది.ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు, దీర్ఘకాలిక అనారోగ్యాలతో ఇబ్బంది పడుతున్నవారు ఫ్లూ బారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలంతా ఫ్లూ టీకాలు తీసుకోవాలని, ఆరోగ్య రక్షణ చర్యలను పాటించాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు. ఈ ఫ్లూ వ్యాప్తి.. జపాన్‌లో కోవిడ్-19 తరహా మిగతా 2లో..

## హైదరాబాద్ శివారులో డ్రైపోర్టు

సమర్పించాలన్నది లక్ష్యంగా పెట్టుకున్నారు. రానున్న కేంద్ర బడ్జెట్‌లో ఈ ప్రాజెక్టును మంజూరు చేస్తే డ్రైపోర్టు- బందరు పోర్టు అనుసం ధానతకు మార్గం సుగమమవుతుందిరాష్ట్ర ప్రభుత్వం, దక్షిణ మధ్య రైల్వే ఉన్నతా ధికారుల మధ్య జరిగిన సమావేశంలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్ ఇటీవల వరంగల్ నగరానికి వచ్చిన సందర్భంలోనూ ఈ విషయంపై కీలక చర్చ జరిగింది. రేపల్లె నుంచి మచిలీపట్నం లైను అనుసంధానంలో ప్రస్తుతం అవకాశాలు ఎక్కడివరకు ఉన్నాయి. దక్షిణ మధ్య జోన్ పరిధిలోని ఈ మార్గంలో ఇంకా చేపట్టాల్సిన చర్యలు ఆ ప్రతిపాదనల తాజా స్థితిగతుల గురించి దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలంగాణ ప్రభుత్వానికి కొద్దిరోజుల క్రితం జరిగిన సమావేశంలో వివరించారు.గూడ్సు రైళ్ల ద్వారా ఎగుమతులు : రేపల్లె-మచిలీపట్నం మధ్య రైల్వే లైను నిర్మాణం కోసం సర్వే తుది దశలో ఉందన్నారు. ఈ రెండు ప్రాంతాల మధ్య కేవలం 45.30 కిలో మీటర్ల రైల్వే లైను నిర్మిస్తే డ్రైపోర్టు అనుసంధానం అవుతుందని తెలిపారు. ఇది పూర్తయితే గూడ్సు రైళ్ల ద్వారా ఎరువులు, వడ్లు, బియ్యం, గ్రానైట్, బొగ్గు వంటివి తెలం గాణ నుంచి నేరుగా బందరు పోర్టు వరకు సులభంగా రవాణా చేయవచ్చు. విజయవాడ రైల్వే జంక్షన్‌పై కూడా చాలా మేరకు ఒత్తిడి తగ్గుతుంది.

## సమసిన వివాదం

సమావేశం నిర్వహించారు. ఇందులో ఒక్క మహిళ కూడా కనిపించలేదు. మహిళా జర్నలిస్టులు పాల్గొనకుండా అడ్డుకున్నారని వార్తలు వచ్చాయి. ఇదే విషయాన్ని వెల్లడిస్తూ కొందరు మహిళా పాత్రికేయులు సోషల్ మీడియా ద్వారా ఆగ్రహం వ్యక్తంచేశారు. ముత్తాఖీ (%గూఎఅతీ ఖష్ఘుఅ వీఖ్ఘునఆ%) పాల్గొన్న మీడియా సమావేశంలో తాము ఉద్దేశపూర్వకంగా మహిళలను మినహాయించలేదని తాలిబన్ అధికారి వెల్లడించారు. మహిళలపై తమకు ఎలాంటి వివక్ష లేదని పాస్‌ల సంఖ్య పరిమితంగా ఉండడంతో కొందరినే ఆహ్వానించామని అన్నారు. ఈ వ్యవహారంలో తమ ప్రమేయం ఏమీ లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.

## సరిగ్గా వాదనలు వినిపించలేదనుకుంట!

మహారాష్ట్రలో మా ప్రభుత్వమే ఉన్నప్పటికీ ఏం చేయలేకపోయాం. ఎన్నికలు ముగిసిన తర్వాత కూడా అక్కడ.. బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా తీర్పు వచ్చింది. సుప్రీంకోర్టులో.. రిజర్వేషన్లకు 50శాతం క్యాప్ పెట్టిందే కాంగ్రెస్ ప్రభుత్వం హాయంలోనే. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం 50శాతం క్యాప్‌నకు వ్యతిరేకంగా వాదనలు వినిపించడంలో విఫలమైంది. ఇప్పుడు హైకోర్టులో వాదనలు వినిపించడంలో విఫలమైంది. రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లాలన్న నిర్ణయాన్ని స్వాగతిస్తాం. బీసీ రిజర్వేషన్ల కోసం భాజపా పూర్తి మద్దతు ఉంటుంది. జూబ్లీహిల్స్ అభ్యర్థి కోసం 3 పేర్లను జాతీయ పార్టీకి పంపించాం. పార్లమెంటరీ బోర్డు మీటింగ్ తర్వాత అభ్యర్థి ప్రకటన ఉటుంది" అని కిషన్‌రెడ్డి తెలిపారు.

## అధికారంలోకి వస్తే.. మద్యపాన నిషేధం ఎత్తివేస్తాం

**జన్ సురాజ్ పార్టీ**

**పాట్నా(జనంసాక్షి):** బిహార్‌లో తాము అధికారంలోకి వస్తే రాష్ట్రంలో మద్య పానంపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తామని జన్ సురాజ్ పార్టీ మరోసారి స్పష్టం చేసింది. తద్వారా వచ్చే వేల కోట్ల ఆదాయంతో.. రూ.లక్షల కోట్ల రుణాలు సేకరించేందుకు ఉపయోగిస్తామని తెలిపింది. లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్)కి చెందిన కీలక నేత కుమార్ సౌరభ్ చేరిక సందర్భంగా జన్ సురాజ్ పార్టీ ఈ వ్యాఖ్యలు చేసింది."వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తే రాష్ట్రంలో మద్యపాన నిషేధాన్ని వెంటనే ఎత్తేస్తామని చెబుతున్నాం. తద్వారా రూ.28వేల కోట్ల రెవెన్యూ నష్టాన్ని భర్తీ చేస్తాం. వీటిని ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి నుంచి రూ.5-6లక్షల కోట్ల రుణాలను సమీకరించేందుకు ఉపయోగిస్తాం" అని జన్ సురాజ్ పార్టీ జాతీయ అధ్యక్షుడు ఉదయ్ సింగ్ పేర్కొన్నారు. పార్టీలో చేరిన సౌరభ్‌కు ఆర్థిక, న్యాయ అంశాల్లో ప్రావీణ్యం ఉందన్న ఆయన.. ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్‌ల నుంచి రూ.లక్షల కోట్ల రుణాలను తీసుకువచ్చేందుకు ఈయనకున్న బ్యాంకింగ్ రంగ అనుభవాలు ఉపయోగపడతాయన్నారు. సౌరభ్ మాట్లాడుతూ.. పీకేతో కలిసి పనిచేసేందుకే జన్ సురాజ్‌లో చేరినట్లు చెప్పారు. బిహార్‌లో మద్యపాన నిషేధాన్ని నీతీశ్ కుమార్ ప్రభుత్వం ఏప్రిల్ 2016 నుంచి అమలు చేస్తోంది. రాష్ట్రంలో తాము అధికారంలోకి వస్తే.. తమ ప్రభుత్వం ఏర్పాటైన గంటలోనే మద్యపాన నిషేధాన్ని ఎత్తివేస్తామని ప్రశాంత్ కిశోర్ ఇదివరకు ప్రకటించారు. ఇదే వైఖరిని జన్ సురాజ్ మరోసారి స్పష్టం చేసింది.

## తెలంగాణకు నాలుగు రోజులు పాటు వర్షాలు

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణలో పలు జిల్లాల్లో నాలుగు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. దక్షిణ కోస్తాంధ్ర, పరిసర ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం సగటు సముద్రమట్టానికి 3.1 కిలోమీటర్ల వరకు విస్తరించిందని ఉందని తెలిపింది. ఆదివారం జయశంకర్, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని తెలిపింది. సోమవారం పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, నాగర్ కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది.

## పాప్‌స్టార్‌తో డేటింగ్‌లో ట్రూడో..

**ఒట్టావా:** కెనడా మాజీ ప్రధాని జస్టిన్ ట్రూడో అమెరికన్ పాప్‌స్టార్ కేటీ పెర్రీతో డేటింగ్‌లో ఉన్నారంటూ వార్తలు వస్తున్న వేళ తాజాగా ఆసక్తికర విషయం వెలుగులోకి వచ్చింది. ఓ నౌకపై పెర్రీతో ట్రూడో విహరిస్తున్న ఫొటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. చొక్కా లేకుండా ఉన్న ట్రూడో.. స్విమ్‌సూట్‌లో ఉన్న పెర్రీని కిస్ చేస్తున్నట్లు అందులో కనిపించింది.ఈ ఏడాది జులైలో ట్రూడో-పెర్రీలు మాంట్రియాల్‌లోని ఓ రెస్టరంట్‌లో తొలిసారి కనిపించారు. ఆ సాయంత్రం దాదాపు రెండు గంటల పాటు గడపడం మీడియా దృష్టిని ఆకర్షించింది. దీంతో వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నారనే ప్రచారం మొదలైంది. ట్రూడో-కేటీలు దీనిపై ఇప్పటివరకు స్పందించలేదు. ఈ క్రమంలోనే కాలిఫోర్నియాలోని శాంటా బార్బరా తీరంలో ఓ ఖరీదైన నౌకపై ఇటీవల విహరించినట్లు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వచ్చాయి. అత్యంత సన్నిహితంగా ఉన్న ఫొటోలు కూడా వైరల్ అయ్యాయి. దాదాపు దశాబ్దం పాటు కెనడా ప్రధానిగా ఉన్న ట్రూడో ఈ ఏడాది జనవరిలో తన పదవికి రాజీనామా చేశారు. అంతకుముందు 18 ఏళ్ల వివాహ బంధానికి ముగింపు పలికిన ఆయన.. భార్య సోఫీ గ్రెగొరీతో 2023 ఆగస్టులో విడిపోయారు. వీరికి ముగ్గురు పిల్లలు. ఇక 13 సార్లు గ్రామీ అవార్డుకు నామినేట్ అయిన కాలిఫోర్నియాకు చెందిన పాప్‌స్టార్ కేటీ పెర్రీ వ్యక్తిగత జీవితం కూడా ఇటీవల వార్తల్లో నిలిచింది. నటుడు ఓర్లాండో బూమ్‌తో ఏడేళ్లుగా కలిసి ఉన్న ఆమె.. ఈ ఏడాది జూన్‌లో విడిపోయింది. 2020లో వీరికి ఓ అమ్మాయి జన్మించింది.

# ఎస్సారెస్పీ-2కి రాంరెడ్డి దామోదర్ రెడ్డి పేరు

ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఫ్లోరైడ్ మహమ్మారిని తరిమేయడంతోపాటు ఈ ప్రాంత రైతాంగానికి గోదావరి జలాలు తీసుకొచ్చి సస్యశ్యామల చేయాలని ఉద్దేశంతో లక్షలాది మందితో రక్తతర్పణ కార్యక్రమం నిర్వహించారని అన్నారు.నాటి సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డిని ఒప్పించి తుంగతుర్తి ప్రాంత రైతాంగానికి గోదావరి జలాలు తీసుకొచ్చిన ఘనత ఆయనకే దక్కిందన్నారు.దామోదర్ రెడ్డి మరణించడం ఎంతో బాధాకరమని అన్నారు.తన జీవితకాలమంతా ప్రజలకే సేవ చేశారని అన్నారు. ఆర్డీఆర్ రాజకీయాల్లోకి వచ్చిన 40 సంవత్సరాల కాలంలో ఐదు సార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు మంత్రిగా పని చేసిన ఆయన వారసత్వంగా వచ్చిన ఆస్తులు మొత్తం ప్రజల కోసం ధారపోశారని అన్నారు.కక్షలు కార్పన్యాలు ఉన్న తుంగతుర్తి ప్రాంతంలో వాటన్నింటిని ఎదుర్కొని కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేశారని అన్నారు.ఒకవైపు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను కాపాడుకుంటూనే,మరోవైపు సాగునీరు లేక ఎడారిలా మారిన తుంగతుర్తి ప్రాంతానికి ఎస్సారెస్పీ నీళ్లు తేవడానికి అనేక ఉద్యమాలు సాగించాడని అన్నారు.తమ ప్రాంతంకు గోదావరి జలాలను తీసుకువచ్చి ఈ ప్రాంత రైతాంగానికి అందించాలని ముందుకు కదిలారని, అప్పటి సీఎం చంద్రబాబు నాయుడుపై ఒత్తిడి తీసుకువచ్చి దాన్ని సాధించడంలో కీలకపాత్ర పోషించారని కొనియాడారు.ముఖ్యంగా రిజర్వేషన్లపరంగా తుంగతుర్తి నియోజకవర్గం ఎస్సీకి మారడంతో పక్కనే ఉన్న సూర్యాపేటకు వెళ్లినప్పటికీ తుంగతుర్తి ప్రాంతాన్ని ఏనాడు మర్చిపోలేదని అన్నారు.తుంగతుర్తి ప్రాంతంలో దామోదర్ రెడ్డి వేసిన బీజం వల్లనే మందుల సామేలు 50 వేల మెజార్టీతో తుంగతుర్తిలో ఎమ్మెల్యేగా గెలిచారని అన్నారు.రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా దామోదర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీని



గెలిపించేందుకు ముందుండేవారని అన్నారు.ఆయన సోదరుడు దివంగత వెంకటరెడ్డి కూడా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నుండి సుజాతనగర్ నియోజకవర్గం నుండి గెలుపొందారని అన్నారు. ఇద్దరు సోదరులు కూడా కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేస్తూ తమ తుది శ్వాస వరకు కాంగ్రెస్ జెండాను మోసారని అన్నారు.దామోదర్ రెడ్డి మృతి పట్ల ఏఐసీసీ కూడా తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేసిందని తెలిపారు.దామోదర్ రెడ్డి మృతి సంతాప సందేశాన్ని రాహుల్ గాంధీ పంపారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అగ్ర నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే దామోదర్ రెడ్డి కుటుంబానికి అండగా ఉంటామని తమతో చెప్పారని అన్నారు.భవిష్యత్ రాజకీయాలలో ఆయన కుమారుడు సర్వోత్తమ రెడ్డికి అండగా ఉంటామని చెప్పారు.అంతకు ముందు రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వి.హనుమంతరావుతో పాటు పలువురు నేతలు ఎస్సారెస్పీ ఫేజ్ -2 కు దామోదర్ రెడ్డి పేరు పెట్టాలని సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేయడంతో పాటు వినతిపత్రం సమర్పించారు. దీంతో స్పందించిన సీఎం శ్రీరామ్ సాగర్ రెండో దశ ప్రాజెక్టుకు దామోదర్ రెడ్డి పేరును నామకరణం చేస్తున్నట్లు ప్రకటించారు. 24 గంటల్లోగా దీనికి సంబంధించిన జీవో జారీ చేస్తామని హామీ ఇచ్చారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ తాను నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేసిన వ్యక్తి రాంరెడ్డి దామోదర్ రెడ్డి అందరికీ ఆదర్శప్రాయుడని అన్నారు.ఆయన తన ఆరోగ్యం, వయసును సైతం లెక్క చేయకుండా ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేసే స్వభావం కలవారని అన్నారు.ఆయన మృతితో ఈ ప్రాంతం గొప్ప కాంగ్రెస్ నాయకుడిని కోల్పోయిందని, ఆయన మృతి దురదృష్టకరమని పేర్కొన్నారు.ఆర్డీఆర్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ ఘనమైన నివాళులు అర్పిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎమ్మెల్యేలు మందుల సామేలు, వేముల వీరేశం, బాలు నాయక్, రామచంద్రనాయక్, రాగమయి దయానంద్, ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, శంకర్ నాయక్, సత్యం, మాజీ మంత్రి జానారెడ్డి, ఎంపీ రఘువీర్ రెడ్డి,రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి,సూర్యాపేట డీసీసీ అధ్యక్షులు చెవిటి వెంకన్న యాదవ్, సిపిఐ ఎమ్మెల్యే కె.సాంబశివరావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత హనుమంతరావు, సూర్యాపేట మార్కెట్ కమిటీ చైర్మన్ వేనారెడ్డి, చకిలం రాజేశ్వరరావు, గుడిపాటి నరసయ్య, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తిరుమల ప్రగడ అనురాధ కిషన్ రావు, పోతు భాస్కర్ తోపాటు సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## సగం.. సగం..



చేయనున్న స్థానాలను ఇప్పటికే గుర్తించాం. ఆయా అభ్యర్థులను కూడా ఖరారు చేశాం. పనితీరు బాగాలేని నలుగురు సిట్టింగ్ ఎమ్మెల్యేలను కొత్తవారితో భర్తీ చేసే అవకాశం ఉంది. భాగల్‌పుర్, నవాదా, బంకా జిల్లాల్లో ఈ నాలుగు అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. అదేవిధంగా గత వారం మా ఎమ్మెల్యే సంజీవ్ కుమార్ ఆర్జేడీలో చేరిన నేపథ్యంలో.. పర్బత్తా స్థానంలో కొత్త అభ్యర్థిని బరిలోకి దింపనున్నాం. మాజీ ఎమ్మెల్యే బీమా భారతీ ప్రతిపక్ష పార్టీలో చేరడంతో.. రుపౌలిలోనూ ఇదే విధంగా ముందుకెళ్తాం" అని జేడీయూ నేత తెలిపారు. సీట్ల సర్దుబాటుపై ఎన్డీయే సీనియర్ నేతలు తగిన సమయంలో అధికారిక ప్రకటన చేస్తారన్నారు.

**పార్టీల్లో సీట్ల సిగపట్లు!**

ఎన్డీయేలో సీట్ల సర్దుబాటుపై ఆదివారం ప్రకటన వెలువడుతుందని భాజపా బిహార్‌శాఖ అధ్యక్షుడు దిలీప్ జైశ్వాల్ ఇప్పటికే తెలిపారు. కాషాయ పార్టీ 102 స్థానాల్లో పోటీ చేయనున్నట్లు సంబంధిత వర్గాల సమాచారం. గత అసెంబ్లీ ఎన్నికల్లో 22 సీట్లలో పోటీ చేసిన లోక్ జన్‌శక్తి పార్టీ (రాంవిలాస్) అధినేత, కేంద్ర మంత్రి చిరాగ్ పాస్వాన్.. ఈసారి అదనపు సీట్లు అడుగుతున్నారు. ఎన్డీయేలోని హిందుస్థానీ అవామ్ మోర్చా (హెచ్ఏఎం), రాష్ట్రీయ లోక్‌మోర్చా (ఆర్ఎల్ఎం)లకు గౌరవప్రదమైన సంఖ్యలో సీట్ల కేటాయింపు ఉంటుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. రాష్ట్రంలో వచ్చే నెల 6, 11వ తేదీల్లో రెండు దశల్లో పోలింగ్, 14న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

## ట్రంప్ సుంకాల బెదిరింపులకు భయపడం

ఇవి నవంబర్ 1వ తేదీ లేదా అంతకంటే ముందే అమల్లోకి వస్తాయని స్పష్టంచేశారు. అంతేకాకుండా నవంబర్ 1 నుంచి క్రిటికల్ సాఫ్ట్‌వేర్ ఎగుమతులపై కొన్నిరకాల నియంత్రణలు విధిస్తామని తేల్చిచెప్పారు. ఇక, చైనా ఉత్పత్తులపై ఇప్పటికే 30 శాతం సుంకాలు అమలవుతున్నాయి. ట్రంప్ ప్రకటించిన అదనపు సుంకాలతో కలిపితే మొత్తం సుంకాలు ఏకంగా 130 శాతానికి చేరడం గమనార్హం.ప్రతీకార చర్యల్లో భాగంగానే చైనా ఉత్పత్తులపై 100 శాతం అదనపు సుంకాలు ప్రకటించినట్లు తెలుస్తోంది. అరుదైన ఖనిజాల విషయంలో అసలేం జరగబోతోందో చూద్దామని, అందుకే నవంబర్ 1వ తేదీని డెడ్‌లైన్‌గా విధించామని పేర్కొన్నారు. నియంత్రణల విషయంలో చైనా వెనక్కి తగ్గితే అదనపు టారిఫ్‌ల నిర్ణయాన్ని ఉపసంహరించుకుంటామని పరోక్షంగా సంకేతాలిచ్చారు.

## గాజా శాంతి ఒప్పందానికి హాజరు కండి

మధ్య కొనసాగుతున్న వాణిజ్య చర్చలు, వీసా ఫీజుల పెంపు నేపథ్యంలో ట్రంప్ నుంచి మోదీకి ఆహ్వానం అందడం గమనార్హం. అయితే.. ఈ విషయంపై కేంద్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి అధికారిక ప్రకటన లేదు. ఈజిప్ట అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఈజిప్ట్ అధ్యక్షుడు అబ్దేల్ ఫత్తా అల్-సిసిల అధ్యక్షతన సోమవారం మధ్యాహ్నం గాజా శాంతి ఒప్పందం జరగనుంది. ఈ కార్యక్రమానికి ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్, బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ సహా 20కిపైగా దేశాల నాయకులు హాజరయ్యే అవకాశముంది. అయితే ఇందులో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు పాల్గొంటారా లేదా అనే విషయంపై స్పష్టత లేదు. గాజా స్ట్రిప్‌లో యుద్ధాన్ని ముగించి.. శాంతి, స్థిరత్వాన్ని నెలకొల్పడమే లక్ష్యంగా ఈ శిఖరాగ్ర సమావేశం జరగనుంది.


గాజాలో కొనసాగుతున్న కాల్పుల విరమణ

సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న ఇజ్రాయెల్- హమాస్ మధ్య యుద్ధాన్ని ముగించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 21 సూత్రాల శాంతి ఫార్ములాను సూచించిన సంగతి తెలిసిందే. దానిని భారత్, రష్యా, చైనా సహా పలు దేశాలు ఆహ్వానించాయి. శాంతి ఒప్పందంలో భాగంగా సోమవారం హమాస్ చెరలోని బందీలు విడుదల కావొచ్చని ట్రంప్ పేర్కొన్నారు. ప్రతిగా ఇజ్రాయెల్ రెండు వేలకుపైగా పాలస్తీనా ఖైదీలను విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది.

## అసలు హింసే జరగలేదు

**భారత్‌పై యూనస్ తీవ్ర ఆరోపణలు**

**ఢాకా(జనంసాక్షి):** బంగ్లాదేశ్ ప్రధాన సలహాదారు ముహమ్మద్ యూనస్ భారత్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. తమ దేశంలో హిందువులపై ఏమాత్రం హింస జరగడం లేదని, అయితే భారత్ దీనికి భిన్నంగా తప్పుడు వార్తలు ప్రచారం చేస్తున్నదని ఆరోపించారు.గత ఏడాది షేక్ హసీనా ప్రభుత్వ పతనం తర్వాత హిందువులపై మత పరమైన హింస జరిగిందంటూ వచ్చిన పలు అంతర్జాతీయ నివేదికలను ముహమ్మద్ యూనస్ తోసిపుచ్చారు. అవి భారతదేశం ప్రచురించిన అబద్ధపు వార్తలని పేర్కొన్నారు.ఇటీవల యూఎస్ జర్నలిస్ట్ మెహదీ హసన్‌తో జరిగిన ఇంటర్వ్యూలో పాల్గొన్న ముహమ్మద్ యూనస్.. భూ విభజన, ఇతర స్థానిక సమస్యలపై పొరుగువారితో సాధారణ ఘర్షణలు ఉన్నాయని, అయితే వీటిని మతపరంగా చిత్రీకరించకూడదన్నారు. భారతదేశం ఎల్లప్పుడూ ఫేక్ వార్తలలో ఒత్తిడి తెస్తున్నదని, అందుకే వీటిపై తమ ప్రభుత్వం చాలా అప్రమత్తంగా ఉందని ఆయన పేర్కొన్నారు. హసీనా పదవీచ్యుతురాలైన వెంటనే తమ దేశంలో మతపరమైన సంఘటనలకు సంబంధించిన నివేదికలు ప్రపంచవ్యాప్తంగా ముఖ్యాంశాలుగా మారాయన్నారు. హిందువుల విషయంలో యూనస్ ప్రభుత్వం వ్యవహరించిన తీరును అనాగరికమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా విమర్శించారని ఆయన గుర్తు చేశారు.గత నవంబర్‌లో దాదాపు 30 వేల మంది హిందువులు ఢాకా వీధుల్లో ర్యాలీ చేపట్టి, తమపై జరుగుతున్న దాడుల నుంచి యూనస్ ప్రభుత్వం రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే హిందూ నాయకులపై ఉన్న దేశద్రోహ అభియోగాలను ఉపసంహరించుకోవాలని కూడా వారు కోరారు. మరోవైపు చిన్మోయ్ కృష్ణ దాస్ అరెస్టు పలువురు భారతీయులలో తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తించింది. కాగా బంగ్లాదేశ్‌లోని హిందువులు తమను తాము హిందువులుగా కాకుండా బంగ్లాదేశ్ పౌరులుగా భావించాలని యూనస్ విజ్ఞప్తి చేశారు.



## 42% రిజర్వేషన్ సాధనకు జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పాటు

ఇప్పటికే రెడ్డి జాగృతికి చెందిన నేతలు ప్రయత్నిస్తుం డడంతో రాష్ట్రంలోని ప్రముఖంగా ఉద్యమించే బీసీ సంఘాలు సమావేశమై తమతమ సంఘాల ద్వారా కాకుండా ఉమ్మడి ఎజెండాతో బీసీ జేఏసీ ఏర్పాటు ద్వారా ఉద్యమాన్ని ఉధృతం చేయాలని తీర్మానించారు. ఈ సందర్భంగా బీసీ జేఏసీ చైర్మన్‌గా ఆర్ కృష్ణయ్య, వర్కింగ్ చైర్మన్‌గా జాజుల శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్మన్‌గా విజిఆర్ నారగోని, కో చైర్మన్లుగా రాజారాం యాదవ్, దాసు సురేష్, సమన్వయకర్తగా గుజ్జ కృష్ణను ఎన్నుకున్నారు. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే ఇవ్వడాన్ని నిరసిస్తూ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఈ నెల 13న ఇచ్చిన జాతీయ రహదారుల దిగ్బంధం, ఆర్ కృష్ణయ్య ఈ నెల 14న ఇచ్చిన రాష్ట్ర బందును వాయిదా వేసి, అక్టోబర్ 18న తెలంగాణ రాష్ట్ర బంద్‌ను చేపట్టాలని ఏకగ్రీవం గా నిర్ణయించారు. ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ.. జరిగిన అన్యాయంపై బీసీలంతా రాజకీయ పార్టీలకతీతంగా ఏకమై పోరాడాలని, అప్పుడే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దిగొస్తాయని అన్నారు. ఇప్పటి బీసీ రిజర్వేషన్ల ఉద్యమం భవిష్యత్తులో చట్టసభలు, బీసీలకు రిజర్వేషన్లు వరకు నిర్వహించాలని పిలుపునిచ్చారు. జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో 60 శాతం ఉన్న బీసీలను ఐక్యంగా లేరని, బీసీలకు రావలసిన నోటికాడ ముద్దను పిడికెడు శాతం లేని రిజర్వేషన్ వ్యతిరేకులు అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 18న బంద్ ద్వారా బీసీల బలమేందో చాటుతామన్నారు. సమావేశంలో 40 బీసీ సంఘాలు, 110 బీసీ కుల సంఘాలతో పాటు ముఖ్యంగా బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి, కుల్కచర్ల శ్రీనివాస్, కొండ దేవయ్య, శేఖర్ సగర, నీల వెంకటేష్, తాటికొండ విక్రం గౌడ్, కనకాల శ్యాం కుర్మా, కేపీ మురళీకృష్ణ, అనంతయ్య, రామకోటి, వేముల రామకృష్ణ, ఈడిగ శ్రీనివాస్, భూపేష్ సాగర్, గొడుగు మహేష్ యాదవ్, వరికుప్పల మధు, గుజ్జ సత్యం, రమాదేవి, లక్ష్మి, భూమన్న యాదవ్, రాజు నేత, దీటి మల్లయ్య, రాజేందర్, పగిల సతీష్, రామ్మూర్తి, బడే సాబ్ తదితరులు పాల్గొన్నారు.

**దోస్తులెవరో.. ద్రోహులెవరో 18న తేలుతుంది**

**: జాజుల శ్రీనివాస్ గౌడ్**

42 శాతం బీసీ రిజర్వేషన్‌కు ఏ ఒక్క రెడ్డి సంఘం మద్దతు ప్రకటించలేదు. రాష్ట్రంలో 136 కులాలు, 60 శాతం జనాభాగా ఉన్నది బీసీలే. తెలంగాణలోని రెడ్ల ఆధిపత్యాన్ని పాతరేసేందుకే బీసీ జేఏసీ ఏర్పాటైంది. రెడ్లను బీసీలు ముఖ్యమంత్రులను చేస్తే.. రెడ్లు మాత్రం బీసీలను కనీసం సర్పంచులు కూడా కాకుండా అడ్డుకుంటున్నారు. తెలంగాణ గడ్డ మీద బీసీ బిడ్డను ముఖ్యమంత్రిని చేసే దాకా బీసీ జేఏసీ పనిచేస్తుంది. తెలంగాణ బంద్ కార్యక్రమానికి అన్ని రాజకీయ పార్టీలు, సంఘాలు మద్దతివ్వాలి. 18న బీసీలకు దోస్తులెవరో, ద్రోహులెవరో తేలిపోతుంది. ఆత్మగౌరవ ఉద్యమాన్ని పిడికిలి బిగించి అగ్గి రాజేస్తే బంద్ సెగ ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి వరకు తాకాలి.

## మరో మహమ్మారి విజృంభణ

పరిస్థితులను తలపిస్తోంది. ఆస్పత్రులన్నీ బాధితులతో నిండిపోయాయి. బాధితులు ఆస్పత్రుల బయట చికిత్స పొందాల్సిన పరిస్థితి ఏర్పడింది. వైద్య సిబ్బంది కొరత ప్రస్తుత పరిస్థితిని మరింత దిగజారుస్తోంది. ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపిన వివరాల ప్రకారం నాలుగు వేలకు మించిన ఇన్‌ఫ్లుఎంజా బాధితులు వివిధ ఆస్పత్రులలో చికిత్స పొందుతున్నారు. అంతకు ముందు వారంతో పోలిస్తే కేసులలో గణనీయమైన పెరుగుదల కనిపిస్తోంది. ఫ్లూ లక్షణాలు కలిగిన బాధితులు వెంటనే వైద్యులను సంప్రదించాలని ఆరోగ్యశాఖ అధికారులు సలహా ఇస్తున్నారు. ఈ అంటువ్యాధి ప్రజల సాధారణ జీవితంపై తీవ్ర ప్రభావం చూపింది. ఇన్‌ఫ్లుఎంజా కేసుల పెరుగుదలతో దేశవ్యాప్తంగా 135 పాఠశాలలు, పిల్లల సంరక్షణ కేంద్రాలు తాత్కాలికంగా మూసివేశారు. యమగాట ప్రిఫెక్చర్‌లోని ఒక ప్రాథమిక పాఠశాలలోని 36 మంది విద్యార్థులలో 22 మందికి ఫ్లూ లక్షణాలు కనిపించడంతో పాఠశాలను మూసివేశారు. సంక్రమణ మరింతగా వ్యాప్తి చెందకుండా నిరోధించేందుకు విద్యాశాఖ అధికారులు పాఠశాలను తాత్కాలికంగా మూసివేయాలనే నిర్ణయం తీసుకున్నారు.హక్కైడోలోని హెల్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ యోకో సుకామోటో మీడియాతో మాట్లాడుతూ ఈ సంవత్సరం ఫ్లూ వేవ్ అసాధారణంగా, ముందుగానే దూకుడుగా ఉందని హెచ్చరించారు. మారుతున్న వాతావరణం కారణంగా ఇటువంటి పరిణామాలు సర్వసాధారణం అవుతున్నాయన్నారు. గ్లోబల్ ట్రావెల్ నమూనాలు ఇన్‌ఫ్లుఎంజా జాతులు వ్యాప్తి చెందడానికి దోహదపడతాయని పేర్కొన్నారు. జాతీయ సగటు ఫ్లూ రోగుల సంఖ్య ఇప్పుడు అంటువ్యాధి స్థాయిలను అధిగమించింది, ఒకినావా, టోక్యో, కగోషిమా అత్యంత ప్రభావిత ప్రాంతాలలో ఉన్నాయి.

పర్యాటకులకు సూచనలు

ఆరోగ్యశాఖ అధికారులు ఇన్ఫ్లుఎంజా టీకా అవసరాన్ని మరోమారు తెలియజేస్తున్నారు. టీకాలు వేయించు కోవడం, మాస్క్ ధరించడం, క్రమం తప్పకుండా చేతులు కడుక్కోవడం, ఇళ్లలో వెంటిలేషన్ ఉండేలా చూసుకోవడం, వీలైనంత సమయం ఇంట్లోనే ఉండ డంలాంటి నివారణ చర్యలు ఫ్లూ వ్యాప్తిని నిరోధిస్తాయని నిపుణులు సూచిస్తున్నారు. జపాన్‌కు వచ్చే పర్యాటకులు పరిశుభ్రతా చర్యలను పాటించాలని నిపుణులు చెబుతు న్నారు. ప్రస్తుతానికి ప్రయాణ ఆంక్షలు లేనప్పటికీ, సంక్రమణను అరికట్టేందుకు ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోంది.

## రెండేళ్ల తర్వాత కూడా కేసీఆర్‌ను నిందిస్తారా?

ప్రెసిడెంట్ కేటీఆర్ సూచించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికతో కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. హైదరాబాద్ షేక్‌పేట డివిజన్‌కు చెందిన సీనియర్ నాయకుడు చెర్క మహేశ్.. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బీఆర్ ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ ఆయన కు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



## అత్యాచారం కేసులో నిందితులను వదిలిపెట్టే ప్రసక్తేలేదు

**- బాధితురాలు అర్ధరాత్రి ఆ అమ్మాయి బయటకు ఎందుకు వెళ్లింది?: ముఖ్యమంత్రి మమతా బెనర్జీ**

**కోల్‌కతా(జనంసాక్షి):** పశ్చిమ బెంగాల్‌లో వైద్య విద్యార్థినిపై సామూహిక అత్యాచార ఘటన తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పేర్కొన్నారు. అమ్మాయిల విషయంలో ప్రైవేటు విద్యా సంస్థలు భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. అర్ధరాత్రి సమయంలో బాధిత అమ్మాయి బయటకు వెళ్లడంపై ప్రశ్నలు లేవనెత్తిన సీఎం.. విద్యార్థినులను రాత్రిపూట బయటకు పంపించే విషయంలో కాలేజీ యాజమాన్యాలు జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. కోల్‌కతా విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడిన దీదీ.. ఈ కేసులో నిందితులను వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు."బాధితురాలు ప్రైవేటు మెడికల్ కాలేజీలో చదువుతోంది. అర్ధరాత్రి 12.30కి అమ్మాయి బయటకు ఎలా వచ్చింది? నాకు తెలిసినంత వరకు ఈ ఘటన అటవీ ప్రాంతంలో చోటుచేసుకుంది. ఆ సమయంలో ఏం జరిగిందో నాకు పూర్తిగా తెలియదు. దీనిపై దర్యాప్తు కొనసాగుతోంది. తీవ్ర దిగ్భ్రాంతి కలిగించే ఘటన. ఇటువంటి వాటిని తమ ప్రభుత్వం సహించదు. ఇప్పటికే ముగ్గురు నిందితులను అరెస్టు చేశాం. మిగతావారి కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఎవ్వర్నీ వదిలిపెట్టం, దోషులను కఠినంగా శిక్షిస్తాం" అని బెంగాల్ ముఖ్యమంత్రి స్పష్టం చేశారు."మూడు వారాల క్రితం ఒడిశా బీచ్‌లోలో ముగ్గురు అమ్మాయిలు అత్యాచారానికి గురయ్యారు. అక్కడి ప్రభుత్వం ఏం చర్యలు తీసుకుంది. ప్రైవేటు మెడికల్ కాలేజీ ఘటనకు ఎవరు బాధ్యులు..? ఈ వ్యవహారంపై పోలీసులే మాట్లాడగలరు. బాధితురాలు చదువుతున్న విద్యాసంస్థ ఈ ఘటనకు బాధ్యత వహించాలి. విద్యార్థుల భద్రత విషయంలో ప్రైవేటు మెడికల్ కాలేజీలు బాధ్యతగా వ్యవహరించాలి. ముఖ్యంగా అమ్మాయిలను రాత్రిపూట కాలేజీ బయటకు అనుమతించే విషయంలో జాగ్రత్తగా ఉండాలి. అమ్మాయిలకూ స్వీయ రక్షణ అవసరం" అని సీఎం మమతా బెనర్జీ సూచించారు.ఒడిశాలోని బాలేశ్వర్ జిల్లాకు చెందిన యువతి(23) పశ్చిమబెంగాల్ దుర్గాపుర్‌లోని ఓ ప్రైవేటు వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. శుక్రవారం రాత్రి ఆమె తన స్నేహితురాలితో కలిసి బయటకు వెళ్లింది. పలువురు దుండగులు వీరిని వెంబడించారు. బాధితురాలి స్నేహితురాలిని బెదిరించి తరిమేశారు.

# కొత్తకోట రచనలు సామాజిక మార్పు కలిగిస్తాయి

- కేంద్ర సాహితీ అకాడమీ అవార్డు గ్రహీత అంపశయ్య నవీన్
- వాగ్దేవి కాలేజీలో పుంజు తోక సంపుటి ఆవిష్కరణ కార్యక్రమం



వరంగల్ బ్యూరో, అక్టోబర్ 12 (జనం సాక్షి) : కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి రచనలు సామాజికంగా మార్పు కలిగించే విధంగా వున్నాయని కేంద్ర సాహితీ అవార్డు గ్రహీత అంపశయ్య నవీన్ తెలిపారు. మిత్ర మండలి అధ్వర్యంలో విశ్రాంత ఐపిఎస్ అధికారి కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి రచించిన 'పుంజు తోక' సంపుటి అవిష్కరణ సభను ఆదివారం హన్మకొండలోని వాగ్దేవి కళాశాలలో సమావేశ ప్రాంగణంలో ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమానికి కేంద్ర సాహితీ అవార్డు గ్రహీత అంపశయ్య నవీన్ ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో ముందుగా జ్యోతి ప్రజ్వల చేసారు. అనంతరం అంపశ్య నవీన్ చేతుల మీదుగా కొత్తకోండ శ్రీనివాస్ రెడ్డి రచించిన 'పుంజు తోక' సంపుటిని అవిష్కరించారు. ఈ సందర్భంగా అచార్య బన్న అయిలయ్య, నాగిళ్ళ రామశాస్త్రి, వి.ఆర్ విద్యార్థి పుంజు తోక సంపుటిలోని కవితలపై వారి వారి అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ విశ్లేషణాత్మకంగా వివరించారు. అనంతరం ముఖ్య అతిధి అంపశయ్య నవీన్ మాట్లాడుతూ కొత్తకోండ శ్రీనివాస్ రెడ్డి రచించిన "పుంజు తోక" సంపుటిలోని సామాజిక స్పూర్తి కలిగించే రీతిలో కవితలు వున్నాయని. కొత్తకోట కవితలు అభ్యుదయ రచనలుగా వున్నాయి కావున శ్రీనివాస్ రెడ్డి ని అభ్యుద కవిగా భావిస్తున్నానని. సుధీర్ఘ కాలం పోలీస్ శాఖలో తాను పనిచేసిన తన గురించి ఈ సంపుటిలో ప్రస్తావించకపోవడం గమనార్హమని. ముఖ్యంగా ఈ సంపుటి పూర్తిగా నవరసాలతో కూడిన వుందని, పోలీసులను కూడా చులకనగా చూడవద్దని, వారుసైతం ప్రాణత్యాగాలు చేస్తూ దేశ సేవ చేస్తున్నవారే అంటూ సంపుటిలో కొత్తకోట చక్కగా వివరించడం జరిగిందని. సమాజాన్ని పరిశీలించి,సమాజంలో జరుగుతున్నటువంటి మానవనీయమైన సంఘటనలపై చలించి,స్పందించే మనస్సు వున్నవారు, తన భావాలను అక్షర రూపంలో రూపంలోకి మార్చగలిగిన వారే కవితలు, నవలలు వ్రాయగలరని, రాబోవు రోజుల్లో కొత్తకోండ శ్రీనివాస్ రెడ్డి ద్వారా మరిన్ని అభ్యుదయ రచనలు రావాలని అంపశయ్య కోరారు. విశ్రాంత ఐపిఎస్ అధికారి కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ వరంగల్ నాకు ప్రత్యేక అనుభూతులను మిగిల్చింది, నేను ఇక్కడ ట్రైనింగ్ ఏఎస్పీగాపనిచేయడంతో పాటు, ఇదే జిల్లా ఏస్పీగా పనిచేసే భాగ్యం తనకు కలిగిందని. విద్యార్థి దశ నుండి కవితలు రాయడం అలవాటని, నేను వ్రాసిన కొన్ని అనాడే ప్రచురితం అయ్యాయని, పోలీస్ అధికారి అయ్యాక నా అనుభవాలను కేవలం నావరకు మాత్రమే పుస్తకంలో వ్రాసుకునేవాడినని ఈ పుస్తకం రాయడంలో ఎంతో మంది శ్రీశ్రీ,చలం, కాళోజీ లాంటి కవులతోపాటు సినీ దర్శకులు సత్యజిత్‌రే, నర్సింగరావు లాంటి నాకు స్పూర్తి నిచ్చారాని, ముఖ్యంగా సాహిత్యమనేది సంస్కరం అందించడం మానవ విలువలను కాపాడుతుందని కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. చివరగా ఈ కార్యక్రమంలో వరంగల్ సాహిత్యవేత్త మల్యాల మనోహర్ రావు కొత్తకోండ శ్రీనివాస్ రెడ్డితో వున్న పరిచయాన్ని తెలియజేస్తూ ముగింపు ప్రసంగాన్ని చేసారు. ఈ కార్యక్రమములో ట్రై సిటికి చెందిన సాహిత్యవేత్తలతో పాటు, పోలీస్ అధికారులు, ఉద్యోగులు, పాల్గొన్నారు.

# ఆందోళన పడకండి..

- బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుంది
- జోర్డాన్‌లో చిక్కుకున్న గల్ఫ్ కార్మికులుకు మాజీ మంత్రి హరీశ్ రావు భరోసా



హైదరాబాద్ (జనంసాక్షి) : గల్ఫ్ కార్మికులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని మాజీ మంత్రి హరీష్‌రావు భరోసా ఇచ్చారు. జోర్డాన్‌లో చిక్కుకున్న గల్ఫ్ కార్మికుల సమస్యలను విదేశీ వ్యవహారాల శాఖ దృష్టికి తీసుకువెళ్ళామని, వారిని తెలంగాణకు రప్పించేందుకు అన్ని విధాలా కృషి చేస్తున్నామని తెలిపారు. ఉపాధి కోసం తెలంగాణ నుంచి వెళ్లి జోర్డాన్ లో చిక్కుకున్న గల్ఫ్ కార్మికులతో మాజీ మంత్రి హరీష్ రావు ఫోన్‌లో మాట్లాడారు. కార్మికుల ఇబ్బందులు తమ దృష్టికి వచ్చిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. మరోవైపు బిఆర్ఎస్ పార్టీ పార్లమెంటరీ నాయకులు, రాజ్యసభ ఎంపీ సురేష్ రెడ్డి విదేశీ వ్యవహారాల శాఖ అధికారులతో మాట్లాడుతున్నారన్నారు. ఎలాగైనా వారిని తెలంగాణకు తీసుకువచ్చే కృషి చేస్తున్నామని, అధైర్య పడవద్దని తెలిపారు. ఏడాది క్రితం ఉపాధి కోసం వెళ్లి జోర్డాన్ లో చిక్కుకున్న 12 మంది దేశం కాని దేశంలో బిక్కుబిక్కుమంటూ నిర్మల్, కామారెడ్డి, నిజామాబాద్, జగిత్యాల, సిద్దిపేటకు చెందిన గల్ఫ్ కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని, అక్కడే ఉండి బతికేందుకు చేతిలో డబ్బులు లేక, కంపెనీ అనుమతి ఇవ్వకపోవడంతో తిరిగి స్వదేశానికి రాలేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని హరీశ్ రావుకు కార్మికులు గోడు వెళ్లబోసుకున్నారు. ఎలాగైనా తమను తెలంగాణలో ఉన్న కుటుంబ సభ్యుల వద్దకు చేర్చాలని విన్నవించారు. ఈ క్రమంలో హరీశ్ రావు ఫోన్ చేసి వారికి ధైర్యం చెప్పారు.

# టీఆర్పీలో చేరిన కరీంనగర్ యువత

- నూతన సభ్యులకు కండువాలు కప్పి ఆహ్వానించిన పార్టీ అధినేత తీన్మార్ మల్లన్న
- త్వరలోనే కరీంనగర్ గడ్డపై టీఆర్పీ జెండా ఎగురవేస్తాం : రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా



హైదరాబాద్ (జనంసాక్షి) : హైదరాబాద్‌లోని క్యూ న్యూస్ కార్యాలయంలో కరీంనగర్ జిల్లా కేంద్రం, హుజూరాబాద్ నియోజకవర్గం పరిధి నుండి దాదాపు 60 మంది యువకులు తెలంగాణ రాజ్యాధికార పార్టీ(టీఆర్పీ)లో రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా ఆధ్వర్యంలో చేరారు. పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు తీన్మార్ మల్లన్న స్వయంగా కొత్త కార్యకర్తలకు పార్టీ కండువాలు కప్పి వారిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మల్లన్న మాట్లాడుతూ టీఆర్పీ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల హక్కుల కోసం జన్మించిన సంస్థ అని తెలిపారు. గతంలో అగ్రవర్ణ నేతల చేతిలో సామాన్య వర్గాలు ఎన్నో సార్లు మోసపోయాయని, ఇకపై రాజకీయ అధికారం సామాన్యుల చేతుల్లో ఉండాలన్న లక్ష్యంతో తెలంగాణ రాజ్యాధికార పార్టీని స్థాపించామని తెలిపారు. తదనంతరం అఖిల్ పాషా మాట్లాడుతూ తీన్మార్ మల్లన్న తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర కార్యదర్శి బాధ్యతలు అప్పగించటం తన అదృష్టం అని అన్నారు. త్వరలోనే కరీంనగర్ జిల్లాలో టీఆర్పీ జెండా ఎగురవేస్తామని, గ్రామాగ్రామానికి పార్టీ సిద్ధాంతాలను తీసుకెళ్తూనే సామాజిక న్యాయం సాధన దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ చేరిక కార్యక్రమంలో టిఆర్పీ నాయకులు, స్థానిక కార్యకర్తలు, కొత్తగా చేరిన సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తెలంగాణ హక్కులు, సామాజిక న్యాయం, ప్రజల ఆత్మగౌరవం కోసం తీన్మార్ మల్లన్నతో కలసి పనిచేస్తామని వారు సంకల్పం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి కృషి చేసిన శివరాత్రి మోహన్, చెరుకు పైడయ్య, దాట్ల శ్రీనివాస్, నేదునూరు కుమారస్వామి, బుత్కురి మధు తదితరులకు అఖిల్ పాషా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# సౌదీ నుంచి హైదరాబాద్‌కు కోమా పేషెంట్

- మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవ
- 'సీఎం ప్రవాసీ ప్రజావాణి' సమన్వయం





హైదరాబాద్ (జనంసాక్షి) : 80 రోజులుగా, సౌదీ అరేబియా రాజధాని రియాద్‌లో చికిత్స పొందుతున్న కోమా పెషేంట్ లోకిని క్రిష్ణమూర్తిని హైదరాబాద్‌కు తరలించడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. వైద్య సిబ్బంది పర్యవేక్షణలో సౌదీ ఎయిర్ లైన్స్ విమానంలో స్ట్రెచర్ పై మెడికల్ ఎవాక్యుయేషన్ చేస్తున్న పెషేంట్ తో అతని భార్య తెనుగు అశ్విని ప్రయాణిస్తున్నారు. సోమవారం ఉదయం హైదరాబాద్ కు చేరిన పెషేంట్ ను దక్కన్ హాస్పిటల్ లో చేరుస్తారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా హుస్నాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ఎల్కతుర్తి కి చెందిన సాఫ్ట్ వేర్ ఇంజనీర్ లోకిని క్రిష్ణమూర్తి (35) సౌదీలో జూలై 23న అపస్మారక స్థితికి చేరారు. అధిక బీపీ తో, మెదడులోని రక్తనాళాలు చిట్లి కోమాలోకి జారిపోయిన అతనికి, రియాద్ లోని ఎస్ఎంసీ ఆసుపత్రిలో కోమా స్థితిలో వెంటిలేటర్ పై చికిత్స అందిస్తున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవతో తెలంగాణ ప్రభుత్వం సౌదీలోని ఇండియన్ ఎంబసీతో సంప్రదించి పెషేంట్ ను వాపస్ తెప్పించడానికి కృషి చేశారు. సౌదీ లోని గ్లోబల్ తెలంగాణ ఫోరం అధ్యక్షులు మహ్మద్ జబ్బార్ సమన్వయం చేశారు. సహాయం కోసం పెషేంట్ తండ్రి సూరయ్య గతనెల 9న 'సీఏం ప్రవాసీ ప్రజావాణి' లో వినతిపత్రం సమర్పించారు. తెలంగాణ ప్రభుత్వ నియమిత ఎన్నారై అడ్వయిజరీ కమిటీ వైస్ ఛైర్మన్ మంద భీంరెడ్డి మార్గదర్శనం చేశారు.

# కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో గుర్తింపు సంఘం విఫలం

- సీఐటీయూ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల రాజారెడ్డి



రామకృష్ణాపూర్, అక్టోబర్ 12(జనంసాక్షి): సింగరేణి వ్యాప్తంగా పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో గుర్తింపు సంఘం పూర్తిగా విఫలమైందని సీఐటీయూ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల రాజారెడ్డి, డిప్యూటీ జనరల్ సెక్రటరీ నాగరాజు గోపాల్ ఆరోపించారు. మందమర్రి ఏరియాలోని రామకృష్ణాపూర్ యూనియన్ కార్యాలయంలో బ్రాంచ్ అధ్యక్షులు సాంబారు వెంకటస్వామి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో గెలిచిన యూనియన్ నాయకులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. త్వరలోనే దీపావళి బోనస్ తేదీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్మిక సమస్యలను పరిష్కరించడంలో కృషి చేస్తున్న సీఐటీయూ యూనియన్‌లో కార్మికులు భారీ సంఖ్యలో సభ్యత్వం తీసుకోవడం హర్షనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ కార్యదర్శి అల్లి రాజేందర్, ఉపాధ్యక్షులు రామగిరి రామస్వామి, ఏరియా ఆసుపత్రి ఫిట్ సెక్రటరీ రాజ్ కుమార్, ఆదర్శ్, శ్రీధర్, సురేష్, ప్రవీణ్, కమిటి సభ్యులు పాల్గొన్నారు.

# పెన్షనర్స్ ప్రాణాలు కాపాడాలి

టీఎన్జీఓ మాజీ అధ్యక్షుడు దేవీప్రసాద్



హైదరాబాద్ (జనంసాక్షి) : పెన్షనర్స్ ప్రాణాలు కాపాడాలని టీఎన్జీఓ మాజీ అధ్యక్షుడు దేవీప్రసాద్ అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో రిటైర్ అయిన ఉద్యోగుల పరిస్థితి దయనీయంగా మారిందని, 3/24 నుండి రిటైర్ అయిన ఉద్యోగులకు పెన్షన్ బకాయిలు రావడం లేదని తెలిపారు. తాము సర్వీసులో దాచుకున్న సొమ్ము తిరిగి ఇవ్వకుండా వేధిస్తున్నారని, ప్రతి నెల 700 కోట్లు విడుదల చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఇచ్చిన మాట తప్పి ఉద్యోగులను వేధిస్తున్నదని, అనేక మంది తమ డబ్బులు రావడం లేదని మానసిక ఒత్తిడి కారణంగా మరణాలు సంభవిస్తున్నాయని తెలిపారు. 15000 కోట్ల బకాయిలు ప్రతి నెల ఇచ్చిన మాట ప్రకారం చెల్లించినా రెండు ఏళ్లు పడుతుందని, దీనికి తోడు ప్రతి నెల రిటైర్ అయ్యే ఉద్యోగుల పరిస్థితి చెప్పనక్కరలేదని తెలిపారు. రెండు లక్షల నలభై వేల కోట్లు అప్పులు తెచ్చిన ప్రభుత్వం రిటైర్ ఉద్యోగుల బకాయి తీర్చక పోవడం శోచనీయమని, ప్రజలకు హామీ ఇచ్చి నెరవేర్చని జాబితాలో ఉద్యోగుల పిఆర్‌సి, డిఏలు కూడా చేరాయని, ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి పోతున్న ప్రాణాలను కాపాడాల్సిన బాధ్యత ఉద్యోగ సంఘాలదేనని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ఉద్యోగులను ప్రభుత్వం మోసం చేసిందని, పీఆర్సీ లేదని, హెల్త్ కార్డులు లేవని, 5 డీఏల జాడే లేదని తెలిపారు. సీపీఎస్ రద్దు పై నాన్చివేత ధోరణి కొనసాగుతోందని, కనీసం పండుగల అడ్వాన్స్ కూడా ఇవ్వకుండా ఉద్యోగులను వేధించడం దుర్మార్గమని తెలిపారు. దీపావళి పండుగ సందర్భంగా డీఏలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.



హైదరాబాద్ జిల్లా మారేడుపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో పిల్లలకు పోలియో డ్రాప్స్ వేస్తున్న హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్, డాక్టర్ సంగీత సత్యనారాయణ

# 6 జిల్లాల్లో విజయవంతంగా పల్స్ పోలియో స్పెషల్ డ్రైవ్

హైదరాబాద్ (జనంసాక్షి) : హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి, హన్మకొండ, వరంగల్ జిల్లా పరిధిలోని పట్టణ ప్రాంతంలో ఆరోగ్యశాఖ ఆదివారం పల్స్ పోలియో వ్యాక్సినేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించింది. ఈ 6 జిల్లాల పరిధిలో 0–5 సంవత్సరాల వయసు పిల్లలు 17,56,789 మంది ఉన్నట్టు అధికారులు అంచనా వేశారు. ఇందులో 16,35,432 మంది పిల్లలలు ఆదివారం పోలియో డ్రాప్స్ వేశామని హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్, డాక్టర్ సంగీత సత్యనారాయణ ప్రకటించారు. మిగిలిన పిల్లలకు కూడా పోలియో డ్రాప్స్ వేయించాలని తల్లిదండ్రులకు సంగీత విజ్ఞప్తి చేశారు. ఆరోగ్యశాఖ సిబ్బంది సోమ, మంగళవారం ఇంటింటికి తిరిగి, ఆదివారం వ్యాక్సిన్ వేయించుకోని పిల్లలకు వ్యాక్సిన్ వేస్తారని ఆమె తెలిపారు. ఈ అవకాశాన్ని పిల్లల తల్లిదండ్రులు వినియోగించుకోవాలని ఆమె కోరారు.

# చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలి

- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద..



వరంగల్ ప్రతినిధి, అక్టోబర్ 12(జనంసాక్షి): పోలియో రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని చిన్నారులకు భావి జీవితం బాగుండాలంటే పోలియో చుక్కల మందును తప్పకుండా వేయించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. ఆదివారం వరంగల్ నగరంలోని చింతల్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చిన్నారులకు కలెక్టర్ పల్స్ పోలియో చుక్కలను వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సత్య శారద మాట్లాడుతూ జిల్లాలో అన్ని గ్రామాలు , పట్టణాలలో ప్రత్యేక పల్స్ పోలియో చుక్కలు వేసే కేంద్రాలను ఏర్పాటు చేసి జిల్లాలోని ఐదు సంవత్సరాలలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేసేలా చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ తెలిపారు.మొదటి రోజు ఎంపిక చేసిన కేంద్రాలలో ఉదయం నుండి సాయంత్రం వరకు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది అంగన్వాడి సిబ్బంది ఆశా వర్కర్లు పోలియో చుక్కలు వేస్తారు అన్నారు. తరువాత రెండు రోజులు ఇంకా ఎవరైనా మిగిలిపోయిన వారు ఉంటే ఇంటింటికి తిరిగి పోలియో చుక్కలు వేసేలా అన్ని రకాల చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు ఎలాంటి ఆపోహ లకు, ఆస్కారం లేకుండా తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని, పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. పల్స్ పోలియో కార్యక్రమమును నిర్వహించడం వలన పోలియో వ్యాధి కేసులు నమోదు కావడం లేదుఅయినా మన పొరుగు దేశాలలో పోలియో కేసులు నమోదు అవుతున్నట్లు తెలుసుకొని ప్రభుత్వ ఆదేశాలతో దానికి అనుగుణంగా పట్టణ ప్రాంతాలలో సబ్ నేషనల్ ఇమినైజేషన్ కార్యక్రమమును నిర్వహించుకుంటున్నామని అన్నారు. ఆరోగ్యవంతమైన పిల్లలే రేపటి దేశానికి సంపదని పిల్లల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకొని వారిని ఉన్నతంగా తీర్చిదిద్దాలని కోరినారు. గర్భిణీ స్త్రీలు, చిన్నపిల్లలలో రక్తహీనత సమస్యలు ఉన్నట్లయితే వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ద్వారా పరీక్షలు నిర్వహించుకుని తగిన చికిత్సలు చేయించుకోవాలని కోరారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి సాంబశివరావు మాట్లాడుతూ వరంగల్ పట్టణ ప్రాంతంలో ఈ వ్యాక్సినేషన్ (ఆదివారం) ఈరోజు నిర్వహిస్తున్నామని అప్పుడే పుట్టిన బిడ్డ నుండి ఐదు సంవత్సరాల బిడ్డ వరకు పల్స్ పోలియో వ్యాక్సిన్ ఇవ్వడం జరుగుతుందని తెలిపినారు. ప్రజలంతా స్వచ్ఛందంగా తమ పిల్లలను వ్యాక్సినేషన్ సెంటర్ కి తీసుకువచ్చి వ్యాక్సిన్ ఇప్పించాలని కోరినారు. వ్యాక్సినేషన్ తీసుకోవడానికి అర్హత కలిగిన 20వేల 121 మంది పిల్లల గాను 98 శాతం మంది పిల్లలకు ఇవ్వడం జరిగినదని తెలిపినారు. పోలియో వ్యాక్సినేషన్ తీసుకొని పిల్లలను రేపు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ద్వారా ఇంటింటికి సర్వే నిర్వహించి మిస్సయిన ప్రతి బిడ్డకు వ్యాక్సినేషన్ వేయిస్తామని తెలిపారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ప్రకాష్ మాట్లాడుతూ జిల్లాలో సి కె ఎం, ఎంజీఎం ,చింతల్, దేశాయిపేట ,పోర్ట్ వరంగల్ ,కీర్తి నగర్ , రంగషాయిపేట, ఎస్ ఆర్ ఆర్ తోట ,కాశిబుగ్గ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఉన్న ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు 101 వ్యాక్సినేషన్ సెంటర్ల ద్వారా బస్ స్టేషన్, రైల్వే స్టేషన్ ట్రాన్సిస్ట్ పాయింట్ల ద్వారా 7 మొబైల్ టీం ల ద్వారా వ్యాక్సిన్ ఇవ్వబడుతుందని తెలిపారు. దీనికి సంబంధించిన కేంద్రాలలో సిబ్బంది పనిచేస్తున్నారని తెలిపారు . అలాగే ట్రాన్సిస్ట్ పాయింట్లలో 24 గంటలు నిర్వహిస్తున్నామని వివరించారు. ఈరోజు రాత్రి 12 గంటల 28 నిమిషాలకు వరంగల్ రైల్వే స్టేషన్ లో ప్రారంభించామన్నారు.కాబట్టి ప్రజలు స్వచ్ఛందంగా పిల్లలకు వ్యాక్సిన్ ఇప్పించాలని తెలిపారు.

## వ్యవసాయ పంట పొలంలో మొసలి ప్రత్యక్షం




ఖానాపురం, అక్టోబర్ 12 (జనం సాక్షి): వరంగల్ జిల్లా ఖానాపూర్ మండలం కొత్తూరు గ్రామంలోని గద్ద కుమారస్వామి అనే రైతుకు చెందిన పంట పొలంలో భారీ సైజు మొసలి ప్రత్యక్షమైంది. ఆది వారం రైతులు వ్యవసాయ పనులు చేస్తుండగా పంట కాలువ ద్వారా వచ్చిన మొసలి పంట పొలంలో కనిపించడంతో ఒక్కసారిగా భయభ్రాంతులకు గురయ్యారు. మొసలిని చూసిన రైతులు వెంటనే అప్రమత్తమై స్థానికులను పిలిపించి పంట పొలంలో ఉన్న మొసలి ని చూడడానికి గ్రామస్తులు పెద్ద సంఖ్యలు తరలివచ్చారు ఈ విషయాన్ని అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు.



# ఖర్గేకు మంత్రి జూపల్లి కృష్ణారావు పరామర్శ

న్యూఢిల్లీ (జనంసాక్షి) : అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేను పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదివారం న్యూ ఢిల్లీలో పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

# జీఎస్టీ తగ్గింపు ప్రకటన.. ఓ బూటకం




### ఆచరణలో కనిపించని వైనం.

భారతదేశంలో జీఎస్టీ (వస్తువులు మరియు సేవల పన్ను) విధానం 2017లో అమలు చేసినప్పటికీ, 2025 సెప్టెంబర్ 22 నుంచి 'నెక్స్ట్-జెన్ జీఎస్టీ రిఫార్మ్స్' (జీఎస్టీ 2.0)గా పిలుస్తున్నారు. దీనిలో కొత్త మార్పులు ప్రవేశపెట్టారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా ఈ మార్పులను ప్రకటించారు, "సామాన్య ప్రజలకు రూ.2.5 లక్షల కోట్ల సంపాదన" అని ఘనంగా చాటి చెప్పారు. ఈ మార్పులు ప్రధానంగా పన్ను స్లాబ్‌ల ను సరళీకరించి, 0%, 5%, 18% మరియు 40% (లగ్జరీ/సిన్ వస్తువులకు)గా మారాయి. పాత స్లాబ్‌లు (5%, 12%, 18%, 28%)లో 12% మరియు 18% స్లాబ్‌లు ఎక్కువగా 5 శాతానికి తగ్గించారు, దీనివల్ల 375ం వస్తువులు మరియు సేవలు చౌకగా దొరికేలా చేశారని కేంద్ర కేంద్ర ప్రభుత్వం చాటింపు వేసుకుం టోంది. ముఖ్యంగా, పేదలు, మధ్యతరగతి వారికి ప్రయోజనం చేకూరాలని, నిత్యావసరాలు, ఆహారం, ఆరోగ్య సేవలు, వ్యవసాయ పరికరాలు తక్కువ ధరలకు లభిస్తాయని హామీ ఐతే ఇచ్చారు. ఆచరణ అమలును మరిచారు. నిజానికి ఈ ప్రకటనలు మార్కెట్‌లో ఎక్కడా అమలు కావడం లేదు. దేశం అంతటా కిరాణా షాపులు, సూపర్ మార్కెట్లు, డైరీ ప్రొడక్ట్స్ – అంతా పాత ధరలకే (ఎమ్ఆర్‌పీ రేట్లు) అమ్ముతున్నారు.కనీసం పాల ప్యాకెట్లు, బిస్కట్లు, బటర్, జ్యూస్‌లు – ఇవి కూడా ఎంత మాత్రం తగ్గకపోవడం లేదా పాత రేట్లే ముద్రించి అమ్మడం వంటి సమస్యలు ప్రజలు విస్తృతంగా ఎదుర్కొంటున్నారు సామాన్య ప్రజల వెతలు. ఈ వ్యాసంలో పరిశీలనాత్మకంగా, విమర్శనాత్మకంగా విశ్లేషిస్తుంది.

**కేంద్ర ప్రభుత్వంపై ప్రకటనలపై విమర్శకు ఆధారాలు:**

ప్రభుత్వ ప్రకటనలకు,నిజం జీవిత అనుభవాలకు అసలు ఏ మాత్రం పొంతన లేదు, ఈ జీ.ఎస్.టీ. కొత్త రూల్స్, వస్తువుల ధరల పట్టిక, వినియోగదారుల సంఘాలు, అధికారుల పాత్ర, కాంప్లైంట్ ప్రక్రియ లు, సామాన్య వినియోగదారులకు సలహాలు, సూచనలు, ఆధారాల ను (జీ.ఎస్.టీ.) కౌన్సిల్ నోటిఫికేషన్లు, (సీబీఐసీ) డేటా, (ఎన్సీ హెచ్) రిపోర్టులు. అలాగే కన్స్యూమర్ కంప్లైంట్స్ నుంచి తీసుకున్న ఆధారాలు ఈ వ్యాసం లో చర్చించకు వచ్చాయి.

**కొత్త జీఎస్టీ రూల్స్ : ప్రభుత్వ ప్రకటనలు.**

జీఎస్టీ 2.0 ప్రకారం, పన్ను స్లాబ్‌లు 3 విధాలుగా సరళీకరించబడ్డాయి :

**"0 శాతం (నిల్ రేట్స్ )" :**

నిత్యావసరాలు (ఉప్పు,పప్పు, ఉల్లిగడ్డ, చింతపండు, కారం, పసుపు, వంటి నూనెలు మొదలైనవి, ఆహార ఆధారాలు (చపాతీ, పరాఠా, (యూహెచ్‌టీ.) పాలు, పనీర్, ఖాఖ్రా, పిజ్జా బ్రెడ్), విద్యా సామగ్రి (పెన్సిల్స్, ఎరేసర్లు), ఆరోగ్య బీమా, లైఫ్ ఇన్సూరెన్స్ మొదలైనవి.

**" 5 శాతం (మెరిట్ రేట్స్)" :**

ఆహార ప్రొడక్ట్స్ (బటర్, ఘీ, చీజ్, డ్రై ఫ్రూట్స్, బిస్కట్లు, ఐస్‌క్రీమ్, జ్యూస్‌లు, కాఫీ, నమ్కీన్, ప్యాస్ట్రీలు), హౌస్‌హోల్డ్ ఐటమ్స్ (సోప్, షాంపూ, టూత్‌పేస్ట్), వ్యవసాయ పరికరాలు, హెల్త్‌కేర్ సర్వీసెస్ మెదలైనవి.

**"18 శాతం " (స్టాండర్డ్ రేట్స్)":**

కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ (టీవీలు, ఫ్రిజ్‌లు), చిన్న కార్లు, మోటార్‌సైకిళ్లు (350CC వరకు), కిచెన్ అప్లయన్సెస్.

**"40 శాతం (డి-మెరిట్ రేట్స్ )" :**

లగ్జరీ/సిన్ వస్తువులు (సిగరెట్లు, టొబాకో, ఏరేటెడ్ డ్రింక్స్, ప్రీమియం కార్లు, వేప్స్) మొదలైనవి. ఈ మార్పులు 56వ (జీఎస్‌టీ.) కౌన్సిల్ మీటింగ్ (సెప్టెంబర్ 2025)లో ఆమోదించారు, దీని లక్ష్యం పేద, మధ్య తరగతి ప్రజల కుటుంబాల ఖర్చులను తగ్గించడం, వ్యాపారులకు కాంప్లయన్స్ సులభం చేయడం.

నిజానికి ఈ ఆదర్శాలు చాలా గొప్పవి. ఈ జీఎస్‌టీ అమలులోకి వచ్చిన 2017 తర్వాత ఏడాది లోనే దేశంలోని రాష్ట్ర ప్రభుత్వాలు తమ ఆదాయంలో గణనీయమైన లోటు ఏర్పడుతుంది.వెంటనే జీఎస్టీ ని రద్దు చేయాలని బీజేపీ ఏతర రాష్ట్ర ప్రభుత్వాలు తమ నిరసనను వ్యక్తం చేశాయి. కానీ కేంద్ర ప్రభుత్వం ఆ లోటును భర్తీ చేస్తామని ప్రకటించారు.ఒకటి, రెండు సంవత్సరాలలోనే కేంద్ర ప్రభుత్వం చేతులెత్తేసింది. కేంద్రానికి గణనీయంగా దేశంలోని ఆదాయం అంతా చేతికి చిక్కింది.ఈ ఆదాయంలో వాటాల పంపిణీలో కేంద్రం బీజేపీ అధికారంలోకి ఉన్న రాష్ట్రాలకు, బీజేపీ ఏతర రాష్ట్ర ప్రభుత్వాలకు వివక్షత చూపించింది. రాష్ట్రాలు తమ ఆదాయం క్షీణించి కేంద్రం దయాదాక్షణ్యాలకు ఆధారపడేలా చేసింది.దీనితో రాష్ట్ర ప్రభుత్వాలు తమ అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేయటంలో అనేక ఇబ్బందులు పడి, దొరికిన కాడికి అప్పులు చేసి రుణాలు ఊబిలోకి దిగుబడి పోయాయి. ఇక 8 ఏళ తర్వాత చేసిన ఈ సవరణలు జీఎస్‌టీ రేట్లు అమలులో లోపాల వల్ల ఆ ఫలితాలు ప్రజలకు అందటం లేదు.

**జీఎస్‌టీ అమలు తీరు ప్రభావాలు:**

ప్రభుత్వం 'ఆంటీ-ప్రాఫిటీరింగ్' మెకానిజం (ఎన్.ఏ.ఏ.)ను 2024 అక్టోబర్ 1 నుంచి రద్దు చేసింది. దీనివల్ల ధరలు తగ్గించకపోతే శిక్షలు తగ్గాయి. మార్కెట్ ఫోర్సెస్‌పై ఆధారపడటం వల్ల వ్యాపారులు పాత ఇన్వెంటరీ రేట్లకే అమ్ముతూ లాభాలు పొందుతున్నారు. ఫలితం 99 శాతం వస్తువులు చౌకగా దొరికేలా చేశారని చెప్పినా, కన్స్యూమర్ కంప్లైంట్స్ 3,981కి చేరాయి (సెప్టెంబర్ 2025 నుంచి - ఈనాటి వరకు). మార్కెట్‌లో ఏమిటి జరుగుతోంది?

**ధరలు పాతవి - కొత్తవి - లిస్ట్ అలాగే నిజాలు**

ప్రభుత్వం చెప్పినట్లు, 375ం వస్తువులపై ధరలు తగ్గాలి. కానీ మార్కెట్‌లో 70 శాతం కంప్లైంట్స్ ధరలు మారకపోవడం పైనే ఉన్నాయి. (ఎఫ్ఎంసీజీ) కంపెనీలు (అమూల్, హెచ్.యూ.ఎల్.) కోల్‌గేట్) కొత్త ప్యాకెట్లు నవంబర్ వరకు వస్తాయని చెబుతున్నారు, కానీ పాత స్టాక్‌లో పాత ఎమ్.ఆర్.పీ.లు ముద్రించి అమ్ముతున్నారు.ఇది 'ప్రాఫిటీరింగ్' (అధిక లాభం)గా పరిగణించబడుతుంది. ఇది కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ)కి బదిలీ అయినప్ప టికీ, అమలు చేయటంలో చాలా బలహీనంగా ఉంది.క్రింది టేబుల్‌లో నిత్యావసర వస్తువుల పాత ధరలు (2024 వరకు) కొత్త (2025 సెప్టెంబర్ 22 నుంచి) జీఎస్టీ రేట్లు, అంచనా ధర తగ్గుదల (ఒక ఉదాహరణ ప్యాక్‌కు, టాక్స్ తగ్గుదల మాత్రమే – ఇతర ఖర్చులు మినహాయించి):

వస్తువు పాత రేట్ (2024) ం కొత్త రేట్లు (2025) అంచనా ధర తగ్గుదల (ఉదా: రూ.100 బేస్ ప్రైస్‌కు) గమనికలను చూడాలి.

"పాల ప్యాకెట్ (యూ.హెచ్.టీ. /టెట్రా ప్యాక్)" 5 శాతం, 0 శాతం,రూ.5 ఫ్రెష్ పౌచ్ పాలు ఎప్పటి నుంచో 0 శాతం, కానీ (యూహెచ్‌టీ. పై తగ్గింది. అమూల్, మదర్ డైరీ కొత్త ధరలు ప్రకటించాయి, కానీ పాత స్టాక్‌లో మార్కెట్‌లో మాత్రం పాత రేట్లుకే అమ్ముతున్నారు. "పనీర్ (ప్రీ-ప్యాక్డ్)" 5 శాతం,0 శాతం, రూ.5 పూర్తి ఎక్సెంప్ట్. డైరీ ఫార్మర్లకు ప్రయోజనం, కానీ రిటైలర్లు తగ్గించ లేక పోతున్నారు. "బిస్కట్లు" 18 శాతం -5 శాతం, రూ.13 ప్యాకేజ్డ్ ఫుడ్‌లో పెద్ద తగ్గుదల. ( హెచ్.యూ.ఎల్), పెర్ఫెట్టీ వంటి కంపెనీలు తగ్గించాయి, కానీ లో-యూనిట్ ప్యాక్‌ల్లో సమస్యలు ఉన్నాయి. "ఫ్రూట్ జ్యూస్/కాఫీ" 12-18 శాతం, 5 శాతం, రూ.7-13 , బెవరేజెస్ పై తగ్గింది. కానీ సోడాలు 40 శాతానికి పెరిగాయి. ఇలా ధర తగ్గుదల అంచనా – బేస్ ప్రైస్‌పై (జీ.ఎస్.టీ.) మాత్రమే, కానీ మార్కెట్‌లో ఇతర కారణాలు (ఇన్ఫ్లేషన్, సప్లై చైన్) వల్ల పూర్తి ప్రయోజనం రావట్లేదు. పాల ప్యాకెట్లపై ప్రత్యేకంగా: ఫ్రెష్ పౌచ్ పాలు ఎప్పటి నుంచో 0శాతం, (యూ.హెచ్.టీ.) మాత్రమే తగ్గింది. కానీ పాత రేట్లు ముద్రించి అమ్మడం వల్ల ప్రజలు కన్ఫ్యూజన్‌లో పడ్డారు.

**వినియోగదారుల సంఘాలు, జీఎస్టీ అధికారులు:**

**పాత్ర - ప్రయోజనం లేకపోవడం:**

"వినియోగదారుల సంఘాలు (కన్స్యూమర్ ఫోరమ్‌లు)" : కన్స్యూమర్ ప్రొటెక్షన్ యాక్ట్ 2019 ప్రకారం, డిస్ట్రిక్ట్/స్టేట్/నేషనల్ కన్స్యూమర్ డిస్ప్యూట్ రెడ్రెసల్ కమిషన్లు (సంఘాలు) ధరల అధికారం, అన్‌ఫెయిర్ ట్రేడ్ ప్రాక్టీసెస్‌పై కేసులు విచారిస్తాయి.

(నేషనల్ కన్స్యూమర్ హెల్ప్‌లైన్) 2025 సెప్టెంబర్ నుంచి జీ.ఎస్.టీ. కేటగిరీ జోడించింది, 3,981 కాల్స్/గ్రీవెన్స్‌లు రావడంతో (సీసీపీఏ ), (సెంట్రల్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ) 2,000ం కంప్లైంట్స్ (సీబీఐసీ)కి రిఫర్ చేసింది. కానీ, విమర్శ: ఈ సంఘాలు మెరిట్ ఆర్డర్‌లు ఇష్యూ చేస్తున్నా, రెసల్యూషన్ రేటు 40 శాతం మాత్రమే – మిగతావి పెండింగ్. ఈ-కామర్స్ (అమెజాన్, ఫ్లిప్‌కార్ట్)లో డిస్క్రెపెన్సీలు ఎక్కువ, సంఘాలు ఇంకా డిజిటల్ మానిటరింగ్‌లో బలహీనంగా ఉన్నాయి.

"జీఎస్టీ అమలు అధికారులు (యంత్రాంగం):

సీబీఐసీ అలాగే స్టేట్ (జీఎస్.టీ.) ఆఫీసులు ధరలు మానిటర్ చేయాలి, ఆంటీ-ప్రాఫిటీరింగ్ కింద శిక్షలు విధించాలి. 2025 సెప్టెంబర్ 11న (ఎన్.సీ.హెచ్.) కౌన్సెల్లర్లకు ట్రైనింగ్ ఇచ్చారు. 800 బ్రాండ్‌లకు నోటీసులు పంపారు. కానీ, విమర్శ: (ఎన్.ఏ.ఏ.) రద్దు తర్వాత ఎన్‌ఫోర్స్‌మెంట్ బలహీనం అయింది. మార్కెట్ ఫోర్సెస్‌పై ఆధారపడటం వల్ల వ్యాపారులు (ఎఫ్.ఎమ్.సీ.జీ. రిటైలర్లు) పాత స్టాక్ ధరలకే అమ్ముతున్నారు. 65 శాతం కంప్లైంట్స్ డిజిటల్ మోడ్‌లో వచ్చినా, యాక్షన్ తీసుకోవడం ఆలస్యం అవుతుంది. పాల ప్యాకెట్ల వంటి వస్తువులపై పాత రేట్లు ముద్రించి అమ్మడం లీగల్ మెట్రాలజీ యాక్ట్ ఉల్లంఘన, దానిపై ఫైన్లు (రూ.25,000 వరకు) తక్కువ కావడం వల్ల అమలు లోపం ఉంది.

సామాన్య ప్రజలు ఏమి చేయాలి? తగిన సూచనలు మరియు సలహాలు సామాన్య వినియోగదారులు మౌనంగా ఉండకూడదు %-% ధరలు తగ్గకపోతే కాంప్లైంట్ చేయడం మన హక్కు అని తెలుసుకోవాలి.

**వినియోగదారులు ఏమి చేయాలి?:**

**1. ధరలు చెక్ చేయండి :** సేవింగ్ విత్ జీఎస్టీ.ఇన్ వెబ్‌సైట్‌లో వస్తువు పేరు ఎంటర్ చేసి కొత్త రేట్ చూడండి.బిల్‌లో జీఎస్టీ బ్రేకప్ చూడండి.

**2. కాంప్లైంట్ ఫైల్ చేయండి :** టోల్-ఫ్రీ నంబర్: 1915 (ఎన్.సీ.హెచ్) లేదా 1800-1200-232 (జీఎస్.టీ. హెల్ప్‌లైన్).

**"వాట్సాప్/ ఎస్ఎమ్ఎస్ :** 8800001915కి "ధర తగ్గక పోతే ఆధారాలతో ఫిర్యాదులు పంపాలి. " ఆన్‌లైన్": కన్స్యూమర్ హెల్ప్ లైన్.జీఓవీ.ఇన్. లేదా సెల్ఫ్ సర్వీస్ . జీఎస్టీ సిస్టమ్ .ఇన్ లో రిజిస్టర్ చేసి ఫైల్ చేయండి (ఓటీపీతో). టికెట్ నంబర్ తీసుకోండి, స్టేటస్ చెక్ చేయండి.

**3. అవగాహన పెంచుకోండి :** ప్రొడక్ట్ పై కొత్త (ఎం.ఆర్.పీ) స్టికర్ ఉండాలి (లీగల్ మెట్రాలజీ యాక్ట్ ప్రకారం). పాత రేట్లు చూస్తే రిఫ్యూజ్ చేయండి, బిల్ తీసుకోండి.

**4. ఉమ్మడి చర్య :** లోకల్ కన్స్యూమర్ ఫోరమ్‌లో గ్రూప్ కంప్లైంట్ ఫైల్ చేయండి. సోషల్ మీడియాలో GST2Overcharge హ్యాష్‌ట్యాగ్‌తో షేర్ చేయండి.

**5.సురక్షిత షాపింగ్:** కొత్త ప్యాకెట్లు కొనండి, ఈ-కామర్స్‌లో రివ్యూలు చదవండి. ఇన్ఫ్లేషన్ వల్ల పూర్తి తగ్గుదల రాకపోవచ్చు, కానీ జీ.ఎస్.టీ భాగం తప్పక తగ్గాలి.

ఈ చర్యలు మీ డబ్బును కాపాడతాయి. వ్యవస్థ పనితీరును మెరుగుపరుస్తాయి. (ఎన్.సీ.హెచ్.) డేటా ప్రకారం, కంప్లైంట్స్ 65 శాతం డిజిటల్‌గా వస్తున్నాయి, రెసల్యూషన్ 10 రోజుల్లో రావాలి.

జీఎస్టీ 2.0 ప్రభుత్వానికి ఎంట్రీలు, వ్యాపారులకు సరళత అందించినా, సామాన్యులకు 'పేపర్ ఆన్ పేపర్' మాత్రమే. (ఎన్.ఏ.ఏ. )రద్దు, అమలు లోపాలు వల్ల ప్రజలకు సత్ఫలితాలు రావటం లేదు. వినియోగదారులు మోసపోతున్నారు. ఇది పాలసీ ఫెయిల్యూర్. ప్రభుత్వం హామీలు ఇచ్చినా, మార్కెట్‌లో 70 శాతం కంప్లైంట్స్ పాత ధరలు కొనసాగుతున్నాయి.కళ్ళముందు మార్కెట్ లో వినియోగదారులకు జరిగే మోసాలు ప్రత్యక్షంగా కనపడుతుంటే చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం యంత్రాంగం ఎక్కడ నిద్రపోతుందో తెలియదు. కేవలం ప్రజల నుండి పెద్ద ఎత్తున ఫిర్యాదులు వస్తే గానీ , రంగంలోకి దిగని యంత్రాంగం వల్ల ఏం ప్రయోజనం?

జీ.ఎస్.టీ. సవరణ ఫలితాలు ఇప్పటి వరకు ప్రజలకు అందకపోతే ఒక వైపు ప్రజలకు- ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుంది. ఇది సమాజంలో ఆర్థిక అసమానతలను పెంచుతుంది: పేదలు మరింత ఒత్తిడికి గురవుతారు.

**పరిష్కారం:** (ఎన్ఏఏ)ను తిరిగి బలోపేతం చేయాలి. రిటైలర్లపై ఫైన్లు పెంచాలి,అలాగే ప్రజా అవగాహనా సదస్సులు నిర్వహించాలి. ప్రజలు (వినియోగదారులు) మౌనంగా ఉండకండి. మీ ఫిర్యాదులు సంబంధిత ప్రభుత్వం శాఖల్లో మార్పును తీసుకు రావాలి. వినియోగదారులు, వ్యాపారులు, వర్తక సంఘాలు కూడా జీఎస్టీ పై అవగాహన పెంచుకోవాలి, హక్కుల కోసం డిమాండ్ చేయాలి. అదే నిజమైన ప్రజాస్వామ్యం. ప్రజాస్వామ్య వ్యవస్థ నిరంతరం ప్రజల చైతన్యం పైనే ఆధారపడి ఉంటుంది.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

## గబ్బిలం జన్మ ధన్యం!

లోకులు కాకులైతే గబ్బిలం
కవన రెక్కలు అద్దుకొని
కావ్యగంగలో మునిగి
నవయుగ కవి చక్రవర్తిగా తేలి
నిటాలాక్షుడి భస్మ సింహాసనంపై
వాలి
కావుకావన్న నోళ్లతో
అవుననిపించుకొంది
కవికోకిలై గండపెండేరం
తొడిగించుకొంది
ఓ పక్క కులసర్పం బుసలు
కొడుతున్నా
అక్షరపత్రాల తరువే ఆదరువుగా
వేళ్ళాడుతూ
ప్రజల నాల్కలపై సుకవిలా
గూడు కట్టుకొని జీవించింది
గబ్బిలం కోకిలవటం
స్వీయ మతానికి సమ్మతంకాక
తలదాచుకొన్న నీడే క్రీనీడై
విరిగి పడేసరికి విరక్తితో
నాస్తిక నైర్మల్యతే నిఖమైన
దైవమనుకొంది
ఐనా వేటగాళ్ళ బాణాలు తప్పలేదు
వడగాల్పుల్లో మసి
చేయాలనుకొన్నా
చల్లని వెన్నెలాక్షరాలు కురిపిస్తూ
అంటరానితనం అంచులు
చీల్చుకొని
నవకవితా తేజస్సుతో
విశ్వనింగికి ఎగిరిపోయింది..!

భీమవరపు పురుషోత్తమ్
రాజమండ్రి
9949800253


# విద్యా మానో విజ్ఞాన శాస్త్రం

### బాల వికాస దశలు

విద్యా మానసిక శాస్త్రం బాలల వికాసాన్ని అధ్యయనం చేస్తూ, వారి భవిష్యత్ ఆకృతిని రూపొందించే ముఖ్యమైన దశలపై దృష్టి సారిస్తుంది. శైశవ దశ (జననం నుండి 2 సంవత్సరాల వరకు) మరియు పూర్వ బాల్య దశ (2 నుండి 6 సంవత్సరాల వరకు) బాలల జీవితంలో పునాది దశలు. ఈ దశలలో భౌతిక, మానసిక, చలనాత్మక, ఉద్వేగాత్మక, సాంఘిక, నైతిక మరియు భాషా వికాసాలు వేగవంతంగా జరుగుతాయి. ఈ వ్యాసం ఈ వికాసాలను సమగ్రంగా విశ్లేషిస్తుంది, ప్రముఖ మనస్తత్వవేత్తల సిద్ధాంతాల ఆధారంగా. భౌతిక వికాసం బాలల శరీర వృద్ధి మరియు ఆరోగ్యాన్ని సూచిస్తుంది. శైశవ దశలో, శిశువు జనన సమయంలో 3-4 కిలోల బరువుతో పుట్టి, మొదటి సంవత్సరంలో మూడు రెట్లు పెరుగుతాడు. మెదడు వికాసం వేగవంతం, న్యూరాన్ల మధ్య సినాప్సెస్ ఏర్పడతాయి. ఇది పోషకాహారం మరియు పర్యావరణంపై ఆధారపడి ఉంటుంది. పూర్వ బాల్య దశలో, ఎత్తు సంవత్సరానికి 5-7 సెం.మీ. పెరుగుతుంది, శరీరం సమతుల్యంగా మారుతుంది. విద్యా మానసిక శాస్త్రంలో, ఈ వికాసం బాలల శారీరక క్రీడల ద్వారా ప్రోత్సహించబడుతుంది. ఉదాహరణకు, మాంటిస్సోరి పద్ధతి భౌతిక వికాసాన్ని స్వేచ్ఛా కదలికలతో కలుపుతుంది. అయితే, పోషక లోపం ఈ దశలో మెదడు వికాసాన్ని ప్రభావితం చేస్తుంది, ఇది భవిష్యత్ నేర్చుకోవడానికి అడ్డంకి. మానసిక వికాసం, అంటే అభిజ్ఞా వికాసం, పియాగెట్ సిద్ధాంతం ప్రకారం శైశవ దశలో సెన్సారీమోటర్ దశగా పరిగణించబడుతుంది. శిశువు ఇంద్రియాల ద్వారా ప్రపంచాన్ని అన్వేషిస్తాడు, వస్తువుల స్థిరత్వాన్ని (ఆబ్జెక్ట్ పెర్మెనెన్స్ ) నేర్చుకుంటాడు. 8-12 నెలలలో, శిశువు సమస్యలను పరిష్కరించడం ప్రారంభిస్తాడు. పూర్వ బాల్య దశలో, ప్రీ-ఆపరేషనల్ దశలో, బాలలు చిహ్నాలు, భాష ద్వారా ఆలోచిస్తారు. కానీ ఇంకా తర్కబద్ధంగా కాదు. ఎగోసెంట్రిజం (స్వకేంద్రీకృత ఆలోచన) ఉంటుంది. విగోట్స్కీ సిద్ధాంతం ప్రకారం, ఈ వికాసం సామాజిక పరస్పర చర్యల ద్వారా జరుగుతుంది, జోన్ ఆఫ్ ప్రాక్సిమల్ డెవలప్‌మెంట్ (జెడ్.పీ.డీ.) ద్వారా పెద్దలు సహాయం చేస్తారు. విద్యా సందర్భంలో, ఆటలు మానసిక వికాసాన్ని పెంచుతాయి, కానీ పర్యావరణ లోపాలు అభిజ్ఞా ఆలస్యానికి దారితీస్తాయి.

చలనాత్మక వికాసం గ్రాస్ మరియు ఫైన్ మోటర్ స్కిల్స్‌ను కలిగి ఉంటుంది. శైశవ దశలో, శిశువు మొదటి నెలలలో రిఫ్లెక్స్‌లు (గ్రాస్పింగ్,సక్కింగ్) చూపిస్తాడు. 3-4 నెలలలో తల ఎత్తడం, 6-8 నెలలలో కూర్చోవడం, 10-12 నెలలలో నడవడం జరుగుతుంది. ఇది సెఫాలోకాడల్ (తల నుండి కాళ్ల వరకు) మరియు ప్రాక్సిమోడిస్టల్ (మధ్య నుండి అంచుల వరకు) నియమాలను అనుసరిస్తుంది. పూర్వ బాల్య దశలో, బాలలు పరుగెత్తడం, దూకడం, బంతి విసరడం నేర్చుకుంటారు. ఫైన్ మోటర్ స్కిల్స్‌లో పెన్సిల్ పట్టుకోవడం, డ్రాయింగ్ వంటివి. విద్యా మానసిక శాస్త్రంలో, ఈ వికాసం ఆటలు మరియు కళల ద్వారా ప్రోత్సహించబడుతుంది. అయితే, ఆలస్యమైన చలన వికాసం మానసిక సమస్యలకు సూచిక కావచ్చు.

ఉద్వేగాత్మక వికాసం భావోద్వేగాల నియంత్రణను సూచిస్తుంది. శైశవ దశలో, శిశువు భయం, ఆనందం, కోపం వంటి ప్రాథమిక భావాలను చూపిస్తాడు. ఎరిక్సన్ సిద్ధాంతం ప్రకారం, ట్రస్ట్ వర్సెస్ మిస్‌ట్రస్ట్ దశలో, తల్లిదండ్రుల సంరక్షణ భద్రతా భావాన్ని నిర్మిస్తుంది. అటాచ్‌మెంట్ థియరీ (బౌల్‌బీ) ప్రకారం, తల్లితో బంధం ముఖ్యం. పూర్వ బాల్య దశలో, ఆటోనమీ వర్సెస్ షేమ్ అండ్ డౌట్ దశలో, బాలలు స్వతంత్రత నేర్చుకుంటారు. భావోద్వేగాలు సంక్లిష్టమవుతాయి, ఈర్ష్య, గర్వం వంటివి ఏర్పడతాయి. విద్యా సందర్భంలో, భావోద్వేగ బుద్ధి (ఎమోషనల్ ఇంటెలిజెన్స్) అభివృద్ధి




చేయడం ద్వారా, ఉపాధ్యాయులు సహాయపడతారు. లోపాలు ఆందోళన రుగ్మతలకు దారితీస్తాయి.

సాంఘిక వికాసం ఇతరులతో సంబంధాలను కలిగి ఉంటుంది. శైశవ దశలో, శిశువు తల్లిదండ్రులతో సామాజిక స్మైల్ చూపిస్తాడు, స్ట్రేంజర్ ఆంక్సైటీ అనుభవిస్తాడు. పూర్వ బాల్య దశలో, బాలలు సమాంతర ఆట (పారెలెల్ విజ్ఞానం) నుండి సహకార ఆటకు మారతారు. బందూరా సామాజిక నేర్చుకోవడం సిద్ధాంతం ప్రకారం, అనుకరణ ద్వారా సాంఘిక నైపుణ్యాలు వస్తాయి. విద్యా మానసిక శాస్త్రంలో, ప్రీస్కూల్ విద్య సాంఘికీకరణను ప్రోత్సహిస్తుంది. అయితే, ఒంటరితనం సాంఘిక ఆలస్యానికి కారణం.

నైతిక వికాసం న్యాయం, సరి-తప్పుల గుర్తింపును సూచిస్తుంది. శైశవ దశలో, ఇది ప్రాథమికంగా ఉంటుంది, శిక్ష-ప్రతిఫలాలపై ఆధారపడి ఉంటుంది. కోహ్లబర్గ్ సిద్ధాంతం ప్రకారం, ప్రీ-కన్వెన్షనల్ దశలో, బాలలు స్వలాభం కోసం నియమాలు పాటిస్తారు. పూర్వ బాల్య దశలో, నైతిక ఆలోచనలు ఏర్పడతాయి, కానీ ఇంకా స్వకేంద్రీకృతంగా ఉంటాయి. పియాగెట్ ప్రకారం, హెటరోనమస్ మోరాలిటీ (నియమాలు అతీతమైనవి) ఉంటుంది. విద్యా సందర్భంలో, కథలు, రోల్-ప్లే ద్వారా నైతికతను బోధిస్తారు. లోపాలు అసాంఘిక ప్రవర్తనకు దారితీస్తాయి.

భాషా వికాసం కమ్యూనికేషన్‌ను కలిగి ఉంటుంది. శైశవ దశలో, శిశువు కూయింగ్, బాబ్లింగ్ చేస్తాడు, మొదటి పదాలు 12 నెలలలో వస్తాయి. చోమ్స్కీ సిద్ధాంతం ప్రకారం, భాషా సామర్థ్యం (ఎల్ఏడి) సహజమైనది. పూర్వ బాల్య దశలో, వాక్యాలు ఏర్పడతాయి, టెలిగ్రాఫిక్ స్పీచ్ నుండి పూర్తి వాక్యాలకు మారతాయి. విగోట్స్కీ ప్రకారం, భాష మానసిక వికాసానికి సాధనం. విద్యా మానసిక శాస్త్రంలో, భాషా పాఠాలు ద్వారా ప్రోత్సహిస్తారు. ఆలస్యం డిస్‌లెక్సియా వంటి సమస్యలకు సూచిక.

ముగింపుగా, ఈ దశలలో వికాసాలు పరస్పర సంబంధితమైనవి. భౌతిక వికాసం మానసికాన్ని ప్రభావితం చేస్తుంది, ఉద్వేగాత్మకం సాంఘికాన్ని. విద్యా మానసిక శాస్త్రం ఈ వికాసాలను ప్రోత్సహించడానికి పర్యావరణం, విద్యా పద్ధతులను సూచిస్తుంది. సమతుల్య వికాసం బాలల భవిష్యత్ విజయానికి కీలకం.



దండెబోయిన అశోక్ యాదవ్,
గెజిటెడ్ హెడ్మాస్టర్, పెద్దమదూర్,
జనగాం. 9440521990.

# అరిస్టాటిల్ రాజ్యం ప్రజాస్వామ్య ఆలోచన విధానం!

ప్రాచీన గ్రీకు తాత్వికుల్లో అరిస్టాటిల్ ఒక గొప్ప రాజకీయ తాత్వికుడిగా పేరుగాంచాడు. ఆయన రచించిన "పాలిటిక్స్" అనే గ్రంథం ప్రపంచ రాజకీయ ఆలోచనల అభివృద్ధికి బలమైన పునాదిగా నిలిచింది. ఆయన రాజకీయ వ్యవస్థలపై చేసిన విశ్లేషణ ఒక శాస్త్రీయ విధానం కలిగినది. అరిస్టాటిల్ అభిప్రాయం ప్రకారం, ప్రతి దేశపు రాజ్యాంగం ఆ దేశ ప్రజల జీవన శైలిని, విలువలను, ఆర్థిక స్థితిని ప్రతిబింబిస్తుంది. ఆయన రాజ్యాంగాన్ని ఒక సజీవమైన సూత్రరూపంగా పరిగణించాడు, ఇది సమా జంలోని వ్యక్తుల గుణగణాలు, అవసరాలు, నైతిక ప్రమాణాలకు అనుగుణంగా మారుతూ ఉంటుంది.అరిస్టాటిల్ తన రాజకీయ సిద్ధాంతంలో ఆరు రకాల ప్రభుత్వాలను వివరించాడు మోనార్కీ (రాజ్యపాలన), అరిస్టోక్రసీ (ఉన్నతుల పాలన), పోలిటీ (ప్రజల పాలన) ఇవి సత్స్వరూపాలు కాగా, వీటికి వ్యతిరేకంగా ఉన్న చెడు స్వరూపాలు టైరనీ (దుర్మార్గ రాజ్యపాలన), ఒలిగార్కీ (ధనికుల పాలన), డెమోక్రసీ (అధికుల దుర్వినియోగ ప్రజాస్వామ్యం) అని పేర్కొన్నాడు. ఆయన దృష్టిలో ఉత్తమ రాజ్యాంగం అంటే సద్గుణాలతో నిండిన ప్రజలకు అనుగుణమైన మధ్యస్థ రాజ్యాంగం ం అంటే "పోలిటీ" అని చెప్పాడు. ఇది రాజ్యపాలన, అరిస్టోక్రసీ, ప్రజాస్వామ్య తత్వాల సమతుల్యత తో కూడిన విధానం.

అరిస్టాటిల్ రాజ్యాంగ విధానంలో న్యాయపాలనకు అత్యున్నత ప్రాధాన్యత ఉంది. ఆయన అభిప్రాయం ప్రకారం, "న్యాయమే రాజు, మనుషులు కాదు." అంటే పాలకుడు కూడా చట్టానికి లోబడి ఉండాలి. అలాగే ఆయన మధ్యతరగతి ప్రజలు అధికంగా ఉన్న దేశాల్లో స్థిరమైన ప్రజాస్వామ్యం ఏర్పడుతుందని నమ్మాడు. అత్యధిక ధనికులు లేదా అత్యధిక పేదలు ఉన్న సమాజాల్లో అసమానత పెరిగి, తిరుగుబాట్లు, అశాంతి చోటు చేసుకుంటాయని హెచ్చరించాడు.


అరిస్టాటిల్ రాజ్యాంగం యొక్క ప్రధాన ఉద్దేశం ప్రజల సంతోషం, శాంతి, న్యాయం , నైతికతను కాపాడడం. ఆయన రాజకీయ వ్యవస్థలో విద్య, నైతిక విలువలు మ చట్టపరమైన నియమాలకు ముఖ్యమైన స్థానం ఇచ్చాడు. ప్రజలు చట్టాన్ని గౌరవిస్తే మాత్రమే మంచి రాజ్యాంగం సుస్థిరంగా నిలుస్తుందని ఆయన విశ్వసించాడు.

మొత్తానికి, అరిస్టాటిల్ రాజ్యాంగ విధానం ఒక శాశ్వత తాత్విక ఆలోచన. అది ఆధునిక ప్రజాస్వామ్య పద్ధతులకూ పునాది వేసింది. న్యాయం, సమానత్వం, చట్టపాలన , మధ్యతరగతి ఆధారిత పాలన అనే ఆయన సూత్రాలు ఇప్పటికీ సమకాలీన రాజకీయ ఆలోచనలకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయి.

**అరిస్టాటిల్ రాజ్యము ప్రజాస్వామ్య వ్యవస్థ:**

ప్రాచీన గ్రీకు తాత్వికుల్లో అరిస్టాటిల్ రాజకీయ తత్వశాస్త్రానికి తండ్రిగా పరిగణించబడతాడు. ఆయన రాజకీయ సిద్ధాంతం లోకంలో నేటికీ ఆధునిక ప్రజాస్వామ్య వ్యవస్థలకు ప్రేరణగా నిలుస్తోంది. అరిస్టాటిల్ అభిప్రాయం ప్రకారం, ఏ రాజ్యమూ లేదా ప్రభుత్వమూ ప్రజల సుఖసంతోషాల కోసం పనిచేయాలి. రాజ్యపాలన లేదా ప్రజాస్వామ్య పాలన ఏదైనా కావొచ్చు, దాని మూల ఉద్దేశం ప్రజలకు న్యాయం, సమానత్వం, సురక్షిత జీవితం అందించడమే కావాలి. ఆయన రాజకీయ ఆలోచనలలో రాజ్యపాలన, అరిస్టోక్రసీ , ప్రజాస్వామ్య తత్వాలను కలిపి మధ్యస్థ రాజ్యాంగ విధానం ం "పోలిటీ" ం అత్యుత్తమమని పేర్కొన్నారు.అరిస్టాటిల్ విశ్వసించినది ఏమిటంటే, రాజు లేదా పాలకుడు ఎల్లప్పుడూ చట్టానికి లోబడి పనిచేయాలి. ఆయన ప్రసిద్ధమైన మాట It is better for the law to rule than any one of the citizens. నేటి ప్రజాస్వామ్య వ్యవస్థలకూ ప్రధాన సూత్రంగా నిలిచింది. ఆయన దృష్టిలో రాజు ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని నిర్ణయాలు తీసుకోవాలి. అధికారాన్ని స్వార్థపరంగా కాకుండా, సామూహిక మేలుకోసం వినియోగించాలి. రాజు ప్రజల శ్రేయస్సు కోసం పాలన చేయాలి కాని తన స్వార్థం లేదా వ్యక్తిగత లాభం కోసం కాదు. ఈ భావనలోనే ఆధునిక ప్రజాస్వామ్య పద్ధతికి బలమైన తాత్విక మూలాలు ఉన్నాయి.

అరిస్టాటిల్ రాజ్యపాలనలో చట్టం అత్యున్నతమైనదని చెప్పాడు. చట్టం ప్రజలచే రూపొందించబడినప్పుడు, అది ప్రజల ఆత్మను ప్రతిబింబిస్తుంది. అందుకే ప్రజాస్వామ్యంలో ప్రజలే సార్వభౌములు అని చెప్పవచ్చు. ఆయన




రాజకీయ శాస్త్రాన్ని ఒక నైతిక శాస్త్రంగా పరిగణించాడు. రాజ్యపాలన న్యాయం, నైతికత, విద్య, ధర్మబద్ధతల మీద ఆధారపడాలి అని ఆయన స్పష్టం చేశాడు. ప్రజలలో నైతిక విలువలు ఉన్నప్పుడు మాత్రమే ప్రజా స్వామ్యం సుస్థిరంగా ఉంటుందని ఆయన భావించాడు.అరిస్టాటిల్ ప్రజా స్వామ్యానికి వ్యతిరేకం కాదు, కానీ అతడు అజ్ఞానపరమైన ప్రజాస్వామ్యాన్ని విమర్శించాడు. ప్రజలలో అవగాహన లేకపోతే, ప్రజాస్వామ్యం కూడా దుర్వినియోగానికి దారి తీస్తుంది అని ఆయన హెచ్చరించాడు. ఆయన దృష్టి లో ఉత్తమ పాలన అంటే ప్రజల ఆలోచనలకు, అవసరాలకు అనుగుణంగా నడిచే వ్యవస్థ. ప్రజాస్వామ్యం బలపడటానికి మధ్యతరగతి ముఖ్యమని ఆయన పేర్కొన్నాడు. మధ్యతరగతి పెద్దదిగా ఉన్న దేశాల్లో సమానత్వం, స్థిరత్వం ఎక్కువగా ఉంటాయి. పేదరికం లేదా అధిక ధనవంతుల ఆధిపత్యం ఉన్న దేశాల్లో తిరుగుబాట్లు, విభజనలు తప్పవని ఆయన ఆలోచించాడు.

అరిస్టాటిల్ రాజ్యపాలనలో విద్యకూ అత్యంత ప్రాధాన్యత ఇచ్చాడు. ప్రజలు చట్టం గురించి, తమ హక్కుల గురించి, బాధ్యతల గురించి తెలుసుకోవాలి. విద్యావంతులైన ప్రజలు ఉన్నపుడు రాజు లేదా ప్రభుత్వం వారికి సేవ చేసే విధంగా వ్యవస్థ నడుస్తుంది. ప్రజలు అజ్ఞానంలో ఉంటే, రాజ్యపాలన దుర్వినియోగానికి లోనవుతుంది. అందుకే ఆయన రాజ్యపాలనలో విద్యను నైతికతతో కలిపి చూడాలి అన్నాడు.అరిస్టాటిల్ రాజకీయ తత్వంలో రాజు ఒక తండ్రిలా ప్రజలను కాపాడాలి. ఆయన చేతిలో అధికారముండే కానీ అది బాధ్యతతో కూడినది కావాలి. రాజు తన స్వార్థం కోసం కాకుండా, ప్రజల సంతోషం కోసం పాలన చేయాలి. ఆయన చట్టం ముందు సమానత్వాన్ని ప్రోత్సహించాడు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు, మాట హక్కు, అభిప్రాయ హక్కు ఉండాలి. ఇవి రాజ్యంలోని సమగ్ర అభివృద్ధికి దారి తీస్తాయని ఆయన నమ్మాడు.

అరిస్టాటిల్ ప్రజాస్వామ్య ఆలోచనలో మానవ స్వభావం, న్యాయం, సమానత్వం, ధర్మం అనే నాలుగు మూలస్థంభాలు ఉన్నాయి. ఆయన రాజ్యపాలనను ఒక మానవతా వ్యవస్థగా చూడాలని సూచించాడు. ప్రజల మేలుకే రాజు ఉండాలి, ప్రజల భయానికి కాదు. రాజు చట్టానికి సేవకుడిగా ఉండాలి కాని అధిపతిగా కాదు.

మొత్తానికి, అరిస్టాటిల్ ఆలోచనలు నేటి ప్రజాస్వామ్యానికి మానసిక పునాది వంటివి. ప్రజల హక్కులు, బాధ్యతలు, న్యాయం, చట్టపాలన, సమానత్వం ం ఇవన్నీ ఆయన తాత్విక భావనల నుండి పుట్టినవే. ఆయన చెప్పిన "రాజ్యము ప్రజాస్వామ్య వ్యవస్థలో పని చేయాలి" అనే సిద్ధాంతం ఇప్పటికీ ప్రతి ప్రజాస్వామ్య దేశానికి దారిదీపంలా నిలుస్తోంది.

ప్రజల మేలే రాజ్యపాలన యొక్క పరమావధి అని అరిస్టాటిల్ చూపించిన ఈ తాత్విక దారి ప్రపంచ రాజకీయ చరిత్రలో శాశ్వత ప్రాధాన్యం పొందింది.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

## స్వచ్ఛ్ ఆటోను అడ్డుకున్న సాయి ఎన్‌క్లేవ్ వాసులు




**అల్వాల్, అక్టోబర్ 12 (జనంసాక్షి) :** మచ్చ బొల్లారం డివిజన్‌లోని శ్రీ సాయి ఎంక్లేవ్ కాలనీ రోడ్ల గుండా చెత్త తరలిస్తున్న జిహెచ్ఎంసి స్వచ్ఛ ఆటో ను కాలనీ వాసులు అడ్డుకున్నారు. గత ఏడాది నుంచి రోజూ దాదాపు రెండు వందల టిప్పర్లు కాలనీ రోడ్ల గుండా వెళ్లడం వల్ల చెత్త చిందర వందరగా పడటం, దుర్వాసన, దోమల సమస్యలు తలెత్తాయని వాసులు తెలిపారు. తక్కువ వయస్సు డ్రైవర్లు నిర్లక్ష్యంగా నడపడం వలన ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. జూన్ 30న డిప్యూటీ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో టిప్పర్లను స్వయంగా అడ్డుకున్నామని కాలనీ వాసులు తెలిపారు. టిప్పర్లు ఇకపై కాలనీ రోడ్ల గుండా కాకుండా మెయిన్ రోడ్ ద్వారా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కాలనీ అధ్యక్షుడు రోహిత్ వక్రాల కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రధాన కార్యదర్శి రమేష్ కుమార్, కోశాధికారి రవీంద్ర రెడ్డి, చైర్మన్ కనకయ్య, రాజా రాజేశ్వర్ రెడ్డి, సందీప్, దామోదర్, గుమ్మడి రాజు, జయశ్రీ, అరుణ జ్యోతి, పాల్ రాజ్, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమే...

**మొయినాబాద్, అక్టోబర్ 12 (జనంసాక్షి) :** కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించి ప్రజలను మోసం చేసి ప్రజా వ్యతిరేక పాలన కొనసాగిస్తున్నారని వారికి తెలంగాణ ప్రజానీకం తగిన బుద్ధి చెప్పడం ఖాయమని మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు దారెడ్డి వెంకటరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం కేతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన నాయకులు కేతిరెడ్డిపల్లి గ్రామ సమీపంలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో కార్యకర్తలు వెంకట్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో ఆదివారం చేరారు. ఈ సందర్భంగా వారికి వెంకట్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అనేక తప్పుడు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను అనేక రకాలుగా మోసాలు చేస్తూ పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. ప్రజలు ఈ విషయాలన్నీ గుర్తించి గత కెసిఆర్ పాలన కోసం ఎదురుచూస్తూ



మళ్లీ బీఆర్ఎస్ వైపు ఆసక్తి చెంది బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కానీ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కానీ టిఆర్ఎస్ పార్టీ తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. తప్పుడు హామీలతో కాంగ్రెస్ శ్రేణులు ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నారని ఈ విషయాన్ని అందరూ గమనించాలని సూచించారు. గత పది సంవత్సరాల నుంచి పేద ప్రజల సంక్షేమం కోసం మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు అనేక పథకాలు తీసుకొచ్చి పేద ప్రజలకు లబ్ధి చేకూర్చాలని గుర్తు చేశారు. వీటన్నిటిని గుర్తించి నేడు వివిధ పార్టీలకు చెందిన నాయకులు కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరెందుకు ముందుకు రావడం అభినందనీయం అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు అత్యధిక స్థానాల్లో గెలుపొందడం ఖాయమన్నారు. అప్పటివరకు పార్టీ శ్రేణులు కష్టపడి పనిచేయాలని సూచించారు. వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు నాయకులు సురేష్, భాస్కర, శ్రీనివాస్, కుమార్, మహేందర్, సుమన్, వినోద్, కిరణ్, మైపాల్,లోకేష్, చరణ్, హరి, వెంకట్, శ్రీకాంత్,బాలాజీ, ఇస్మాయిల్,శివ,భారత్ ,మహేష్ తదితరులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలలో పట్టుబడ్డ 534 నిందితులు...

**శేరిలింగంపల్లి, అక్టోబర్ 12 (జనంసాక్షి) :** సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధి ట్రాఫిక్ విభాగం పోలీసులు కమిషనరేట్ పరిధిలోని ఆయా ప్రాంతాలలో శనివారం రాత్రి నుండి వివిధ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన వీకెండ్ స్పెషల్ డ్రైవ్ లో భాగంగా 534 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకోవడం జరిగింది. ఈ మేరకు సైబరాబాద్ కమిషనరేట్ ట్రాఫిక్ విభాగం పోలీసు ఉన్నతాధికారులు ఆదివారం వెల్లడించిన వివరాల ప్రకారం...శనివారం రాత్రి నుండి ఆదివారం తెల్లవారుజాము వరకు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలలో భారీగా వాహనదారులు, వ్యక్తులు మద్యం సేవించి పట్టుబడడం జరిగింది. వారాంతపు డ్రంక్ అండ్ డ్రైవ్ స్పెషల్ డ్రైవ్ నిర్వహణలో భాగంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను నిర్వహించడం జరిగిందని, ఈ సందర్భంగా మద్యం సేవించి వాహనాల నడుపుతున్న వ్యక్తులు భారీగా పట్టుబట్టడం జరిగిందని తెలిపారు. మొత్తం 534 మంది వాహనదారులు, వ్యక్తులు మోతాదుకు మించి మద్యాన్ని సేవించి పట్టుబడగా ఇందులో 435 మంది ద్విచక్ర వాహనాల డ్రైవర్లు, 18 మంది



ఆటో రిక్షా డ్రైవర్లు, త్రీ వీలర్ వాహనదారులు కాగా ఏకంగా 79 మంది కార్లను, ఇతర ఫోర్ వీలర్ లను నడుపుతున్న డ్రైవర్లు మరియు ఇద్దరు హెవీ వెహికల్ లను నడిపిస్తున్న డ్రైవరు ఉన్నట్లు పోలీస్ అధికారులు తెలిపారు. ఇందులో 478 మంది బ్లడ్ ఆల్కహాల్ కాన్సన్ట్రేషన్‌తో పట్టుబడడం జరిగిందని, దీనిని కనిష్ఠంగా 200 ఎంజి/100 ఎమ్మెల్ నుండి గరిష్ఠంగా 500 ఎంజి/100 ఎమ్మెల్‌గా పరిగణించడం జరుగుతుందన్నారు. ఇక ఇందులో 34 మంది నిందితులు మోతాదు స్థాయిని దాటి మద్యం సేవించడం జరిగిందని, అలాగే 301 ఎంజి/100 ఎమ్మెల్ నుండి 500 ఎంజి/100 ఎమ్మెల్ వరకు మద్యాన్ని సేవించి 22 మంది డ్రైవర్లు పట్టు పడడంపట్ల ట్రాఫిక్ విభాగం పోలీస్ అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టుబడిన వారందరినీ హైకోర్టు లో ప్రవేశపెట్టగా 296 మంది డిడి కేసులను డిస్పోస్ చేయగా ఇందులో 20064 మందికి నగదు పెనాల్టీ ని విధించగా 32 మంది జైలు పాలు అవ్వడం జరిగిందన్నారు. ఎవరైనా రోడ్డు ప్రమాదాలకు కారణమైనా..., హిట్ అండ్ రన్ చేసినట్లు తెలిసినా అరెస్టు చేసి జైలుకు పంపించడం జరుగుతుందని, గరిష్ఠంగా పదేళ్ల జైలుశిక్ష పడే అవకాశంకూడా ఉంటుందని పోలీస్ అధికారులు తెలిపారు. కాగా 18 మందికి ఒకరోజు శిక్ష, 11 మంది నిందితులకు రెండు రోజులు, ముగ్గురికి మూడు రోజుల చొప్పున జడ్జి జైలు శిక్షను ఖరారు చేయగా 35 మంది వ్యక్తులు వివిధ చౌరస్తాలలో మద్యం పట్ల అవగాహనను కల్పించే విధంగా పనిష్మెంట్ ఇవ్వడం జరిగిందన్నారు.

## కేసీఆర్ ముందుచూపుతో ప్రతిభ చాటుతున్న విద్యార్థులు

- మెడిసిన్‌లో సీటు సాధించిన విద్యార్థికి మాజీ మంత్రి సన్మానం



**వనపర్తి బ్యూరో, అక్టోబర్ 12 (జనం సాక్షి) :** కేసీఆర్ ముందు చూపుతో నిర్మించిన మెడికల్ కాలేజీలలో, గ్రామీణ ప్రాంత విద్యార్థులు ప్రతిభ చాటుతూ, నేడు మెడికల్ సీట్లు సాధించడం గర్వంగా ఉందని, తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు.పెద్దమందడి మండల కేంద్రానికి చెందిన, గొల్ల.బాగ్యమ్మ, చంద్రయ్యల కుమారుడు దేవేందర్ యాదవ్, ఇటీవల జరిగిన నీట్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి ఏం.బి.బి.ఎస్ నందు సీటు సాధించినవిషయం. తెలుసుకున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి,వారి ఇంటికి నాయకులతో కలసి వెళ్లి అభినందించి సన్మానించారు. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ ప్రతిభ ఉన్న పేద విద్యార్థులు ఉన్నత స్థాయిలో రాణించాలని,కె.సి.ఆర్ జిల్లాకో మెడికల్ కాలేజీ మంజూరు చేయడం జరిగిందని అన్నారు. దేవేందర్ యాదవ్ తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలియజేశారు. నిరంజన్ రెడ్డి వెంట నందిమల్ల అశోక్, గ్రామ పార్టీ అధ్యక్షులు సేనాపతి, జంగం.రమేష్, పురుషోత్తం రెడ్డి, సుర శ్రీనివాస్, కడుకుంట్ల ఆంజనేయులు, సింగిరెడ్డి కురుమూర్తి, కె.వెంకటన్న, వెంకట్ రెడ్డి, బాల్ రెడ్డి, ట్రాక్టర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## 36 గంటల పాటు నీరు బంద్



**హైదరాబాద్, అక్టోబర్ 12 (జనంసాక్షి) :** కోదండాపూర్ నుంచి గొడకొండ్ల వరకు ఉన్న హైదరాబాద్ మహానగరానికి మంచినీటిని సరఫరా చేస్తున్న కృష్ణ డ్రింకింగ్ వాటర్ సప్లై ప్రాజెక్ట్ (కేడీడబ్ల్యూఎస్పీ) ఫేజ్-3, పంపింగ్ మెయిన్‌కి సంబంధించి 2375 ఎంఎం డయా పైప్‌లైన్‌పై భారీ నీటి లీకేజీని అరికట్టడానికిగానూ, ఎయిర్‌వాల్వ్, గేట్ వాల్వ్, పనిచేయని వాల్వ్‌లను మార్చడం వంటి మరమ్మత్తు పనులను చేపట్టనున్నారు. ఈ పనులు సోమవారం ఉదయం 6 గంటల నుండి మంగళవారం సాయంత్రం 6 గంటల వరకు మొత్తం 36 గంటల పాటు ఈ పనులు కొనసాగుతాయి. కాబట్టి.. ఈ 36 గంటల వరకు కృష్ణ డ్రింకింగ్ వాటర్ సప్లై ప్రాజెక్ట్ ఫేజ్ - 3 రింగ్ మెయిన్ - 1 కింద ఉన్న రిజర్వాయర్ల పరిధిలో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది. గచ్చిబౌలి, కొండాపూర్, మాధాపూర్, అయ్యప్ప సొసైటీ, కావూరి హిల్స్, ప్రశాసన్ నగర్, ఫిల్మ్‌నగర్, జూబ్లీ హిల్స్, తట్టి ఖానా, భోజగుట్ట, షేక్‌పేట్, హకీంపేట్, కర్వాన్, మెహిదీపట్నం, ఆసిఫ్‌నగర్, గోల్కొండ, లంగర్ హౌస్, దుర్గా నగర్, బుద్వేల్, సులేమాన్ నగర్, గోల్డెన్ హైట్స్, 9 నంబర్, కిస్మత్‌పూర్, గంధంగూడ, బండ్లగూడ, శాస్త్రిపురం, అల్లబండ, మధుబన్, ధర్మసాయి (శంషాబాద్), సాహెబ్‌నగర్, ఆటోనగర్, సరూర్‌నగర్, వాసవి నగర్, నాగోల్, ఎన్‌టీఆర్ నగర్, వనస్థలిపురం, దేవేందర్ నగర్, ఉప్పల్, స్నేహపురి, భారతనగర్, రాంపల్లి, బోడుప్పల్, చెంగిచెర్ల, మానిక్ చంద్, మల్లికార్జున నగర్, పీర్జాదిగూడ, పెద్దఅంబర్‌పేట్ ప్రాంతాల్లోని వినియోగదారులు నీటిని పొదుపుగా వాడుకోగలరని కోరారు.

## బొడ్రాయి ప్రతిష్టాపన ఉత్సవాలకు హాజరైన మధుయాష్కీ గౌడ్


**హయత్‌నగర్, అక్టోబర్ 12 (జనం సాక్షి) :** హయత్‌నగర్ గ్రామంలో జరుగుతున్న బొడ్రాయి ప్రతిష్టాపన ఉత్సవాలకు టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ హాజరయ్యారు. వేద పండితుల మంత్రోచ్ఛరణతో ప్రతిష్ఠించిన బొడ్రాయి వద్ద రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మధుయాష్కీ గౌడ్ మాట్లాడుతూ తాను పుట్టి పెరిగిన హయత్ నగర్ గ్రామం లో పెద్ద ఎత్తున ఉత్సవాలు నిర్వహించడం ఆనందంగా ఉన్నదని అన్నారు. గ్రామం లోని ప్రజలందరూ కుల మతాలకు రాజకీయాలకు అతీతంగా కలిసి బొడ్రాయి పండుగ నిర్వహిస్తున్నారని తెలిపారు. తమ ఒక్క కుటుంబమే కాకుండా ఊరంతా బాగుండాలని మంచి ఆలోచనతో ఈ ఉత్సవాన్ని నిర్వహించడం జరుగుతుందని వారు చెప్పారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన గ్రామ ఆడబిడ్డలను పిలుచుకొని బొడ్రాయి ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఉత్సవాలను ఘనంగా నిర్వహించిన ఉత్సవ కమిటీని వారు అభినందించారు. అంతే కాకుండా ఉత్సవాలకు ఆర్థికంగా సహకారం అందించిన అందరినీ అభినందించడం తో పాటు అధిక మొత్తంలో ఆర్థిక సహకారం అందించిన వద్దేపల్లి శ్రీశైలం నేతను ప్రత్యేకంగా అభినందించారు. పిసిసి కార్యదర్శి గజ్జి భాస్కర్ యాదవ్ ఆహ్వానం మేరకు వారి నివాసం లో సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమం లో జిహెచ్ఎంసి ఫ్లోర్ లీడర్ ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి, కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్, సీనియర్ నాయకులు గుర్రం



శ్రీనివాస్ రెడ్డి, వద్దేపల్లి శ్రీశైలం, డివిజన్ అధ్యక్షులు చెన్నగోని రవీందర్ గౌడ్, శ్రీపాల్ రెడ్డి, వేణుగోపాల్ యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాశం అశోక్ గౌడ్, నేలపాటి రామారావు, పన్యాల జయపాల్ రెడ్డి, మెగావాత్ గణేష్ నాయక్, దేవాలయ కమిటీల ధర్మకర్తలు కంచర్ల కవిత, నరేష్ గుప్తా, బండి గారి శ్రీనివాస్, తోకటి కిరణ్, ఎస్టీ సెల్ ఎల్బీనగర్ అధ్యక్షులు రమేష్ నాయక్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుర్రం శ్యామ్ చరణ్ రెడ్డి, సామ మహేశ్వర్ రెడ్డి, ధనరాజ్ గౌడ్, గణేష్ రెడ్డి, గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, భీమిడి రామ కృష్ణారెడ్డి, కారుకొండ శివకుమార్, రమాకాంత్, బొగ్గారాపు వరుణ్, కొల్లూరు శ్రీనాథ్, సాయిదీప్, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణకే ఫింగర్‌ప్రింట్ డివైస్ తనిఖీలు

**నారాయణపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 12 (జనంసాక్షి) :** ముందస్తు నేరాలను అరికట్టేందుకు ఫింగర్ ప్రింట్ డివైస్ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు నారాయణపేట టౌన్ ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదేశాల మేరకు ఆదివారంనారాయణపేట జిల్లా కేంద్రం లో ముందస్తు నేరాల నియం త్రణలో భాగంగా దొంగతనాల నివారణనే లక్ష్యంగా, అను మానిత వ్యక్తులను పాత నేరస్తులను గుర్తించడానికి బ్లూ కోర్ట్స్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపా రు. నారాయణపేట బస్టాండ్, ప్రధాన చౌరస్తాలలో నారాయ ణపేట పోలీసులు సంతోష్, రవి కుమార్ లు అకస్మికంగా ఫింగర్ ప్రింట్స్ డివైస్ తో తని ఖీలు నిర్వహించారు. అను మానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తులను



తగిన రీతిలో పరి శీలించి, ఆధునిక సాంకేతి కతను వినియోగిస్తూ ఫింగర్ ప్రింట్ డివైస్ తో వ్యక్తుల వేలి ముద్రలు సేకరించి క్రిమినల్ రికార్డులతో సరి పోల్చారు. పౌరులు ఎటువంటి అను మానాస్పద వ్యక్తులు గమ నించిన వెంటనే లోకల్ పోలీసులకు లేదా డయల్ 100 కి సమాచారం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఎస్పీ పార్టీ సత్తా చాటుతాం




**కల్వకుర్తి, అక్టోబర్ 12 (జనం సాక్షి) :** కల్వకుర్తి అసెంబ్లీ బహుజన సమాజ్ పార్టీ సమీక్ష సమావేశం జిల్లా అధ్యక్షులు బోనాసి రాంచందర్ అడ్వకేట్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. సమావేశంలో బిఎస్పీ నాయకులు మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఎస్పీ సత్తా చాటుతాం అన్నారు. అన్ని ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్, వార్డ్ మెంబర్ స్థానాల్లో బిఎస్పీ అభ్యర్థులను బరిలో ఉంచుతామని తెలిపారు. బీసీలకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల వాగ్దానమైన 42 శాతం రిజర్వేషన్లను ఇచ్చి, బీసీలపై నిజమైన చిత్తశుద్ధి చాటుకోవాలని అన్నారు. దేశంలో సీనియర్ దళిత ఐపీఎస్ అధికారి కుల వివక్ష వేధింపులు భరించలేక తన తుపాకీతో తనే కాల్చుకోవడం దళిత సీజేఐ పై దాడికి పూనుకోవడం లాంటి సంఘటనలు ఇంకా కుల వివక్షతలకు అద్దం పడుతున్నాయని విమర్శించారు. దేశంలో పూర్తిగా వివక్ష, అసమానతలను పాలక పార్టీలు రూపుమాపాలని డిమాండ్ చేశారు. బహుజనులు రాజ్యాధికారాన్ని సాధించడమే సకల సమస్యలకు పరిష్కారం అన్నారు. అందుకే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఎస్పీ అభ్యర్థులను గెలిపించాలని కల్వకుర్తి అసెంబ్లీ ప్రజలకు పిలుపునిచ్చారు. అట్లాగే నూతన అసెంబ్లీ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అసెంబ్లీ ఇంచార్జ్ గా పోలే సిద్దార్థ్, ఈర్లపల్లి రవి. నూతన అసెంబ్లీ అధ్యక్షులు ధన్నారం బాలు, ఉపాధ్యక్షులు కొప్పు నర్సింహ్మా, ప్రధాన కార్యదర్శి - ఆలూరి ప్రవీణ్, కోశాధికారి డప్పు మహేష్, ఈసీ మెంబర్ పబ్బతి శ్రీశైలం, వెల్దండ మండల అధ్యక్షులు నీరటి రమేష్ లను ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంతటి నాగన్న, ఈసీ మెంబర్ పృథ్వీరాజ్, బీసమోళ్ళ యోసేపు, కళ్యాణ్ లు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎట్టి ఆంజనేయులు, నాయకులు కృపానందం, మహేష్, రమేష్, శేఖర్, సుభాష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ నోముల వెంకటేశ్వర్లుకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రశంసలు

**హయత్‌నగర్, అక్టోబర్ 12 (జనం సాక్షి) :** హైదరాబాద్‌లోని ఐఎంఏ భవన్ తెలంగాణ రాష్ట్ర ఇండియన్ మెడికల్ అసోసియేషన్, అకాడమిక్ మెడికల్ స్పెషలిస్ట్ తెలంగాణ సంయుక్త ఆధ్వర్యం లో డాక్టర్ నోముల వెంకటేశ్వర్లు రచించిన "అబ్నార్మల్ సైకాలజీ: డిజార్డర్స్, డయాగ్నోసిస్ అండ్ ట్రీట్‌మెంట్" పుస్తకానికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సమావేశం ఆదివారం కోటీ ఐఎంఏ భవన్‌లో నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రముఖ వైద్యులు, అకాడెమిక్ నిపుణులు, ఐఎంఏ అధికార ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వైద్యనిపుణులు ఈ పుస్తకాన్ని వైద్యం, మనోవిజ్ఞానానికి మధ్య సేతగా నిలిచే, సామాజిక ప్రాధాన్యమున్న గ్రంథంగా ప్రశంసించారు.

### వైద్యనిపుణుల అభిప్రాయాలు..

డాక్టర్ ద్వారకానాథ రెడ్డి ఐఎంఏ అధ్యక్షుడు "సైకాలజీని మెడికల్ ప్రాక్టీస్‌లో భాగం చేయడం ఎంత అవసరమో ఈ పుస్తకం స్పష్టంగా తెలియజేస్తుంది. మానసిక ఆరోగ్యంపై వైద్యులు మరింత దృష్టి పెట్టేందుకు ఇది ప్రేరణ కలిగిస్తుందని వారు తెలిపారు. డాక్టర్ సి. సాయిరామ్, హానరరీ సెక్రటరీ, ఐఎంఏ




ఆంకాలజిస్ట్ (క్యాన్సర్ నిపుణుడు): "క్యాన్సర్ రోగుల్లో డిప్రెషన్ ఎక్కువగా ఉంటుంది. క్యాన్సర్ చికిత్సకు మానసిక మార్గదర్శకం ఎంతో అవసరం. ఈ పుస్తకం వైద్యులు, రోగులకు ఉపయోగపడే విలువైన అవగాహన ఇస్తుంది." మానసిక ఆరోగ్యం సంపూర్ణ ఆరోగ్యానికి వెన్నెముక. ఈ పుస్తకం వైద్య సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తుందని వారు అన్నారు. డాక్టర్ శేఖర్ రెడ్డి, ఛైర్మన్, ఐఎంఏ డాక్టర్ నోముల వెంకటేశ్వర్లు క్లినికల్ అవగాహనను మానసిక దృక్పథంతో అద్భుతంగా మిళితం చేశారు. ఈ పుస్తకం వైద్యులు, పీజీ విద్యార్థులకు ఉపయుక్తంగా ఉంటుందని వారు తెలియజేశారు. డాక్టర్ జి. సంపత్, వైస్ ఛైర్మన్, ఐఎంఏ సంక్లిష్టమైన మనోవిజ్ఞాన అంశాలను సులభంగా అర్థమయ్యే రీతిలో వివరించారు. డాక్టర్ కె.ఎస్. గిఫ్టున్, కార్యదర్శి సైన్స్‌తో పాటు మానవతా దృక్పథం కలిగిన స్ఫూర్తిదాయక గ్రంథం ఇది. డాక్టర్ మార్కండేయులు, చైల్డ్ స్పెషలిస్ట్, కామినేని హాస్పిటల్: చిన్న వయసు నుంచే మానసిక ఆరోగ్యంపై అవగాహన అవసరం. తల్లిదండ్రులు, వైద్యులు ఈ పుస్తకం ద్వారా చాలా నేర్చుకోవచ్చు.

### డాక్టర్ నోముల వెంకటేశ్వర్లు స్పందన

"నా పుస్తకాన్ని ఐఎంఏ వేదికపైకి తీసుకువచ్చిన డాక్టర్ సాయిరామ్ కి నా హృదయపూర్వక కృతజ్ఞతలు. ఈ ప్రశంస నా పరిశోధన, బోధన, మానసిక ఆరోగ్య ప్రచార యాత్రకు బలం చేకూరుస్తుందని ఆశిస్తున్నాను. గత నెలలో ఈ పుస్తకాన్ని తెలంగాణ డీజీపీ డాక్టర్ జితేందర్, ఐపీఎస్ పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆదిత్య, డాక్టర్ సాయిప్రసాద్, డాక్టర్ వీరేష్, డాక్టర్ రవీందర్, ఈసీజీ ఫౌండేషన్ అధ్యక్షులు, సైకాలజిస్టులు, మెంటల్ హెల్త్ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ముగ్గురు చిన్నారులపై కుక్కల దాడి

- భయాందోళనలో ప్రజలు



**మక్తల్, అక్టోబర్ 12 (జనంసాక్షి) :** ఊట్కూర్ మండల కేంద్రంలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తూ పలువురిపై దాడి చేసి గాయపరుస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఊట్కూర్ మండల కేంద్రంలోని పలు కాలనీలలో కుక్కలు ప్రజలు, పశువులపై దాడి చేస్తున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాజాగా ఆదివారం ఊట్కూర్ మండల కేంద్రంలోని శ్రీనివాస కాలనీ, బుడగ జంగం కాలనీలో ముగ్గురు చిన్నారులపై కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. ఇంటి ముందు ఆడుకుంటున్ననక్క విశ్వ అద్విత్, బుడగ జంగం రవి రాకేష్‌తో పాటు పలువురు చిన్నారులపై కుక్కలు దాడి చేసి గాయపరిచినట్లు బాధితుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో కుక్కలు స్వైరవిహారం చేస్తూ రాత్రివేళ ప్రజలను నిద్రాహారాలు లేకుండా చేయడంతో పాటు దాడి చేసి గాయపరచడంతో ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. గాయపడిన ముగ్గురు చిన్నారులకు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సలు చేయించినట్లు బాధితులు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి కుక్కల నుండి కాపాడాలని కోరుతున్నారు.

# బీసీల రాజ్యాధికారమే లక్ష్యం కావాలి

- బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు పాండు యాదవ్
- జిల్లా అధ్యక్షులుగా జక్కనపల్లి టి. నర్సింహ




**నారాయణపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 12 (జనం సాక్షి) :** బీసీలకు ఎవరి బిక్ష వద్దని రాజ్యాధికారమే లక్ష్యంగా ప్రతి బిసి పనిచేసి అధికారం దక్కించుకోవాలనిబిసి కులాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు పాండు యాదవ్, ఉపాధ్యక్షుడు బొక్క కాశీనాత్ పిలుపునిచ్చారు. ఆదివారం నారాయణపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావే శంలో వారు మాట్లాడుతూ బీసీలకు రాజ్యాధికారమే లక్షంగా బీసీ కులాల ఐక్యవే దిక కార్యాచరణను రూపొం దించుకొని పని చేయాలన్నారు. బీసీలు ఈ అగ్రకుల పాలకులు ఇచ్చే రిజర్వేషన్లపై ఆధారపడకుండా మన ఓటు మనకే మన నాయకత్వానికి వేసుకుని బీసీలను గెలిపిం చుకునే దిశగా బీసీ యువతను చైతన్యం చేసే దిశగా కార్యాచరణ రూపొందించుకొని ముఖ్యమంత్రి కుర్చీయే లక్ష్యంగా బీసీలు ఏకం కావ లసిన అవసరం ఉందన్నారు. 60 శాతం పైగా ఉన్న బీసీలు స్వతంత్రం వచ్చిన 80 ఏళ్ల నుండి యాచకులుగా మిగిలిపోతున్నారని అన్నారు. బీసీల ఓటు బీసీలకే అన్న నినాదంతో రాజ్యాధికారం వైపు బీసీ ప్రజలు ఏకం కావాలని అన్నారు. అనంతరం 11 మంది బేరర్స్‌తో కలిపి బీసీ కులాల ఐక్యవేదిక జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. నారాయణపేట జిల్లా అధ్యక్షులుగా టి. నర్సింహా ముదిరాజ్ నియమిస్తూ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకొని వారికి నియామక పత్రం అందజేశారు. ఈ సమావేశంలో సంధ్యమ్మ, విజయ్ మహేంద్ర, రాష్ట కార్యదర్శులు భీమేష్ ముదిరాజ్, వెంకటేష్, జిల్లా నాయకులు రాములు గౌడ్, ఆంజనేయులు, నర్సింలు , కే. పరుశురాం, వి.తిప్పరాజ్, జి. రామన్ గౌడ్ , వి సత్యన్న చారి, కుమ్మరి నరసింహం , వెంకటయ్య చారి, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బాణాసంచా విక్రయాలకు ముందస్తు అనుమతి తప్పనిసరి

- జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు



**మెదక్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 12 (జనం సాక్షి) :** దీపావళి పండుగ సందర్భంగా మెదక్ జిల్లా పరిధిలో తాత్కాలిక టపాకాయల దుకాణాలు నెలకొల్పదలచిన వ్యాపారులు తమ తమ సంబంధిత సబ్ డివిజనల్ పోలీస్ అధికారి కార్యాలయంలో ధరఖాస్తు చేసుకొని ముందస్తుగా అనుమతి పొందవలసిందిగా జిల్లా పోలీస్ అధికారి డీ.వి. శ్రీనివాసరావు తెలిపారు. దీనికి సంబంధించిన ఇతర వివరాలు, మార్గదర్శకాలు కోసం సంబంధిత సబ్ డివిజనల్ పోలీస్ అధికారిని సంప్రదించవలసిందిగా కోరారు. అలాగే ఎటువంటి అనుమతి లేకుండా టపాకాయల దుకాణాలు నెలకొల్పిన వారు పట్ల ఎక్స్‌ప్లోసివ్ యాక్ట్ 1884 రూల్స్ 1933 (సవరణ 2008) ప్రకారం కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు.

## నడకతో సంపూర్ణ ఆరోగ్యం



**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబర్ 12 (జనం సాక్షి) :** నడకతో సంపూర్ణ ఆరోగ్యం ఉంటుందని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ప్రపంచ ఆర్థరైటిస్ డే సందర్భంగా ఎస్వీఎస్ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన వాకథాన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, జెండా ఊపి వాకథాన్ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుత దైనందిన జీవితంలో ఆరోగ్యం పట్ల అశ్రద్ధ చూపిస్తూ అనేకమంది అనారోగ్యానికి లోనవుతున్నారని, ఆరోగ్యంగా ఉంటేనే మనిషి జీవితం సజావుగా సాగుతుందనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తు పెట్టుకుని ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని ఆయన సూచించారు. ప్రజల్లో ఆరోగ్యం పైన అవగాహన కల్పించడానికి ప్రతి సంవత్సరం ఎస్వీఎస్ ఆసుపత్రి మరియు మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో వాకథాన్ నిర్వహించడం అభినందనీయం అని అన్నారు. ప్రతి ఒక్కరికి నడక ఎంతో ముఖ్యమన్నారు. ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉండాలంటే ప్రతిరోజు వాకింగ్, వ్యాయామం అవసరమన్నారు. ఆర్థోపెడిక్ కు సంబంధించి ఎస్వీఎస్ ఆసుపత్రి లో సురక్షితమైన అధునాతన ఎక్విప్మెంట్స్‌తో అన్ని రకాల శాస్త్రం చికిత్సలు అందుబాటులో ఉన్నాయని, తెలంగాణ రాష్ట్రంలోనే బెస్ట్ ఆసుపత్రిగా ఎస్వీఎస్ ఆసుపత్రి అని ఆయన చెప్పారు. అనంతరం పద్మావతి కాలనీ కృష్ణ టెంపుల్ కమాన్ నుంచి ఏనుగొండ వరకు వాకథాన్‌లో ఆయన విద్యార్థులతో కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కెజె రెడ్డి, డాక్టర్ కృష్ణారెడ్డి, వెంకట్ రెడ్డి, రాంరెడ్డి, కర్నాకర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి

- రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగ భృతి అందించాలి
- డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ ప్రశాంత్




**జడ్చర్ల, అక్టోబర్ 12 (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ నిలబెట్టుకొని జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్స్ వేయాలని డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ కే. ప్రశాంత్ డిమాండ్ చేశారు. జడ్చర్ల అంబేద్కర్ కళాభవన్ లో ఆదివారం ఏర్పాటు చేసిన నిరుద్యోగ సదస్సులో పాల్గొన్న ప్రశాంత్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అన్ని ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు మొదటి ఏడాదిలోని రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చిందని ఇప్పటివరకు కేవలం 55 వేల ఉద్యోగాలను మాత్రమే భర్తీ చేసిందని, ఇంకా 1 లక్ష45 వేల ఉద్యోగాలను భర్తీ చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించే వరకు నిరుద్యోగ భృతి ఇస్తామని నేటి వరకు అందించలేదని నిరుద్యోగులకు వెంటనే ఇస్తామన్నా 4 వేలను అందించాలని అన్నారు. రాజీవ్ యువ వికాస్ పథకాన్ని ప్రారంభిస్తున్నామని చెప్పి దరఖాస్తులను స్వీకరించి నేటి వరకు లబ్ధిదారులకు నిధులు మంజూరు చేయలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి నిరుద్యోగ భృతిని అందించి, ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. డివైఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి ఎ. రాములు, కురుమూర్తి మాట్లాడుతూ జిల్లాలో ఉన్న స్థానిక పరిశ్రమల్లో స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో డివైఎఫ్ఐ జిల్లా నాయకులు భాను ప్రసాద్, మహేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జగన్, నాయకులు సాయిలు, మండల డివైఎఫ్ఐ నాయకులు రాము, అంజి, జగన్, నరసింహులు, శ్రీకాంత్, చెన్నకేశవులు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## డిసిసి అధ్యక్షుడిగా ఎవరిని నియమించిన కలిసి పనిచేస్తాం..

- నీలం మధు ముదిరాజ్



**పటాన్‌చెరు, అక్టోబర్ 12 (జనంసాక్షి) :** డీసీసీ అధ్యక్షుడిగా అధిష్టానం ఎవరిని నియమించిన వారితో కలిసి పనిచేస్తామని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోనీ రెడ్లస్ ఇన్ బాంక్వెట్ హాల్ లో ఆదివారం డిసిసి అధ్యక్షుడి ఎంపికకు సంబంధించి ఏఐసీసీ సెక్రటరీ, సంగారెడ్డి అబ్జర్వర్ సజరిట లైత్ ప్లాంగ్ గారి ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశం మరియు అభిప్రాయ సేకరణ కార్యక్రమంలో మంత్రి దామోదర రాజనర్సింహ, ఎంపీ సురేష్ షెట్కర్, పీసీసీ అబ్జర్వర్ ఎమ్మెల్యే లక్ష్మీకాంత్ రావు,మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, సంగారెడ్డి డిసిసి అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి, వివిధ కార్పోరేషన్ల చైర్మన్‌లతో కలసి నీలం మధు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రాష్ట్రాల్లో ఏఐసీసీ ఆదేశాల మేరకు డీసీసీ అధ్యక్షుల నియామకం కోసం ప్రత్యేక అబ్జర్వర్లను నియమించి అభిప్రాయ సేకరణ జరుపుతున్నారని తెలిపారు. కార్యకర్తల అభీష్టం మేరకు కాంగ్రెస్ పార్టీ అధిష్టానం డీసీసీ అధ్యక్షుడిగా ఎవరిని నియమించిన సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. బ్లాక్ స్థాయిలో నేతల అభిప్రాయంతో పాటు నియోజకవర్గ స్థాయిలో సమావేశాలు నిర్వహించి అందరి అభిప్రాయం తీసుకుని ఏఐసీసీ కి అందచేస్తారని పేర్కొన్నారు అక్కడ ఏఐసీసీ అగ్రనాయకులు అన్ని కోణాల్లో ఆలోచించి అధ్యక్షుడి నియామకం పై నిర్ణయం తీసుకుంటారని వివరించారు. కింది స్థాయిలో నాయకులు కార్యకర్తల అభిప్రాయం మేరకు అధ్యక్షుడిని నిర్ణయించడం శుభ పరిణామమన్నారు. సంగారెడ్డి డిసిసి అధ్యక్షుడిగా ఎవరిని నియమించిన సంపూర్ణ సహకారం అందించి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో వివిధ నియోజకవర్గాల ఇంచార్జీలు, మండల, టౌన్ మరియు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను పరిశీలించిన మంత్రి



**మక్తల్, అక్టోబర్ 12 (జనంసాక్షి) :** మక్తల్ నియోజకవర్గంలో మంత్రి వాకిటి శ్రీహరి పర్యటించారు. నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. నగరంలో నిర్మిస్తున్న 150 పడకల ఆసుపత్రిని మంత్రి సందర్శించారు. 42 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఆసుపత్రిని త్వరలో అందుబాటులోకి తెస్తామన్నారు. ఆసుపత్రి నిర్మాణ నాణ్యతను పరిశీలించి ఇంజనీర్లకు తగు సూచనలు చేశారు. పనులు వేగవంతం అయ్యేలా చూడాలని ఇంజనీర్లను మంత్రి ఆదేశించారు. అలాగే నగరం నడిబొడ్డున ఉన్న పడమటి ఆంజనేయస్వామి కోనేరును మంత్రి సందర్శించారు. కోనేరు పునర్నిర్మాణం పై అధికారులకు తగు సూచనలు చేశారు. నియోజకవర్గంలో పలు వివాహ శుభకార్యాలకు హాజరై నూతన వధూవరులను మంత్రి ఆశీర్వదించారు.

## బీసీల రాష్ట్ర బంద్‌ను జయప్రదం చేయండి

- బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షులు కృష్ణ యాదవ్



**జడ్చర్ల, అక్టోబర్ 12 (జనంసాక్షి) :** ఈనెల 14న బీసీల రాష్ట్ర బంద్ ను జయప్రదం చేయాలని బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షులు బూరుగుపల్లి కృష్ణ యాదవ్ ఆధ్వర్యంలో 22 బీసీ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం జడ్చర్ల ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో బీసీ సంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి, ఈనెల 14న బీసీ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే బందుకు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా కృష్ణ యాదవ్ మాట్లాడుతూ స్థానిక సంస్థలలో బీసీలకు ఇచ్చిన 42 శాతం రిజర్వేషన్లపై హైకోర్టు స్టే ఇచ్చినందుకు నిరసనగా నిర్వహించే బందు కార్యక్రమానికి అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు మద్దతుగా కలిసి రావాలని అన్నారు. కార్యక్రమంలో బిసి విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేష్ ముదిరాజ్, ఫకీర్ హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు జహంగీర్, బీసీ జాగృతి సేన మండల అధ్యక్షులు నర్సింలు, కార్యదర్శి రఘు, నాగేష్, శివ శంకర్, మధుసూదన్, కృష్ణ, శేఖర్, జహీర్, గిరి తదితరులు పాల్గొన్నారు.

## పేద ప్రజలకు భరోసా సీఎం రిలీఫ్ ఫండ్

- కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ - కేశమల్ల కృష్ణ



**వెల్దండ, అక్టోబర్ 12 (జనంసాక్షి) :** అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ నిరుపేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో భరోసా నిస్తుందని కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కేశమల్ల కృష్ణ అన్నారు. వెల్దండ మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన కాటిక మనీషా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాదులో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన 24,000 వేల చెక్కును బాధితురాలికి పెద్దాపూర్ గ్రామంలో కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కేశ మల్ల కృష్ణ అందజేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మారెడ్డి, జంగయ్య గౌడ్, విజేందర్, రామస్వామి, రాములు, కృష్ణయ్య, బాలయ్య, తిరుపతి నాయక్, సుధాకర్, కొండల్, శివధనస్సు, ఎండి అజార్, అనిల్ కుమార్, రమేష్, మహేష్, కిరణ్, శ్రీను, ప్రశాంత్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతో మానసికోల్లాసం



**మెదక్, అక్టోబర్ 12 (జనంసాక్షి) :** క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని మెదక్ జిల్లా బిఆర్ఎస్ నాయకులు నియోజకవర్గ ఇన్చార్జ్ కంఠరెడ్డి. తిరుపతిరెడ్డి అన్నారు. మెదక్ జిల్లా శంకరంపేట మండలంలోని రుద్రారం గ్రామంలో ఆదివారం ప్రీమియం లీగ్ సీజన్ 5 నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌ను బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులతో కలిసి క్రికెట్ ను వీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని అన్నారు. గ్రామాలలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, శారీరక దృఢత్వాన్ని కలిగిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కసిరెడ్డి మాణిక్యం రెడ్డి, మండల రైతు బంధు మాజీ అధ్యక్షులు లక్ష్మారెడ్డి, మాజీ సర్పంచులు మంచాల.లక్ష్మణ్, కుమార్ గౌడ్,పూలపల్లి. యాదగిరి,శ్రీనివాస్, ప్రభాకర్, కల్వకుంట పిఏసిఎస్ చైర్మన్ అందె. కొండల్ రెడ్డి, నాయకులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా డీసీసీ అధ్యక్షుల ఎంపిక

- ఈ నెల 22 వరకు పూర్తి నివేదికను ఏఐసిసికి అందిస్తాం
- తెలంగాణలో బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది
- పాండిచ్చేరి మాజీ ముఖ్యమంత్రి,డిసిసి ఎన్నికల పరిశీలకులు వేలు నారాయణస్వామి




**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 12 (జనంసాక్షి) :** నాగర్ కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని అన్ని జిల్లాల డిసిసి అధ్యక్షుల అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా జరుగుతుందని పాండిచ్చేరి మాజీ ముఖ్యమంత్రి,డిసిసి ఎన్నికల పరిశీలకులు వేలు నారాయణస్వామి అన్నారు.ఆదివారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్సీ కూచుకుల్ల దామోదర్ రెడ్డి స్వగృహంలో డిసీసీ అధ్యక్షుడు,అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ స్థాయి నుండి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,జిల్లా నాయకులు ప్రజా ప్రతినిధులు యువజన కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్,సేవాదళ్ సభ్యుల అభిప్రాయాలను కూడా పరిగణలోకి తీసుకోవడం జరుగుతుందని, పార్టీ అభివృద్ధి కోసం పాటుపడే అభ్యర్థులను అందరి ఆమోదంతో డీసీసీ అధ్యక్షులను నియమిస్తామని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. నాగర్ కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని నాగర్ కర్నూల్, వనపర్తి, గద్వాల జిల్లాల జిల్లాల డిసిసి అధ్యక్షుల ఎన్నికల కోసం ఏఐసీసీ తనను అబ్జర్వర్ గా పంపడం జరిగిందని తెలిపారు. ఈ మూడు జిల్లాల్లో ఆశావహుల నుంచి దరఖాస్తులను ఆదివారం రోజు మధ్యాహ్నం 12 గంటల నుండి స్వీకరించడం జరుగుతుందన్నారు.సాయంత్రం 4 గంటలకు సమావేశం ఏర్పాటు చేసి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వారితో ప్రత్యేక సమావేశం ఉంటుందన్నారు.మూడు రోజులపాటు నాగర్ కర్నూల్, వనపర్తి,గద్వాల జిల్లాలలో డీసీసీ అభ్యర్థుల ఎంపిక కోసం ఇక్కడే ఉండి సమావేశాలను ఏర్పాటు చేసి అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను నిర్వహిస్తామన్నారు.ఈనెల 22 వరకు పూర్తి నివేదికను ఏఐసీసీకి పంపుతామని,డిసిసి అధ్యక్షుల ఎంపిక ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే,రాహుల్ గాంధీ,సోనియా గాంధీ ఆదేశాల మేరకు వారే ప్రకటన చేస్తారని నారాయణస్వామి అన్నారు.

### తెలంగాణలో బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది

తెలంగాణలో బీసీ రిజర్వేషన్ల అంశంపై విలేకరులు అడిగిన ప్రశ్నలకు నారాయణస్వామి సమాధానం ఇస్తూ దేశంలో జనాభా ధమాషా ప్రకారం వెనుకబడిన కులాలకు రాజకీయంగా రిజర్వేషన్లను కల్పించాలని లక్ష్యంతో ఎఐసిసి అధ్యక్షురాలు సోనియాగాంధీ రాహుల్ గాంధీ కృత నిశ్చయంతో ఉన్నారని అందులో భాగంగానే కర్ణాటక తమిళనాడు వంటి రాష్ట్రాలలో బీసీలకు రిజర్వేషన్లను కల్పిస్తూ ముందుకు వెళ్లినట్లు పాండిచ్చేరి మాజీ ముఖ్యమంత్రి నారాయణస్వామి స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రంలోనూ బీసీ జనాభా దామాషా ప్రకారం 42శాతం రిజర్వేషన్‌ను అమలు జరిగేలా న్యాయపరమైన చెక్కులు లేకుండానే ప్రభుత్వం జీవో నెంబర్ 9 ఇచ్చినట్లు తెలిపారు. కర్ణాటక రాష్ట్రంలో 52 శాతం, తమిళనాడు రాష్ట్రంలో 69 శాతం బీసీలకు రిజర్వేషన్ కల్పిస్తూ చట్టబద్ధత సాధించగా, ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో జనాభా ప్రాతిపదికన 42 శాతం రిజర్వేషన్‌ను కల్పిస్తూ ప్రభుత్వం న్యాయపరమైన చిక్కులు లేకుండా జీవో నెంబర్ 9ని విడుదల చేసినట్లు తెలిపారు. కాగా కొందరు బీసీ రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ కోర్టులను ఆశ్రయించినట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఏది ఏమైనప్పటికీ ఎట్టి పరిస్థితుల్లోనూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు. అందుకు రాష్ట్ర పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్విరామంగా శ్రమిస్తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో డిసిసి అధ్యక్షుడు అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ, నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి, ఎమ్మెల్సీ అమీర్ అలీ ఖాన్, అబ్జర్వర్లు బొజ్జ సంధ్యారెడ్డి, సాంబుల శ్రీకాంత్ గౌడ్, శ్రీనివాస్, కోటేష్, జిల్లా గ్రంధాలయ చైర్మన్ రాజేందర్, మార్కెట్ కమిటీ చైర్మెన్ రమణ రావు, నాయకులు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఏట మధుకర్ ఆత్మహత్యపై సమగ్ర విచారణ

- బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్



**బెల్లంపల్లి, అక్టోబర్ 12 (జనంసాక్షి) :** బెల్లంపల్లి నియోజకవర్గం వేమనపల్లి మండల బీజేపీ అధ్యక్షుడు ఏట మధుకర్ ఆత్మహత్యపై సమగ్ర విచారణ జరపాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఒక ప్రకటనలో కోరారు. వేమనపల్లి మండల బీజేపీ అధ్యక్షుడు ఏట మధుకర్ ఆత్మహత్య ఘటనపై ఎమ్మెల్యే గడ్డం వినోద్ స్పందించారు. ఏట మధుకర్ ఆత్మహత్య ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై పోలీసులు సమగ్ర విచారణ జరిపించి, దీనికి సంబంధించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సంఘటన వెనుక ఉన్న నిజాలను వెలికితీసి మధుకర్ ఆత్మహత్యకు ప్రేరేపించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసులు నిష్పక్షపాతంగా, వేగవంతమైన విచారణ జరపాలన్నారు. బాధ్యులెవరైనా వదిలివేయరాదన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు కఠినంగా వ్యవహరించాలని కోరారు. ఆయన ఏట మధుకర్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ప్రభుత్వ స్థాయిలో అన్ని విధాల సహాయం అందించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## ప్రజలకు కాంగ్రెస్ పడ్డ బాకీ వెంటనే తీర్చాల్సిందే..

- బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య



**కాసిపేట, అక్టోబర్ 12 (జనంసాక్షి) :** ప్రజలకు కాంగ్రెస్ పడ్డ బాకీ వెంటనే తీర్చాల్సిందే అని బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య డిమాండ్ చేశారు. ఆదివారం కాసిపేట మండలంలోని దేవాపూర్ లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ బాకీ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన ఎన్నికల గ్యారెంటీల హామీపై ప్రజలకు ఇచ్చిన హామీలు, అమలు చేయకుండా చేసిన మోసాన్ని ప్రజలకు వివరించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల హామీ ప్రకారం 22 నెలల పాలనలో కాంగ్రెస్ పార్టీ బాకీ పడ్డ అప్పు వెంటనే ప్రజలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కోసం, ఓటు కోసం ఇంటికి వచ్చే కాంగ్రెస్ నాయకులను ప్రజలు నిలదీయాలన్నారు. వచ్చే ఏ ఎన్నికల్లో నైనా బీఆర్ఎస్ ను గెలిపిస్తే ప్రజల తరుపు పోరాడి, ప్రభుత్వం నుంచి హామీలు అమలు చేసే విధంగా పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు బొల్లు రమణారెడ్డి, గొంది వెంకటరమణ, మాజీ ఎంపీటీసీ కొండబత్తుల రాంచందర్, అగ్గి సత్తయ్య, మాజీ ఉప సర్పంచ్ బోయిని తిరుపతి, దండవేణి చందు, కైలాష్, గోనె రవి, అట్కపురం రమేష్, కసాడి భూమన్న, సుధీర్, సుధాకర్ రెడ్డి, జాడి రాంచందర్, కుమ్మరి శేఖర్, దుర్గం సాగర్, పెంద్రం హనుమంతు, కొమురయ్య, మంగ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## కాళేశ్వరం ప్రాజెక్ట్ ముంపు బాధితులందరికీ
# పరిహారం అందిస్తాం

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్



**మంచిర్యాల ప్రతినిధి, అక్టోబర్ 12 (జనంసాక్షి) :** కాళేశ్వరం ప్రాజెక్టులో భూములు కోల్పోయిన అర్హత కలిగిన ముంపు బాధితులు అందరికీ పరిహారం అందించే విధంగా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ అన్నారు. ఆదివారం మంచిర్యాల జిల్లాలోని చెన్నూరు పట్టణంలోని శాసనసభ్యుల క్యాంపు కార్యాలయంలో కోటపల్లి మండలం బబ్బెర చెలక, దేవులవాడ గ్రామాల రైతులతో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, కోటపల్లి మండల తహసిల్దార్ రాఘవేంద్ర లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ.... కాళేశ్వరం ప్రాజెక్టులో భూములు కోల్పోయిన అర్హులైన బాధితులు అందరికీ పరిహారం అందించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. చట్ట ప్రకారం అర్హులైన బాధితులకు పరిహారం అందించడం జరుగుతుందని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు కంటే ముందు 36 వేల కోట్ల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టిన ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణాన్ని 11 వేల కోట్ల రూపాయల వరకు పూర్తి చేయడం జరిగిందని, మిగిలిన 25 వేల కోట్ల రూపాయల పనులు పూర్తి చేసినట్లయితే ఈ ప్రాంతంలో 55 వేల ఎకరాల ఆయకట్టు భూమిలో రైతులు అధిక దిగుబడితో పంట సాగు చేసేవారని, భూములు కోల్పోయే పరిస్థితి ఉండేది కాదని తెలిపారు. గత ప్రభుత్వం చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు కారణంగా బ్యాక్ వాటర్ తో పంట పొలాలు, కొన్ని నివాస ప్రాంతాలు ముంపుకు గురై ప్రజలు ఎంతో నష్టపోయారని తెలిపారు. ముంపు బాధితులకు పూర్తి స్థాయిలో నష్టపరిహారం చెల్లించలేదని, ఈ చర్యతో పాటు గత ప్రభుత్వ లోటుపాట్లను సరి చేసుకుంటూ రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. ముంపు బాధితుల సంక్షేమంలో భాగంగా ఇప్పటి వరకు 10 కోట్ల రూపాయలు కేటాయించి అర్హులైన వారికి అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. భూ సేకరణ ప్రక్రియ నిర్వహించి ప్రభుత్వం కేటాయించిన ప్రకారం లబ్ధిదారులకు పరిహారం అందించడం జరుగుతుందని తెలిపారు. ముందుగా అసలైన పట్టేదారు రైతులకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, అర్హులైన మిగతా వారికి సైతం పరిహారం అందిస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన నిరుపేద లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 500 రూపాయలకే రాయితీ గ్యాస్ సిలిండర్, రైతు భరోసా, రైతు బీమా వంటి అనేక ప్రజా ప్రయోజనకర పథకాలను అమలు చేయడంతో పాటు మహిళల ఆర్థిక అభివృద్ధికి చేయూతనిస్తూ స్వయం సహాయక సంఘాలకు రుణ సదుపాయం కల్పించి వ్యాపారాలు చేసుకునే విధంగా ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ...అర్హులైన ముంపు బాధితులందరికీ పరిహారం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఎలాంటి వివాదాలు లేని భూములకు అవార్డు జారీ చేయడం జరుగుతుందని, డిసెంబర్ 18, 19 తేదీలలో అర్హులైన వారికి అందించడం జరుగుతుందని తెలిపారు. భూ సంబంధిత వివాదాలలో రాజీ అయిన వారికి నిబంధనల ప్రకారం చెల్లింపులు జరుగుతాయని, లేని పక్షంలో సంబంధించిన అవార్డు మొత్తమును సంబంధిత కోర్టులో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. 33 కోట్ల రూపాయలలో 5 కోట్ల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని, మరో 5 కోట్ల రూపాయలు పి.డి. ఖాతాలో ఉన్నాయని తెలిపారు. అర్హత కలిగిన ముంపు బాధితులందరికీ పరిహారం అందించడం జరుగుతుందని, బాధితులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీల పోరాట యోధుడు కొమురం భీం

- ఆదివాసీల పొడుభూములకు పట్టాలు ఇవ్వాలి
- లంబాడీలు ఎస్టి లు కాదు,వారిని ఎస్టి జాబితా నుండి తొలగించాలి
- భూ బదలాయింపు నిషేధ చట్టం 1/57, 1/70లను పకడ్బందీగా అమలు చేయాలి
- తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షులు ఈసం సుధాకర్



**గూడూరు,అక్టోబర్ 12(జనంసాక్షి):** కొమురం భీం పోరాట చరిత్రను ప్రతి ఆదివాసీ యువతీ యువకులు అభ్యసించాలని తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు ఈసం సుధాకర్ అన్నారు.కొమురం భీం 85వ,వర్ధంతి సందర్భంగా ఆదివారం గూడూరు మండల కేంద్రంలో కొమురం భీం విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఈసం సుధాకర్ హాజరై మాట్లాడుతూ జల్, జంగిల్, జమిన్ నినాదంతో నైజంకు వ్యతిరేకంగా ఆదివాసీ హక్కుల కోసం విరోచితంగా పోరాడి, 1940 ఆశ్వయుజ శుద్ధ పౌర్ణమి అశువులు బాసిన అమరవీరుడు కొమురం భీం 2025 ఆశ్వయుజ శుద్ధ పౌర్ణమి అక్టోబర్ నాటికి 85వ వర్ధంతిని తుడుందెబ్బ, ఆదివాసీ సంఘాలు, ఉద్యోగ సంఘాలు ఆధ్వర్యంలో 'భీమ్' 85వ, ర్ధంతిని ఘనంగా నిర్వహించుకున్నామని, కొమరం భీం పోరాట చరిత్రను ప్రతి ఆదివాసీ యువతి,యువకులు అభ్యసించాలని,ఆయన పోరాట స్ఫూర్తితో జల్, జంగిల్, జమిన్ లకై భారత రాజ్యాంగం లో కల్పించబడ్డ హక్కులను కాపాడాలని కోరారు. అదేవిదంగా ఆదివాసీలు సాగు చేసుకుంటున్నటువంటి పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, లంబాడీలు ఎస్టీలు కాదని, వారిని ఎస్టీ జాబితా నుండి తొలగించాలని, లంబాడీలా మూలాన విద్య, ఉద్యోగ, రాజకీయ, తదితర ఆదివాసీ రిజర్వేషన్లలో దోపిడీ జరుగుతోందని, షెడ్యూల్ ప్రాంతంలో 29 ప్రభుత్వ శాఖలలోని జీవోలను చట్టం చేయాలని, భారత రాజ్యాంగం లోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్రంలో సుమారుగా 800 ఆదివాసీ గ్రామాలకు షెడ్యూల్ హోదా లేనందున, ఆదివాసీలు ఉద్యోగాలు,విద్య, ఉపాధి,రాజకీయ పదవులు, భూములను కోల్పోతున్నారని,ఆదివాసీలకు అందవలసిన సంక్షేమ పథకాలు అందక అణగారిన జనజీవనం గడుపుతు అత్యాచారాలకు గురవుతున్నారని, వెంటనే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని సుమారు 800 నాన్ షెడ్యూల్ గ్రామాలను షెడ్యూల్ గ్రామలుగా గుర్తించాలని అన్నారు. షెడ్యుల్ ప్రాంత భూబదలాయింపు నిషేధ చట్టం 1/59,1/70 లను పకడ్బందీగా అమలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి పడిగె నాగేశ్వరరావు దొర, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షులు బొల్లి సారయ్య, ఉద్యోగ సంఘం నాయకులు ముయ్యబోయిన వెంకన్న, తుడుదెబ్బ మండల అధ్యక్షులు లింగాల కిరణ్, సర్పంచ్ ఫోరం జక్క లక్ష్మయ్య రేగ రమేష్,సునీలు,మల్లేష్, శ్రీను, ప్రవీణ్, చాపల శ్రీను, వాసం కిరణ్,ఈసం పాపారావు,గొప్ప కార్తీక్, వాసం సందీప్,మేకల మధు, తదితరులు పాల్గొన్నారు.

## బొగ్గు టిప్పర్ యజమానుల ధర్నా



**మల్హర్, అక్టోబర్ 12(జనం సాక్షి) :** మండల కేంద్రమైన తాడిచెర్ల ఓసీపీ బ్లాక్ 01 నుండి కెటిపిపి చెల్పూర్ పవర్ ప్లాంట్ కు బొగ్గు రవాణా చేస్తున్న బొగ్గు లారీ టిప్పర్ల కిరాయిలు వెంటనే పెంచాలని మల్హర్ రావు మండల టిప్పర్ అసోసియేషన్ యజమానులు ఆదివారం మండలంలోని కొయ్యూర్ ప్రదాన రహదారి పై ధర్నా రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ తాము ఎనిమిదేళ్ళుగా బొగ్గు రవాణా చేస్తున్నామని తెలిపారు. పెరిగిన డీజిల్, మెయింటనేన్స్, డ్రైవర్ జీతాలకు అనుగుణంగా కిరాయిలు పెంచాలని ఎన్నోసార్లు కోరినప్పటికి ట్రాన్స్ పోర్ట్ యజమానులు పెడ చెవిన పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాడిచర్లలో భూములు కోల్పోయి ఉపాది లేక మోటార్ ఫీల్డ్ ఎంచుకున్న మాకు ఎనిమిదేళ్ళుగా చార్జీలు పెంచక ఇచ్చే కిరాయిలు గిట్టుబాటు కాకా అప్పుల పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కో టిప్పర్ కు వచ్చే కిరాయి ఖర్చులు, మెయింటనేన్స్ డీజిల్, డ్రైవర్ జీతాలు చాలక ఇబ్బందులు పడుతున్నామని ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్ చార్జీలు పెంచక మా పొట్టలు కొడుతూ ఇబ్బందులకు గురి చేస్తు రోడ్డున పడే విధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ట్రాన్స్ పోర్ట్ యజమానులతో పాటు అధికారులు, ప్రభుత్వం, ఏఎమ్మార్, జెన్కో అధికారులు తమ సమస్యల పరిష్కరించే విధంగా చొరవ తీసుకుని న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. తమ సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళన కార్యక్రమాలు కొనసాగిస్తామని వెల్లడించారు.



## సామాజిక న్యాయానికి రేవంత్ సర్కార్ పెద్దపీట

- కార్యకర్తలు బలంగా ఉంటేనే పార్టీ బలంగా ఉంటుంది
- పిసిసి పరిశీలకులు అందరి అభిప్రాయాలను సేకరిస్తారు
- స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**స్టేషన్ ఘన్పూర్, అక్టోబర్ 12 (జనంసాక్షి) :** సామాజిక న్యాయానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రంలోని ఎస్ కన్వెన్షన్ లో సంగతన్ సృజన్ అభి యాన్ కార్యక్రమంలో భాగంగా డిసిసి అధ్యక్ష పదవి ఎన్నిక కొరకు ఏర్పాటు చేసిన నియోజకవర్గ సమావే శంలో ఏఐసిసి పరిశీలకులు దేబాసిస్ పట్నాయక్, టీ పిసిసి పరిశీలకులు షాద్ నగర్ ఎమ్మెల్యే శంకరయ్య, ఎండి అవేజ్, శ్రీకాంత్ యాదవ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గం లో డిసిసి అధ్యక్ష పదవిపై ఆసక్తి ఉన్న నాయకుల నుండి పిసిసి పరిశీలకులు దరఖాస్తులు స్వీకరించారు. అలాగే నియోజకవర్గ నాయకులనుండి అభిప్రాయాల ను సేకరించారు. అంతకుముందు నిర్వహించిన మీడి యా సమావేశంలో పిసిసి పరిశీలకులు, ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడారు. పార్టీ పదవుల ఎన్నిక పారదర్శకంగా జరగాలని ఒక మంచి సంప్రదాయాన్ని కాంగ్రెస్ పార్టీ ముందుకు తీసుకువచ్చిందని తెలిపారు. ఏ పార్టీకి అయినా కార్యకర్తలే పునాది అని, అలాంటి కార్యకర్తలు బలంగా ఉంటేనే పార్టీ బలంగా ఉంటుంద ని అన్నారు. పార్టీ సంస్థాగత నిర్మాణం బలంగా ఉన్నప్పుడే పార్టీ ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా నిలబడగలుగుతుందని తెలిపారు. ఎంపిక, ఎన్నిక విధానంపై పార్టీ నిర్మాణం జరుగుతుందని వెల్లడించారు. బిసిలపైన బీజేపీ, బిఆర్ఎస్ పార్టీలు కపట ప్రేమను ప్రదర్శిస్తున్నాయని ఆరోపించారు. తెలంగాణ బీజేపీ మంత్రులు, ఎంపీలు బిసి రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నామని ఎందుకు ప్రకటించడం లేదని ప్రశ్నించారు. బిసి రిజర్వేషన్లకు వ్యతిరేకం అని ప్రకటించే ధైర్యం ఏ పార్టీకి అయినా ఉందా అని అన్నారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసే రోజు ఖచ్చితంగా వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో చైర్మన్లు, ప్రజా ప్రతినిధులు, మండల పార్టీ అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, పీఏసీఎస్ చైర్మన్లు, సమన్వ య కమిటీ సభ్యులు,అనుబంధ సంఘాల అధ్యక్షులు, రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు, ఇతర ముఖ్య నాయ కులు తదితరులు పాల్గొన్నారు.

## పెద్దవంగరలో యధేచ్ఛగా మట్టి దందా

- ప్రభుత్వ ఆదాయానికి గండి
- సొమ్ము చేసుకుంటున్న దళారులు
- నిమ్మకు నీరు ఎత్తనట్లుగా వ్యవహరిస్తున్న అధికార యంత్రాంగం
- ఇందిరమ్మ ఇండ్లకు ప్రైవేటు వ్యవస్థ





**పెద్దవంగర అక్టోబర్ 12(జనం సాక్షి)** పెద్దవంగర మండల కేంద్రంలోని మట్టి మాఫీ మాఫియా ఆగడాలు రోజురోజుకు మితిమీరిపోతున్నాయి. ఇందిరమ్మ ఇండ్ల పేరుతో పేరుతో ప్రైవేట్ వ్యవస్థకు దారి మళ్లిస్తూ దళారులు సొమ్ము చేసుకుంటున్నారు దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ రెట్టింపు రేట్లతో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఇబ్బందికరమైన వాతావరణాన్ని ఏర్పరుస్తున్నారు. మరి అధికారులు ఏమైనట్టు ఇంత మట్టి మాఫియా, దళారి వ్యవస్థ మితిమీరిపోతున్న కానీ అధికారులు నిమ్మకు నీరెత్తన్నట్లుగా వ్యవహరిస్తున్నారంటే మామూళ్ల మత్తులో అధికార యంత్రాంగం ఉన్నదని ప్రజలు చెవులు కొరుక్కుంటున్నారు. తూతూ మంత్రంగా గ్రామపంచాయతీలో కార్యదర్శికి 2000 చలానా కట్టి ఇందిరమ్మ ఇళ్ల పేరుతో ప్రైవేట్ గా మట్టి మాఫియాను కొనసాగిస్తున్నారు మరి ఈ దళారి వ్యవస్థను ఆపేదెల అనే సందిగ్ధం ప్రజలలో నెలకొన్నది. ప్రైవేట్ వెంచర్లు, ఫంక్షన్ హాల్స్ కాకుండా ఇతరాత్రా ప్రైవేట్ దందాలకు తెర లేపుతూ మట్టి మాఫియా దళారులు అధికార యంత్రాంగాన్ని బురిడీ కొట్టించి నమ్మించి ఎస్సారెస్పీ కాల్వకు ఉన్న మట్టిని మొత్తం గద్దల్లాగా తోడేశారు. ఒక్కసారి ఎస్సారెస్పీ కెనాల్ పెద్దవంగరకు వెళ్లి చూస్తే పరిస్థితి అర్థమవుతుంది మరి ఈ పరిస్థితి ఎందుకు దాపురించింది అధికార యంత్రాంగం లోపమా లేదా అధికారులు మామూళ్ల మత్తులో ఉన్నారా అనేది ప్రజలకు తెలియాల్సి ఉంది. ఇప్పటికైనా ఈ యొక్క దళారి వ్యవస్థను రూపుమాపి ప్రభుత్వానికి ఆదాయాన్ని చేకూర్చి పేద ప్రజలకు లబ్ధి జరిగేలా చూడాలని ఆశిస్తున్నారు.



## కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్ష బరిలో కొలిపాక సతీష్

**స్టేషన్ ఘన్పూర్, అక్టోబర్ 12 ( జనం సాక్షి ) :** జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష బరిలో ఘనపూర్ మండల కేంద్రానికి చెందిన కొలిపాక సతీష్ నేడు ఘన పూర్ మండల కేంద్రంలో ఎస్ కన్వెన్షన్ లో ఏఐసీసీ అబ్జా ర్వార్ దేబాసిస్ పట్నాయక్ షాదనగర్ ఎమ్మెల్యే శంకరయ్య, స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరిని, ఆవేజ్ శ్రీకాంత్ యాదవ్ కి జనగామజిల్లా కాంగ్రెస్ పార్టీఅధ్యక్ష పదవి కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా కొలిపాక సతీష్ మాట్లాడుతూ దాదాపు కాంగ్రెస్ పార్టీ లో 27 సంవత్సరాల నుండి ఎన్ఎస్ యూ ఐ మండల అధ్యక్షుడిగా,వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి గా, ఉపాధ్యక్షులుగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఎన్ ఎస్ యూ ఐ రాష్ట్ర కో ఆర్డి నేటర్ గా,యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా, ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సహాయకార్యదర్శి,కార్యదర్శిగా పనిచేసి, ప్రభాగండ కమిటీ సభ్యులుగా పని చేయడం జరిగిందన్నారు.వరంగల్ పశ్చిమనియోజకవర్గ ఎన్నికల ఇంచార్జ్ గా, హుస్నా బాద్ నియోజకవర్గంలో భీందేవరపల్లి మండలం జై బాపు,జై భీమ్, జై సంవిధన్ ఇంచార్జ్ గా, పని చేయడం జరిగిందని అన్నారు.బీసీగా తనకు అవకాశం కల్పించాలని,అలాగే పార్టీకి చేసిన సేవలను గుర్తించి జనగామ జిల్లా అధ్యక్షుడిగా అవకాశం ఇవ్వాలని కోరారు.

# డైలీవేజ్ వర్కర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి

- హాస్టల్ వర్కర్స్ యూనియన్‌తో వెంటనే చర్చలు జరపాలి



**ఏటూరునాగారం, అక్టోబర్ 12 (జనంసాక్షి) :** గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని హాస్టల్స్, ఆశ్రమ పాఠశాలలో డైలీ వైజ్ వర్కర్లుగా పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని చేస్తున్న నిరవధిక సమ్మె 31వ రోజుకు చేరుకుంది. ఈ సమ్మె కి పూర్తి మద్దతు తెలుపుతూ సిపిఎం జిల్లా కార్యదర్శి జిల్లా బి సాంబశివ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో పనిచేస్తున్న వర్కర్లు గత 31 రోజులుగా సమ్మె చేస్తుంటే సమస్య పరిష్కారం చేయకుండా నిర్లక్ష్యం చేయడం తగదని వెంటనే వారి యొక్క ప్రధానమైన డిమాండ్ల పరిష్కారం కోసం ప్రభుత్వం యూనియన్ నాయకులతో చర్చలు జరపాలి అని అన్నారు. వేతనాలను పెంచాల్సిన ప్రభుత్వం తగ్గిస్తూ జీవో నెంబర్ 64ను తీసుకురావడం దుర్మార్గం అని అన్నారు. అర్హులైన అందరికీ టైం స్కేల్ అమలు అయ్యేటట్టుగా ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్మికులను డైలీ వేజ్ నుండి ఔట్ సోర్సింగ్ చేసే ఆలోచన విరమించుకోవాలని అన్నారు. మీ సమస్యల పరిష్కారం కోసం సిపిఎం ఆద్వర్యంలో ఆందోళన పోరాటాలు చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎండి దావూద్, కార్యదర్శి రత్నం రాజేందర్, రఘుపతి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టిఎల్ రవి, వర్కర్ లు ఎం నాగలక్ష్మి, భాగ్యలక్ష్మి, జయలక్ష్మి, సమ్మక్క, విజయ లక్ష్మి, రాజు, సూర్యతేజ, ఇందిరా, సుమలత, సాంబయ్య, శివకృష్ణ, జంపయ్య, నాగమణి, సారిబాబు తదితరులు పాల్గొన్నారు.

## రైతాంగం సేంద్రీయ వ్యవసాయం బాట పట్టాలి



**దమ్మపేట, అక్టోబర్ 12 (జనంసాక్షి) :** దమ్మపేట మండలం అప్పారావుపేట గ్రామ సమీపంలో తెలంగాణ రాష్ట్ర ఆయిల్ ఫామ్ రైతుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సభలో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ, పామాయిల్ సాగు రైతులకు బంగారు బాటగా నిలుస్తుందన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు వచ్చే పంటగా పామాయిల్ ప్రసిద్ధి చెందిందని తెలిపారు. ఆయిల్ ఫామ్ సాగులో రైతులు కొత్త పద్ధతులు నేర్చుకుంటే మరింత అధిక దిగుబడులు పొందగలరని సూచించారు. అలాగే, రైతాంగం సేంద్రీయ వ్యవసాయం బాట పట్టాలని ఎమ్మెల్యే జారె పిలుపునిచ్చారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి, సేంద్రీయ పద్ధతులను అనుసరించడం వల్ల భూమి ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు, నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని చెప్పారు. మూడు లక్షల మెట్రిక్ టన్నుల ఫ్రూట్ బంచ్ క్రషింగ్ సాధించినందుకు ఆయిల్ ఫెడ్ అధికారులకు, సిబ్బందికి అభినందనలు తెలియజేశారు. మంత్రి తుమ్మల పామాయిల్ రైతులతో ముఖాముఖి చర్చించి, వారి అనుభవాలను, ఆయిల్ ఫెడ్ ఉద్యోగుల సమస్యలను తెలుసుకున్నారు. తెలంగాణ దేశానికే ఆయిల్ ఫామ్ హబ్ గా మారనున్నదని ఆయన ధీమా వ్యక్తం చేశారు. పామాయిల్ సాగులో అధిక దిగుబడుల కోసం రైతులకు అన్ని విధాలా ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, కలెక్టర్ జితేష్ వి పటేల్ ఆలపాటి ప్రసాద్, రైతు తదితరులు పాల్గొన్నారు.

## రెండురోజులు నీటి సరఫరా బంద్

**వరంగల్ ఎంజీఎం, అక్టోబర్ 12 (జనంసాక్షి) :** ధర్మసాగర్ వద్ద మిషన్ భగీరథ కు చెందిన 60 ఏం ఎల్ డి మోటార్ లలో సాంకేతిక సమస్యలు తలెత్తడం వల్ల రెండు రోజులు (సోమ మంగళ వారాలు)నీటి సరఫరా ను నిలిపివేస్తున్నట్లు బల్దియా ఎస్ ఈ సత్యనారాయణ నేడోక ప్రకటనలో తెలిపారు.ఇట్టి కారణం గా గ్రేటర్ వరంగల్ పరిధి లోని విలీన గ్రామాలతో పాటు అండర్ రైల్వే గేట్ ప్రాంతం లో రెండు రోజులు నీటి సరఫరా జరగదని ఈ ప్రాంత వాసులు గమనించి బల్దియా కు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య

**హాలియా, అక్టోబర్ 12 (జనం సాక్షి) :** ఆర్థిక ఇబ్బందుల కారణంగా యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం రాత్రి మండల లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన పాతనబోయిన నవీన్ (30) స్థానికంగా ఓ రైస్ మిల్లులో ఆపరేటర్ గా పని చేస్తున్నారు. కాగా నవీన్ కు ఆర్థిక



ఫైల్

ఇబ్బందులు ఉండడంతో మనస్థాపానికి గురై శనివారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై సాయి ప్రశాంత్ తెలిపారు. మృతునికి తల్లిదండ్రులు సోదరుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కమలానెహ్రూ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## ఇసుక లారీల వల్ల ప్రజల ఇక్కట్లు

- పట్టించుకోని స్థానిక ఎమ్మెల్యే
- వేలాది లారీలు రోడ్డు మీద వెళ్తుంటే సామాన్య ప్రజలకు దారేది..?
- రావులపల్లి రాంప్రసాద్



**భద్రాచలం, అక్టోబర్ 12 (జనంసాక్షి) :** భద్రాచలం నియోజకవర్గంలోని చర్ల, వెంకటాపురం, వాజేడు, దుమ్ముగూడెం, మండలాల్లో రోజు వేలాదిగా ఇసుక లారీలు తిరగటం వల్ల అసలు రోడ్లే లేకుండా పోయాయని.. ప్రజా రవాణాకు ఆటంకం ఏర్పడి ప్రజలు నానా ఇబ్బందులు పడుతుంటే కనీసం పట్టించుకునే స్థితిలో ఎమ్మెల్యే లేరని అన్నారు. తక్షణం ఇసుక లారీలు నిలిపివేసి రోడ్లు బాగు చేసే కార్యక్రమానికి ఎమ్మెల్యే శ్రీకారం చుట్టకపోతే ప్రజా పోరాటం తప్పదని బిఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు రావులపల్లి రాంప్రసాద్ అన్నారు. స్థానికంగా ఐఏఎస్ ఆఫీసర్లు ఉన్నప్పటికీ ఇసుక లారీల వ్యవహారంపై నోరు మెదపకపోవడం విచిత్రంగా ఉందని. కనీసం గర్భిణీలు, బాలింతలు అత్యవసరమైన రోగులు భద్రాచలం ఆస్పత్రికి రావాలంటే కూడా దారి లేకుండా ఉందని వారి ప్రాణాలు గాల్లో కలిసిపోతాయని భయంతో ఉన్నారని అన్నారు. వెంటనే పై అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# నూతన జాతీయ విద్యా విధానం రద్దుకు ఉద్యమిస్తాం

- ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ

**ఖమ్మం రూరల్, అక్టోబర్ 12 (జనం సాక్షి) :** జాతీయ నూతన విద్యా విధానం రద్దుకై విద్యార్థులు ఉద్యమించాలని, ఏఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర నాయకులు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ యువతకు పిలుపునిచ్చారు. ఆదివారం ఎదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని ఎదులాపురంలో ఏఐఎస్ఎఫ్ గర్ల్స్ శాఖ మహాసభను నిర్వహించారు. తొలుత అక్కడ ఏర్పాటుచేసిన ఏఐఎస్ఎఫ్ శ్వేత అరుణ పతాకాన్ని దండి సురేష్ ఆవిష్కరించారు. ఓరుగంటి మృదుల అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ...నేడు దేశంలో నూతన విద్యావిధానం పేరుతో యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తి దెబ్బ తీసే ప్రయత్నం చేస్తున్నారయని విమర్శించారు. యూనివర్సిటిలను మూడు, నాలుగు రకాలుగా విభజన చేసి విద్యను కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణ, కమర్షలైజేషన్, కాషాయికరణ చేస్తుందని వారు అన్నారు. ఈ విధానాలు ప్రభుత్వం విద్య వ్యవస్థను ధ్వంసం చేయడానికి తీసుకుంటున్న చర్యలని వారు ఆరోపించారు. కేంద్రీయ విశ్వవిద్యాలయాలలో ఆరెస్సెస్ ఎజెండా అమలుకు




బిజెపి ప్రయత్నం చేస్తుందని, ఆరెస్సెస్ నేపథ్యం ఉన్నవారినే యూనివర్సిటీలలో నియమాకాలు చేస్తుందని అన్నారు. కేంద్ర బడ్జెట్లో విద్యారంగానికి కనీసం 10 శాతం బడ్జెట్ కేటాయింపులు చేయకుండా, జిడిపిలో 6 శాతం నిధులు కేటాయించకుండా ఎలా నూతన విద్యావిధానం అమలు చేస్తారని ఆయన ప్రశ్నించారు. నూతన విద్యావిధానం, విశ్వవిద్యాలయాల ఫండ్ కట్స్, ఫెలోషిప్స్ ఇవ్వకపోవడం, ఖాళీలు భర్తీ చేయకుండా ఉండడం, యూనివర్సిటీలలో ప్రజాస్వామ్య వాతావరణం లేకుండా చేయడంపై ఉద్యమించాలని ఆయన కోరారు. నూతన జాతీయ విద్యా విధానంలో ఎక్కడ కూడా ఉచిత విద్య అనే పదాన్ని కూడా పొందుపరచకుండా నూతన జాతీయ విద్యా విధానంలో పేదవారికి ఉచిత విద్యా లేనట్టేనని అయన పేర్కొన్నారు. సుమారుగా రాష్ట్రవ్యాప్తంగా 200, బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ ఉన్నాయని ఆ స్కూల్స్ సోషల్ వెల్ఫేర్ విద్యార్థులు ఒకటవ తరగతి నుంచి పదవ తరగతి వరకు 23,000 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మాజీ జిల్లా నాయకులు మెడికంటి వెంకటరెడ్డి వెంపటి సురేందర్ ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మామిండ్ల శ్రీనాథ్ రెడ్డి ఏఐఎస్ఎఫ్ సహాయ కార్యదర్శులు షేక్ నాగుల్ మేరా మధు వంశీ మనోజ్ జిల్లా నాయకులు దొంతగాని వెంకన్న దొంతగాని ఉపేందర్ మేళ్లచెరువు రవి మామిడాల కిరణ్ వెన్నబోయిన అజయ్ రేపాకుల సాగర్ పటాన్ రఫీ మురళి అకిల్ ప్రదీప్ దండి శ్రీజ అభిరామ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగులకు అండగా ఉంటాం




**ఖమ్మం, అక్టోబర్ 12 (జనం సాక్షి) :** మున్సిపాలిటీ డిపార్ట్మెంట్లో పనిచేస్తున్న జే ఏ ఓ, ఏవో లకు గెజిటెడ్ హోదా కల్పించాలని శివలింగం అధ్యక్షతన టీజీవో రాష్ట్ర అధ్యక్షులు, టీజీజేఏసీ రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావుని కలిసి వినతి పత్రం అందించారు. అనంతరం భగవాన్ శ్రీ సత్యసాయి శతవర్షి జన్మదిన కార్యక్రమం ఖమ్మంలో సత్య సాయి ట్రస్ట్ అధ్యక్షులు సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టి జి ఓ రాష్ట్ర అధ్యక్షులు, టీజీజెఎసి రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ భగవాన్ శ్రీ సత్య సాయి ట్రస్ట్ వారు కుల మతా వర్ణాలకు అతీతంగా చేస్తున్న కార్యక్రమాలు అద్వితీయం.. వృద్ధాప్యంలో ఉన్న ఎందరో వృద్ధులకు ఈ ఆశ్రమం ఒక దేవాలయముగా ఉన్నది ఇక్కడ వారికి ఇస్తున్న సర్వీసు చాలా గొప్పది.. అంతేకాకుండా మెడికల్ క్యాంపు ఉచితముగా అన్ని రకాల సరుకులు, రైస్ పేదవారికి అందించడం చాలా గొప్ప ఔదార్యం తప్పనిసరిగా వారు చేస్తున్న సేవా కార్యక్రమాలకు యావత్తు రాష్ట్ర ఉద్యోగులు పక్షాన తప్పక అండగా ఉంటామని తెలియజేయడం జరిగింది. స్థానిక ఇందిరానగర్ కాలనీలో నివాసం ఉంటున్న ఈనాడు రిపోర్టర్ శ్రీనివాసరావు అమ్మగారు అకాల మరణానికి వారి కుటుంబ సభ్యులను పరామర్శించడం జరిగింది. పంచాయతీరాజ్ విభాగంలో ఎంపీఓగా చేసిన అరుణ్ గౌడ్ కుటుంబ సభ్యులను పరామర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిజిఓ జిల్లా కార్యదర్శి మోదుగు వేలాద్రి, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ మల్లెల రవీంద్ర ప్రసాద్ కోశాధికారి సూరంపల్లి రాంబాబు, టీఎన్జీవో జిల్లా కార్యదర్శి కొనదన శ్రీనివాసరావు, టి జి ఓ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ కొండపల్లి శేషు ప్రసాద్ హౌస్ బిల్డింగ్ సొసైటీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి విజయ్ కుమార్ వెటర్నరీ అసిస్టెంట్ సివిల్ సర్జన్స్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మన్యం రమేష బాబు సోషల్ వెల్ఫేర్ వార్డెన్ అసోసియేషన్ రుక్మారావు అస్లాం మున్సిపల్ కార్యాలయ ఉద్యోగులు శ్రీనివాస్ రెడ్డి, సంతోష్, ఉపేందర్, చంద్రకళ, సందీప్, ఆశాకుమారి, తదితరులు పాల్గొన్నారు.

## బాకీ కార్డుల పంపిణీతో కాంగ్రెస్ పార్టీ గుండెల్లో గుబులు

- టీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కే.మాణిక్యం

**వనపర్తి, అక్టోబర్ 12 (జనంసాక్షి) :** బాకీ కార్డుల పంపిణితో కాంగ్రెస్ పార్టీ గుండెల్లో గుబులు మొదలైందని టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కే. మాణిక్యం అన్నారు.ఆదివారం వనపర్తి మండలం పెద్దగూడెం, కడుకుంట్ల గ్రామాలలో మండల పార్టీ అధ్యక్షులు కే.మాణిక్యం ఆధ్వర్యములో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు బాకాయి పడ్డ రూపాయలను వివరిస్తూ బాకీ కార్డుల పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్, అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్,మాణిక్యం మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి అలవికాని హామీలతో గ్యారంటీ కార్డులు పంచి అధికారంలోకి వచ్చిన 100రోజులలో అమలు చేస్తామని మోసం చేసిందని దుయ్యబట్టారు. స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ఓట్లకోసం వచ్చే కాంగ్రెస్ నాయకులను,మహిళలకు బకాయి పడ్డ,50000,వృద్ధులకు,వికలాంగులకు 44000,రైతులకు ఎకరానికి బరోసా 76000,కళ్యాణ లక్ష్మీ తులం బంగారం,నిరుద్యోగులకు 2లక్షల ఉద్యోగాలు విద్యార్థులకు విద్యా బరోసా విద్యార్థినులకు స్కూటీలు, ధాన్యానికి బోనస్, ఆటో కార్మికులకు బకాయి పడ్డ 30000 ఇవ్వాలని



ప్రజలు డిమాండ్ చేయాలని పిలుపునిచ్చారు. మహిళకు ఫ్రీ బస్సు పేరుతో మహిళలకు రాయితీ ఇచ్చినట్టే ఇచ్చి ఛార్జీల పెంపుతో పురుషులను నిలువు దోపిడి చేస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమములో గ్రామ పార్టీ అధ్యక్షులు కే.అశోక్,కొండన్న, లక్ష్మీకాంత్ రెడ్డి, కడుకుంట్ల నుండి సువర్ణ.శ్రీనివాసులు,శివన్న, హరితా బాలకృష్ణ,చిన్నారెడ్డి, అంజి, మనీష్ మండల నాయకులు రఘువర్ధన్ రెడ్డి,ధర్మానాయక్,మాధవ్ రెడ్డి,నాగవరం. నరేష్,మహేశ్వర్ రెడ్డి,చిట్యాల.రాము, సుదర్శన్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ భరోసా

**శివ్వంపేట, అక్టోబర్ 12 (జనంసాక్షి) :** నిరాశ్రయ బాధిత కుటుంబాలకు ఆపద సమయంలో ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో భరోసాను ఇస్తుందని జిల్లా పరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యులు మన్సూర్ అహ్మద్ పేర్కొన్నారు. మండల పరిధిలోని చిన్నగొట్టిముక్ల గ్రామానికి చెందిన హుస్సేన్ కు, స్థానిక శాసన సభ్యురాలు వాకిటి సునీతాలక్ష్మారెడ్డి సహకారంతో 51 వేల చెక్ మంజూరు అయింది. ఈ చెక్కును ఆదివారం మాజీ జడ్పీ కోఆప్షన్ సభ్యులు మన్సూర్ బాదిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుద్దేటి



బాలమణి నరేందర్, మాజీ ఉప సర్పంచ్ భిక్షపతి రావు, మాజీ ఎంపిటీసీ నర్సింగ్ రావు, బిఆర్ఎస్ నాయకులు పాపయ్య చారి, సలీమ్, అబ్బాస్, రాములు తదితరులు పాల్గొన్నారు.

# వీడిఓస్ కాలనీలో ఉద్రిక్తత

- కార్పొరేటర్ మిక్కిలినేని ఇంటిపై దాడికి యత్నం
- మిక్కిలినేని దంపతులను అదుపులోకి తీసుకున్న పోలీసులు



**ఖమ్మం, అక్టోబర్ 12 (జనంసాక్షి) :** ఖమ్మం నగరంలోని 54 డివిజన్ వీడిఓ స్ కాలనీలో ఉద్రిక్త పరిస్థితులు ఎలా ఉన్నాయి. శనివారం సాయంత్రం నుండి ఆదివారం వరకు ఇదే పరిస్థితి నెలకొనడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. స్థానిక కార్పొరేటర్ మిక్కిలినేని మంజుల నరేందర్ భర్త, ప్రముఖ కాంగ్రెస్ నాయకుడు మిక్కిలినేని నరేందర్ పై దాడికి కొంతమంది ప్రయత్నించారని ఆరోపిస్తూ మిక్కిలినేని వర్గీయులు ఆందోళనకు దిగారు. శనివారం సాయంత్రం నుండి కార్పొరేటర్ మంజుల తన వర్గీయులతో కలిసి రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. అర్ధరాత్రి పోలీసులు వారికి సర్దిచెప్పి ఆందోళన విరమింప చేశారు. ఆదివారం ఉదయం కొంతమంది వ్యక్తులు మిక్కిలినేని ఇంటిపై దాడికి ప్రయత్నించడంతో పరిస్థితి తిరిగి ఉద్రిక్తంగా మారింది. దాడి జరిగిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ నేపథ్యంలో మిక్కిలినేని వర్గీయులు వారిని అడ్డుకోవడంతో పరిస్థితులు మరింత భయానకరంగా తయారయ్యాయి. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరువర్గాలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. కార్పొరేటర్ మిక్కిలినేని మంజుల నరేందర్, ఆమె భర్త, కాంగ్రెస్ నాయకుడు మిక్కిలినేని నరేందర్ ను పోలీసులు అదుపులోకి తీసుకొని రఘునాథపాలెం పోలీస్ స్టేషన్ కు తరలించారు. దీంతో ఆయన వర్గీయులు భారీ స్థాయిలో పోలీస్ స్టేషన్కు చేరుకొని ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ సమీపంలో కార్పొరేటర్ మిక్కిలినేని మంజుల విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆమె మాటల్లో.. గత 32 రోజులుగా డివిజన్ పరిధిలో వీడివోస్ కాలనీ లో చెరుకూరి సుజాత, చంద్రశేఖర్




దంపతులు రౌడీ లతో ఇష్యు చేస్తున్నారు. నిన్న నా భర్త నరేందర్ పై దాడి చేసి బెదిరించారు. టూటౌన్ పోలీస్ స్టేషన్ లో వారిపై చర్యలు తీసుకోవాలని కేసు పెట్టాను. నిన్న రాత్రి వరకూ వారిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. అయినా మేము శాంతియుతంగా వ్యవహరించాము. ఆదివారం ఉదయం ఓట్ ఫర్ చోరీ కార్యక్రమం జరుగుతుంటే సుజాత చిటికెలు వేసి అవహేళన చేసింది. మేము మరలా నిరసనకు దిగితే మమ్మల్ని స్టేషన్ కు తరలించారు. కాంగ్రెస్ ఎస్సి సెల్ అధ్యక్షుడు రాకేష్ పై డోర్నకల్ రౌడీలు దాడి చేశారు. రాకేష్ పరిస్థితి ఎలా ఉందో కూడా మాకు తెలియట్లేదు. నా డివిజన్ లో రౌడీ మూకలను ఉంచొద్దని ఎన్నిసార్లు మొత్తుకున్నా పోలీసులు పట్టించుకోవట్లేదు. ఖమ్మం లో ఎప్పుడూ లేని విధంగా రౌడీ బ్యాచ్ లు తిరుగుతుండటం స్థానికులను భయాందోళనకు గురి చేస్తోంది. నాకు న్యాయం జరిగే వరకూ నేను పోరాటం చేస్తూనే ఉంటా..

## రాష్ట్రస్థాయి ఖో ఖో పోటీలకు క్రీడాకారులు ఎంపిక



**కల్లూరు, అక్టోబర్ 12 (జనం సాక్షి) :** కల్లూరులోని గ్రీన్ ఫీల్డ్ మినీ స్టేడియం ఆవరణలో అండర్ 19 ఇయర్స్ విభాగంలో బాల బాలికలకు శనివారం జిల్లా స్థాయి ఖో ఖో పోటీలు జరిగాయి..ఉమ్మడి ఖమ్మం జిల్లా నలుమూలల నుండి 19 సంవత్సరాల లోపు బాలురు 130 మంది బాలికలు 90 మంది మొత్తము కలిపి 220 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అత్యంత ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను 15 మంది బాలురను 15 మంది బాలికలను రాష్ట్ర స్థాయి పోటీలో పాల్గొనేందుకు క్రీడాకారులను ఎంపిక చేశారు. ఎంపిక చేయబడిన టువంటి క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలలో తెలంగాణ అండర్ 19 ఇయర్స్ పోటీల్లో పాల్గొంటారని నిర్వహణ కార్యదర్శి బోడా భీమా.పసుపులేటి వీర రాఘవయ్య. అండర్ 19 ఇయర్స్ సెక్రటరీ మూసా కలీం తెలిపారు. ఈ పోటీలను విజయవంతం చేయటానికి జాతీయస్థాయి ఖో ఖో న్యాయ నిర్ణేతలు ఎస్. రామారావు, పి పవన్ కుమార్, ఏ కృష్ణ, ఎస్ ప్రసాద్.. వ్యాయామ దర్శకులు సైదులు. సమ్మయ్య, కైసర్ పద్మావతి కళాశాలల పాఠశాలల నలమూడి పాల్గొన్నారు. క్రీడాకారులకు న్యాయ నిర్ణీతలుగా వచ్చిన ఒక 30 మందికి లైన్స్ క్లబ్ కల్లూరు చలవాది నగేష్, వారి సహచర బృందం అలాగే మదిర వాస్తవ్యులు మాధవరపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో క్రీడాకారులకు భోజన వసతి ఏర్పాటు చేయడం జరిగినది .స్టేడియం కోచ్. తలప రెడ్డి గౌతమ్ శ్రీనివాస్ గోపాల్ రావు నాగబాబు రిజిస్ట్రేషన్ కమిటీ సభ్యులుగా చావా శ్రీనివాస్ అబ్దుల్ రహీం. మామిడాల వెంకటేశ్వరరావు వెంకటయ్య కార్యక్రమంలో పాల్గొని ఖో ఖో పోటీల నిర్వహణ, క్రీడాకారుల ఎంపికకు సహకారాన్ని అందించారు.

# విపణి

# రీసేల్ ప్రాపర్టీ కొంటున్నారా..!

**• ఈ జాగ్రత్తలు అవసరం**



**హైదరాబాద్:** గ్రేటర్‌లో ఏ ప్రాంతంలో ఇల్లు కొనుగోలు చేయాలన్నా.. కనీసం రూ.80 లక్షల నుంచి రూ.కోటి వెచ్చించాల్సిందే. అదే ఐటీ హబ్ పరిసరాలు, సిటీలోని ప్రధానమైన ప్రాంతాల్లో ఇల్లు కొనాలంటే మాత్రం కనీసం రూ.కోటిన్నరకు పైగా ఖర్చు చేయాల్సిందే. ఇక గేటెడ్ కమ్యూనిటీలు, ప్రీమియం ప్రాజెక్ట్‌లలో అయితే కోట్లు ఖర్చు చేయాల్సిందే. అందుకే చాలా మంది మధ్యతరగతి వారికి హైదరాబాద్‌లో సొంతిల్లు కలగానే మిగిలిపోతోంది. ఇటువంటి సమయంలో చాలా మంది పాత ఇళ్ల కొనుగోలుపై దృష్టిసారించారు. అందులోనూ పాత అపార్ట్‌మెంట్స్‌లో ఫ్లాట్స్ కొనేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. సెకండ్ సేల్స్ ఫ్లాట్స్‌ను కొనుగోలు చేసే సమయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. లేదంటే చిక్కులు ఎదుర్కోక తప్పదని రియల్టీ రంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు. పాత అపార్ట్‌మెంట్స్‌లో ఫ్లాట్ కొనుగోలు చేసే సమయంలో పలు అంశాలను దృష్టిలో పెట్టుకోవాలని సూచిస్తున్నారు. సెకండ్ సేల్స్ ఫ్లాట్స్ కొనుగోలు చేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవడం వల్ల డబ్బులను ఆదా చేసుకోవడంతో పాటు న్యాయపరమైన చిక్కుల నుంచి తప్పించుకోవచ్చని చెబుతున్నారు. రీసేల్ ప్రాపర్టీలను కొనుగోలు చేసే ప్రాంతంలో అసలు ఆ ప్రాంతంలో చ.అ. ధరలు ఎంత ఉన్నాయో ముందుగానే తెలుసుకుంటే మీరు ఆ ప్రాంతంలోని ధరను బట్టి బేరం ఆడుకునే అవకాశం ఉంటుంది. సాధారణంగా బ్రాండ్ న్యూ ఫ్లాట్ ధరతో పోలిస్తే పాత అపార్ట్‌మెట్లలోని ఫ్లాట్ ధరలో చాలా వ్యత్యాసం ఉంటుంది. చ.అ.కు ప్రాంతాన్ని బట్టి కనీసం 20-40 శాతం వరకు వ్యత్యాసం ఉంటుంది. అందుకే ఆ ప్రాంతంలో ఫ్లాట్స్ ధరలను తెలుసుకుని బేరమాడి తక్కువ ధరకు ఫ్లాట్ కొనుక్కోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

**డాక్యుమెంట్లను పరిశీలించాలి**

పాత అపార్ట్‌మెంట్స్‌లో ఫ్లాట్ కొనుగోలు సమయంలో డాక్యుమెంట్లను క్షుణ్నంగా పరిశీలించాలి. అవసరమైన న్యాయ నిపుణులను సంప్రదించాలి. యాజమాన్య హక్కులు, ప్రభుత్వ రంగ ఏజెన్సీల అనుమతులు, బ్యాంక్ రుణాలు వంటి వాటి గురించి తెలుసుకోవాలి. ప్రధానంగా బ్యాంక్‌లలో ఫ్లాట్‌లో ఎంత రుణం నేరుగా సంబంధిత బ్యాంక్‌ను సంప్రదించి కనుక్కోవాలి. కొనుగోలుకు ముందే అపార్ట్‌మెంట్‌కు సంబంధించిన కమ్యూనిటీ నిబంధనలు తెలుసుకోవడం వల్ల నివాసిత సంఘంతో చిక్కులు లేకుండా ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు.

**బ్రోకర్లపై ఆధారపడొద్దు..**

ఫ్లాట్ కొనుగోలు కోసం బ్రోకర్లపై ఆధారపడకూడదని నిపుణులు సూచిస్తున్నారు. నేరుగా ఫ్లాట్ ఓనర్‌తో మాట్లాడుకొని డీల్ కుదుర్చుకుంటే ధర తగ్గే అవకాశం ఉంటుంది.



## ఇన్సూరెన్స్ ఏజంట్లను కాపాడుకోవడం

# కష్టమైపోయింది..

**న్యూఢిల్లీ:** జీవిత బీమా కంపెనీలకు ఏజంట్ల రిటెన్షన్ (వారు వైదొలగకుండా అట్టే పెట్టుకోవడం) సవాలుగా ఉంటోందని టాటా ఏఐఏ చీఫ్ డిస్ట్రిబ్యూషన్ ఆఫీసర్ (ప్రొప్రైటరీ బిజినెస్, అలైడ్ చానల్స్) అమిత్ దవే తెలిపారు. బీమా రంగ నియంత్రణ సంస్థ ఐఆర్‌డీఏఐ 2023-24 వార్షిక నివేదిక ప్రకారం పరిశ్రమలో కొత్తగా 9.7 లక్షల మంది జీవిత బీమా ఏజంట్లు చేరగా, 6.9 లక్షల మంది నిష్క్రమించినట్లు చెప్పారు. సత్వర ప్రయోజనాలు లభిస్తాయంటూ పరిశ్రమపై నెలకొన్న అభిప్రాయమే ఇందుకు కారణంగా ఉంటోందని తెలిపారు. ఇలా ఏజంట్ల నిష్క్రమణ అనేది వ్యాపారాన్ని స్థిరంగా కొనసాగించడానికి, కస్టమర్ల నమ్మకాన్ని పొందడానికి సవాలుగా ఉంటోందని దవే తెలిపారు. ఈ నేపథ్యంలో ఏజంట్లను రిటైన్ చేసుకునేందుకు పరిశ్రమ పలు ప్రయత్నాలు చేస్తోందని పేర్కొన్నారు. క్లయింట్ కమ్యూనికేషన్, డిజిటల్ టూల్స్ మొదలైన వాటిల్లో కంపెనీలు శిక్షణనిస్తున్నాయని తెలిపారు. అధునాతన టెక్నాలజీ, మౌలిక సదుపాయాలను అందుబాటులో ఉంచుతున్నాయన్నారు.

## సరికొత్త కియా క్లావిస్

**• కొత్త వెర్షన్**



**న్యూఢిల్లీ:** ఆటోమొబైల్ దిగ్గజం కియా తాజాగా కారెన్స్ క్లావిస్ లో కొత్త వెర్షన్ హెచ్‌టీఎక్స్ (ఓ)ని ప్రవేశపెట్టింది దీని ధర రూ.19,26,717 గా ఉంటుందని సంస్థ తెలిపింది. ఈ కొత్త వెర్షన్ కారులో బోస్ ప్రీమియం సౌండ్ సిస్టం, డ్రైవ్ మోడ్ సెలెక్ట్, స్మార్ట్ కీ రిమోట్ ఇంజిన్ స్టార్ట్, ఎలక్ట్రిక్ పార్కింగ్ బ్రేక్ తదితర ఫీచర్లు ఉంటాయి. ఇది 6,7 సీటర్ కాన్ఫిగరేషన్లలో లభిస్తుంది. అలాగే హెచ్‌టీకే ప్లస్, హెచ్‌టీకె ప్లస్ (ఓ)లో 6 సీటర్ వేరియంట్లను కూడా ప్రవేశపెట్టినట్లు కంపెనీ తెలిపింది. ఇవి అక్టోబర్ 13 నుంచి దేశవ్యాప్తంగా తమ షోరూమ్‌లలో లభిస్తాయని పేర్కొంది.

## బంగారాన్నే నమ్ముతా..

**• జోహో సీఈఓ శ్రీధర్ వెంబు**




**న్యూఢిల్లీ:** బంగారం ధరలు రోజురోజుకూ పెరుగుతూఆకాశాన్ని తాకుతున్నాయి. అదేసమయం లోక్రిప్టోకరెన్సీకికూడాక్రేజ్పెరుగుతోంది. అయితేస్వదేశీసాంకేతిక ఆవిష్కరణలతోవార్తల్లో నిలుస్తున్న జోహో వ్యవస్థాపకుడు, సీఈవో శ్రీధర్ వెంబు .. తాను బంగారాన్నే నమ్ముతా అంటున్నారు .క్రిప్టో క్రేజ్ లేదా తాజా మార్కెట్ ట్రెండ్లకులోనుకాకుండాబంగారాన్ని సంపదకు విశ్వసనీయమైన నిల్వగా కొనసాగిస్తున్నారు. కరెన్సీ క్షీణతకు రక్షణగాబంగారాన్నిభావించేశిబిరంలో 25 సంవత్సరాలుగా కొనసాగుతున్నట్లుఆయన స్పష్టం చేశారు. ఈమేరకుశ్రీధర్వెంబు 'ఎక్స్'(ట్విటర్)లోఓపోస్ట్పెట్టారు. తనకుక్రిప్టోకరెన్సీలపై ఆసక్తి లేదని, బంగారాన్ని స్థిరమైన, కాలాతీత పెట్టుబడిగా చూస్తాననిపేర్కొన్నారు. లిన్ ఆల్డెన్ అనే స్థూల ఆర్థిక వ్యూహకర్త చేసిన విశ్లేషణలో కూడా ఇదే భావనను సమర్థిస్తుందనిప్రస్తావించారు. ఆమె పరిశోధన ప్రకారం, అమెరికా ట్రెజరీ బాండ్లు, స్టాక్స్,రియల్ ఎస్టేట్ వంటి ఆస్తులు ద్రవ్యోల్బణాన్ని అనుసరించే బంగారాన్ని దీర్ఘకాలంలో అధిగమించలేకపోయాయి. ఆల్డెన్ చెప్పినట్లు, కేవలం 4శాతం స్టాకులే మార్కెట్ రాబడికి ముఖ్య కారణమవుతాయి. రియల్ ఎస్టేట్ కూడా పన్నులు, నిర్వహణ ఖర్చులు, ద్రవ్యోల్బణం వంటి అంశాల వల్ల బంగారంతోపోలిస్తేతక్కువ పనితీరు చూపించింది. ఇదిలా ఉండగా, 2025లో ట్రంప్ విధించిన వాణిజ్య సుంకాలు, అమెరికా-చైనా ఉద్రిక్తతలు, ద్రవ్యోల్బణ భయాలు వంటివి బంగారం ధరలు ఔన్సుకు4,000 డాలర్ల(రూ. 3.57 లక్షలు) దాటేలా చేశాయి. ఈ పరిణామాలు వెంబు నమ్మకాన్ని మరింత బలపరుస్తున్నాయి. శ్రీధర్వెంబు లాజిక్స్పష్టంగా ఉంది. బంగారం తక్షణ లాభాల కోసం కాదు, ఇది దీర్ఘకాలిక ఆర్థిక భద్రత కోసం. "బంగారం ఓర్పునకుసంబంధించినది" అని చెబుతూ, ఆధునిక హైప్‌తో నిండిన పెట్టుబడి ప్రపంచంలో ఆయన దృఢమైన వైఖరి విశిష్టంగా నిలుస్తోంది.

## ఎలక్ట్రిక్ వాహనదారులకు శుభవార్త!

హైదరాబాద్: ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) చార్జింగ్ సొల్యూషన్స్ అందించే థండర్‌ప్లస్ తాజాగా వాహనాల దిగ్గజం టాటా మోటర్స్‌తో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. దీని ప్రకారం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడుతో పాటు మరో అయిదు రాష్ట్రాల్లో చిన్న వాణిజ్య వాహనాల చార్జింగ్ కోసం కొత్తగా 5,000 పబ్లిక్ చార్జింగ్ స్టేషన్లను థండర్‌ప్లస్ ఇన్‌స్టాల్ చేయనుంది. వాణిజ్య వాహనాల పోర్ట్‌ఫోలియోను విద్యుదీకరించుకోవాలన్న టాటా మోటర్స్ ప్రయత్నాలకు ఇది సహాయకరంగా ఉండనుంది. నిరాటంకమైన, విశ్వసనీయమైన, విస్తరించతగిన విధంగా ఈవీ చార్జింగ్ స్టేషనలను అందుబాటులోకి తేవడం తమ లక్ష్యమని థండర్‌ప్లస్ సీఈవో రాజీవ్ వైఎస్ఆర్ తెలిపారుతెలుగు రాష్ట్రాల్లో ఎస్‌యూవీలకు అప్‌గ్రేడ్ కావాలనుకునే కస్టమర్లు తమ పంచ్ వాహనం వైపు మొగ్గు చూపే ధోరణి నెలకొందని టాటా మోటర్స్ ప్యాసింజర్ వెహికల్స్ (టీఎంపీవీ) తెలిపింది. ఈ ఏడాది ఏప్రిల్-సెప్టెంబర్ మధ్య కాలంలో తమ మొత్తం అమ్మకాలకు సంబంధించి తెలంగాణలో 21 శాతం, ఆంధ్రప్రదేశ్‌లో 25 శాతం వాటా పంచ్‌దే ఉందని పేర్కొంది. హైదరాబాద్, విజయవాడలో ఈ ఎస్‌యూవీ విక్రయాలు రెండింతలు పెరిగాయని కంపెనీ వివరించింది.

## టాటా మ్యుచువల్ ఫండ్ యాప్‌లో కొత్త ఫీచర్

**న్యూఢిల్లీ:** ఈక్వల్-వన్‌మనీ సంస్థతో కలిసి టాటా మ్యుచువల్ ఫండ్ యాప్‌లో పోర్ట్‌ఫోలియో 360 ఫీచరును ప్రవేశపెట్టినట్లు టాటా అసెట్ మేనేజ్‌మెంట్ వెల్లడించింది. గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2025 సందర్భంగా దీన్ని ఆవిష్కరించింది. వివిధ బ్యాంకు ఖాతాలు, ఫండ్స్, ఈక్విటీలు, ఎఫ్‌డీలు మొదలైన వాటి వివరాలన్నీ ఒకే దగ్గర చూసుకునేందుకు ఇది ఉపయోగపడుతుందని సంస్థ సీఈవో ప్రతీత్ భోబె తెలిపారు. రిటైర్మెంట్‌లాంటి ఆర్థిక ప్రణాళికలు వేసుకునేందుకు ఇన్వెస్టర్లకి సహాయకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రవేశపెట్టిన కొద్ది నెలల్లోనే టాటా మ్యుచువల్ ఫండ్ యాప్ డౌన్‌లోడ్‌లు 6 లక్షల పైగా నమోదైనట్లు వివరించారు. పారదర్శకత, ఆవిష్కరణలపరంగా అత్యుత్తమ ప్రమాణాలను పాటిస్తూ పోర్ట్‌ఫోలియో 360ని తీర్చిదిద్దినట్లు ఈక్వల్-వన్‌మనీ వ్యవస్థాపకుడు కృష్ణ ప్రసాద్ తెలిపారు.




### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.05 | ₹ 5.07 |

### బంగారం ధరలు (10 గ్రాములు)
హైదరాబాద్

| ₹ 1,14,650 (22 క్యారెట్లు) | ₹ 1,25,080 (24 క్యారెట్లు) |
|---|---|

### వెండి ధరలు (కేజీ)
హైదరాబాద్

₹ 1,90,000

**హమాస్.. నిన్న, మొన్నటి వరకూ మిలిటెట్లు(నిషేధిత ఉగ్రవాద సంస్థ). ఇప్పుడు వారి పేరు మారింది.. వారి బ్రాండ్ కూడా మారింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర ఒత్తిడితో ఇజ్రాయిల్‌తో శాంతి ఒప్పందంలో భాగంగా ఇప్పుడు హమాస్ కాస్త 'ది గాజా సెక్యూరిటీ ఫోర్సెస్'గా రూపాంతరం చెందింది. తాజాగా వీరి బ్రాండ్ పేరును విడుదల చేసింది హమాస్. దీనిలో భాగంగా సుమారు ఏడు వేల మంది హమాస్ మిలిటెంట్లు సాధారణ పౌరుల వలే మారిపోవడానికి సిద్ధమయ్యారు.. ఈ మేరకు ఇజ్రాయిల్ రక్షణ దళాలు (ఐడీఎఫ్).. గాజాలో ఇటీవల ఉపసం హరించుకున్న ప్రాంతాలపై నియంత్రణను తిరిగి స్థాపించడానికి పౌర దుస్తులలో దర్శనమిస్తున్నారు.**

# ది గాజా సెక్యూరిటీ ఫోర్సెస్

## హమాస్ కొత్త బ్రాండ్ పేరు..



మొన్నటి వరకూ చీకటిలో యుద్ధం చేసిన వీరు.. ఇప్పుడ జన జీవన ప్రవంతిలోకి వచ్చి నేరుగా గాజాకు అండగా ఉంటామంటున్నారు. మరొకవైపు గడువులోగా బందీలను స్వీకరించడానికి తాము సిద్ధంగా ఉన్నట్లు హమాస్ తెలిపింది. వాల్‌స్ట్రీట్ జర్నల్ కథనం ప్రకారం.. ట్రంప్ రేపు ఉదయం ఇజ్రాయెల్‌లో అడుగుపెట్టే సమయానికి హమాస్ చేతిలో బందీలు విడుదల అవుతారని ఇజ్రాయెల్ భావిస్తోంది. హమాస్ అంతమే లక్ష్యంగా ఇజ్రాయెల్ సుమారు రెండేళ్ల క్రితం గాజాలో ప్రారంభించిన విధ్వంసక యుద్ధం ముగిసిన జాడలు కనిపిస్తు న్నాయి. అక్టోబర్ 10వ తేదీ మధ్యాహ్నం నుంచి గాజాలో ప్రశాంత వాతావరణం నెలకొంది. పాలస్తీని యన్లపై కాల్పులు, వైమానిక దాడులు నిలిచిపోయాయి. ఆ ప్రాంతంలో కాల్పుల విరమణ ఒప్పందం మధ్యాహ్నం నుంచి అమల్లోకి వచ్చినట్లు ఇజ్రాయెల్ సైన్యం సైతం ధ్రువీకరించింది. యుద్ధానికి విరామం ఇవ్వడానికి, మిగిలిన బందీలను పాలస్తీనా ఖైదీలతో మార్పిడి చేయడానికి సంబంధించిన ఒప్పందాన్ని ఇజ్రాయెల్ మంత్రివర్గం ఆమోదం తెలిపినట్లు ప్రధాని నెతన్యాహూ ప్రకటించిన కొన్ని గంటల్లోనే ఆర్మీ ఈ మేరకు ప్రకటించడం గమనార్హం. దీంతో, సెంట్రల్ గాజాలోని వాడి గాజాలో గుమికూడిన వేలాది మంది పాలస్తీనియన్లు ఉత్తర ప్రాంతంలోని తమ సొంత నివాసాల దిశగా నడక సాగించారు. ఒప్పందం ప్రకారం...గాజా నుంచి ఇజ్రాయెల్ బలగాలను ఉపసంహరించుకున్న అనంతరం హమాస్ తమ వద్ద బందీలుగా ఉన్న 48 మందిని విడుదల చేయాల్సి ఉంటుంది. వీరిలో కనీసం 20 మంది మాత్రమే సజీవంగా ఉన్నట్లు భావిస్తున్నారు. ఇందుకు బదులుగా 2 వేల మంది పాలస్తీనా ఖైదీలను ఇజ్రాయెల్ విడిచిపెడుతుంది. వీరి జాబితాను శుక్రవారం అధికారులు విడుదల చేశారు. ఇందులో పాలస్తీనా అత్యధిక ప్రజాదరణ కలిగిన నేత మర్వాన్ బర్ఘౌటి కూడా ఉన్నారు. బందీలు, ఖైదీల విడుదల ఆదివారం రాత్రి లేదా సోమవారం మొదలవుతుందని మధ్యవర్తులుగా వ్యవహరించిన ఈజిప్టు అధికారులు తెలిపారు.

**సిద్ధంగా మానవతా సాయం**

గాజాలో నెలకొన్న తీవ్ర కరువు పరిస్థితుల నేపథ్యంలో మానవతా సాయం తీసుకువచ్చిన ట్రక్కులు సాధ్యమైనంత త్వరగా చేరుకునేందుకు ఈజిప్టు, గాజా మధ్యనున్న రఫా సహా ఐదు సరిహద్దులను తెరిచి ఉంచనున్నారు. సుమారు 1.70 లక్షల టన్నుల మందులు, ఆహారం, ఇతర అత్యవసరా లను గాజాలోకి తరలించేందుకు సిద్ధంగా ఉన్నామని ఐరాస మానవతా సాయం చీఫ్ టామ్ ఫ్లెచర్ తెలిపారు. సానుకూల సంకేతాలు అందిన వెంటనే రంగంలోకి దిగుతామని చెప్పారు. ఇజ్రాయెల్‌తో కుదిరిన డీల్ ప్రకారం కాల్పుల విరమణ ఒప్పందం అమలును పర్యవేక్షించేందుకు 200 మంది సైనికులను గాజాకు పంపుతామని అమెరికా అధికారులు చెప్పారు.

**వారి మెడపై కత్తి ఉంది..: నెతన్యాహూ**

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తెరపైకి తెచ్చిన కాల్పుల విరమణ ప్రణాళికలో పేర్కొన్న హమాస్ నిరాయుధీకరణ, గాజా భవిష్యత్తు పాలన వంటి అంశాలపై ఎటువంటి స్పష్టత లేదు. 'ట్రంప్ ప్రకటనలో తర్వాతి భాగం హమాస్ నిరాయుధీకరణే. ఇది సులువుగా జరిగితే సరేసరి. లేదంటే బలవంతంగానైనా సాధిస్తాం. మెడపై కత్తి ఉందని తెలిసే హమాస్ ఒప్పందానికి వచ్చింది. ఇప్పటికీ కత్తి మెడపైనే ఉంది'అని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ పేర్కొనడం గమనార్హం. కాగా, శుక్రవారం మధ్యాహ్నం అధికారికంగా కాల్పుల విరమణ ప్రారంభమవడానికి కొద్ది గంటల ముందుగానే బలగాల ఉపసంహరణ పూర్తయిందని ఇజ్రాయెల్ బ్రిగేడియర్ జనరల్ ఎఫ్పీ డెఫ్రిన్ చెప్పారు. ఉపసంహరణ అంశం సున్నితత్వం దృష్ట్యా గాజాలోని ఇటీవల స్వాధీనం చేసుకున్న 50 శాతం ప్రాంతంలో బలగాలు కొనసాగుతాయని ఓ సైనికాధికారి పేర్కొనడం విశేషం. ప్రస్తుతం ఇజ్రాయిల్-హమాస్‌లు అమెరికా ఒత్తిడితో శాంతి ఒప్పందానికి ముందుకొచ్చినా ఇరు వర్గాల్లో ఎక్కడో భయం ఉంది. వారి మధ్య చోటు చేసుకుంది మామాలు యుద్ధం కాదు. విధ్వంసకర యుద్ధం. ఈ క్రమంలోనే వారి మధ్య శాంతి ఒప్పందం జరిగినా కూడా రెండు వర్గాలు జాగ్రత్తగా ఉండాలనే ముందస్తు ప్రణాళికతో సిద్ధమైనట్లు తెలుస్తున్నాయి. హమాస్ ఏమీ చేసే పరిస్థితి లేకే ఒప్పందానికి వచ్చిన ఇజ్రాయిల్ ప్రధాని నెతాన్యాహూ స్పష్టం చేసిన నేపథ్యంలో హమాస్ కూడా వారు మొత్తం ఆయుధాలను వదిలేయడానికి సిద్ధంగా లేరనేది అర్థమవుతోంది. తాము ఉంటాం.. కానీ ది గాజా సెక్యూరిటీ ఫోర్సెస్‌గా ఉంటామని చెబుతున్నారు. జస్ట్ మేము మారాం.. అంతే.. మా లక్ష్యం మారలేదు' అని సందేశాన్ని ది గాజా సెక్యూరిటీ ఫోర్సెస్ ఏర్పాటు ద్వారా పంపినట్లు అయ్యింది. అంటే అవసరమైన పక్షంలో మళ్లీ తాము యుద్ధం చేయడానికి సిద్ధమేనని పరోక్ష సంకేతాలు పంపారు.



## త్వరగా బంగారం కొనండి

**న్యూఢిల్లీ:** ఎక్స్ వేదికగా పెట్టుబడికి సంబంధించిన విషయాలను పేర్కొంటూ ఉండే.. రిచ్ రాడ్ పూర్ డాడ్ రచయిత 'రాబర్ట్ కియోసాకి' మరో ట్వీట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇందులో.. ఈ ఏడాది అతిపెద్ద క్రాష్ జరుగుతుందని హెచ్చరించారు. ప్రపంచ చరిత్రలో అతిపెద్ద క్రాష్ జరుగుతుందని.. నేను ముందే ఊహించాను. ఆ క్రాష్ ఈ ఏడాది జరుగుతుంది. బేబీ బూమ్ రిటైర్మెంట్లు తుడిచిపెట్టుకుపోబోతున్నాయి. కియోసాకి ప్రకారం.. ఈ ఏడాది స్టాక్ మార్కెట్లు భారీ నష్టాలను పొందే అవకాశం ఉందని, ఇదే అతిపెద్ద క్రాష్ అని స్పష్టంగా అర్థమవుతోంది. స్టాక్ మార్కెట్లు భారీగా నష్టపోవడానికి టారిఫ్స్ ప్రభావం, ఆర్థిక మాంద్యం, అంతర్జాతీయ అనిశ్చితి మొదలైనవి ప్రధాన కారణాలు. డబ్బు కూడబెట్టొద్దు, నిజమైన ఆస్తులలో పెట్టుబడి పెట్టండని హెచ్చరిస్తూనే ఉన్నాను. చాలా సంవత్సరాలుగా.. నేను సేవర్స్ ఓడిపోయేవారు అని చెబుతూనే ఉన్నాను. చాలా సంవత్సరాలుగా నేను బంగారం, వెండి, బిట్‌కాయిన్ వంటి వాటిలో పెట్టుబడి పెట్టాలని సూచించాను. వాటి ధరలు ఇప్పుడు ఏ స్థాయిలో ఉన్నాయో అందరికీ తెలుసు. ఇప్పుడు ఎథెరియంలను సేవ్ చేయమని చెబుతున్నాను. ఈ రోజు నేను వెండి ఎథెరియం ఉత్తమమైనవని నమ్ముతున్నాను. ఎందుకంటే వీటి విలువ పెరుగుతూనే ఉంటుంది. వీటిని ముఖ్యంగా పరిశ్రమల్లో ఉపయోగిస్తారు. దీనివల్ల డిమాండ్ పెరుగుతుంది. దయచేసి వెండి, ఎథెరియం లాభాలు నష్టాలను మాత్రమే కాకుండా.. ఉపయోగాన్ని కూడా అధ్యయనం చేయండి. మీ సొంత ఆర్థిక జ్ఞానంతో పెట్టుబడి పెట్టండి. ఎప్పటికప్పుడు మీ సొంత ఆర్థిక తెలివితేటలను పెంచుకుంటుంటే.. తప్పకుండా ధనవంతులు అవుతారు. జాగ్రత్తపడండి అంటూ కియోసాకి ట్వీట్ చేశారు.

**పెరుగుతున్న వెండి ధరలు**

బంగారం ధరలు మాదిరిగానే.. వెండి ధరలు అమాంతం పెరుగుతున్నాయి. ప్రస్తుతం భారతదేశంలో కేజీ వెండి రూ. 190000 వద్దకు చేరింది. ఈ సందర్భంగా "వెండి 50 డాలర్లు దాటేసింది, తరువాత 75 డాలర్లకు?.. సిల్వర్, ఎథిరియం హాట్, హాట్" (ధరలు భారీగా ఉన్నాయని) అంటూ కియోసాకి ట్వీట్ చేశారు. దీన్నిబట్టి చూస్తే.. వెండి కూడా మరింత పెరుగుతుందని తెలుస్తోంది.

## కుదిరిన ఎన్డీయే భాగస్వామ్య పార్టీల సీట్ల సర్దుబాటు

**పాట్నా:** బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల్లో సీట్ల సర్దుబాటు వ్యవహారం ఓ కొలిక్కి వచ్చింది. 243 అసెంబ్లీ సీట్లకు గాను 101 బీజేపీకి, 101 జేడీయూకి సర్దుబాటు చేసుకునేందుకు ఇరు పార్టీల మధ్య ఒప్పందం కుదిరింది. బీహార్ సీట్ల ఒప్పందం కుదిరిన విషయాన్ని కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వె ల్లడించారు. ఈ మేరకు తన సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా సీట్ల సర్దుబాటు జరిగిన విషయాన్ని స్పష్టం చేశారు. సీఎం నితీష్ కుమార్ జేడీయూ పార్టీకి 101 సీట్లు, తమకు(బీజేపీ) 101 సీట్ల సర్దుబాటు జరిగిందన్నారు. చిరాగ్ పాశ్వాన్ ఎల్జేపీకి 29 సీట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. మిగతా రెండు పార్టీలకు తలో ఆరు సీట్ల చొ ప్పున ఒప్పందం కుదిరిందనే విషయాన్ని స్పష్టం చేశారు.

జనతాదళ్ యునైటెడ్ (జేడీయూ): 101 సీట్లు
భారతీయ జనతా పార్టీ (బీజేపీ): 101 సీట్లు
లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్): 29 సీట్లు
హిందుస్తానీ అవామ్ మోర్చా (హెచ్ఏఎం): 6 సీట్లు
రాష్ట్రీయ లోక్ మోర్చా (ఆర్ఎల్ఎం): 6 సీట్లు

## 58 మంది పాక్ సైనికుల మృతి

**ఆఫ్ఘన్-పాకిస్థాన్ సరిహద్దును మూసివేసిన దృశ్యం**




కాబూల్/ఇస్లామాబాద్: పాకిస్థాన్-ఆఫ్ఘనిస్థాన్ సరిహద్దుల్లో ఉద్రిక్తతలు గంటగంటకూ ముదురుతున్నాయి. ఇరువైపులా భీకరంగా కాల్పులు జరుగుతున్నాయి. కాబూల్‌పై పాక్ కవ్వింపు చర్యలకు వ్యతిరేకంగా తాము కాల్పులు జరిపినట్లు తాలిబన్ ప్రభుత్వం చెబుతుండగా.. అకారణంగా ఆఫ్ఘన్ తమపై కాల్పులకు దిగిందని పాక్ వాదిస్తోంది. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో పాకిస్థాన్ రెండు సరిహద్దులను పూర్తిగా మూసివేసింది. అయితే.. తమ సేనలు జరిపిన కాల్పుల్లో 58 మంది పాక్ సైనికులు హతమయ్యారని తాలిబన్ ప్రభుత్వ ప్రతినిధి జబియుల్లా ముజాహిద్ తెలిపారు. 30 మంది సైనికులు గాయపడ్డట్లు పేర్కొన్నారు. ఆఫ్ఘన్ వైపు తొమ్మిది మంది సైనికులు మరణించగా.. 18 మంది గాయపడ్డట్లు ఆదివారం మధ్యాహ్నం కాబూల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. అయితే.. పాకిస్థాన్ మాత్రం ఈ గణాంకాలను నిర్ధారించలేదు. తమవైపు ముగ్గురు సైనికులు, ఒక పౌరుడు మృతిచెందినట్లు ఇంటర్ సర్వీస్ పబ్లిక్ రిలేషన్స్(ఐఎస్‌పీఆర్) ప్రకటించింది. తమ ప్రధాని షెహబాజ్ షరీఫ్, అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ ముక్తకంఠంతో ఆఫ్ఘన్ చర్యలను ఖండించినట్లు పాక్ మీడియా తెలిపింది. తాలిబన్ సర్కారుకు గట్టి బదులిచ్చేందుకు పాక్ సైన్యం సిద్ధమైనట్లు వెల్లడించింది.

**టీటీపీ లక్ష్యంగా డ్రోన్ దాడులు:** తెహ్రీక్-ఎ-తాలిబన్ పాకిస్థాన్(టీటీపీ) చీఫ్ నూర్ వలీ మహ్సూద్ టార్గెట్‌గా పాక్ సైన్యం దాడులు జరుపుతోంది. ఈ క్రమంలో నిన్న సాయంత్రం కాబూల్‌లో డ్రోన్ దాడులు జరిపింది. ఈ దాడుల్లో ఇద్దరు టీటీపీ సీనియర్ నేతలు మరణించగా.. వారిలో మహ్సూద్ ఉన్నారా? అనే వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. డ్రోన్ దాడులకు ప్రతిగా ఆఫ్ఘన్ సైన్యం పాక్ సరిహద్దుల్లో కాల్పులను ప్రారంభించింది. హెల్మాండ్ ప్రావిన్స్ లో రెండు పాకిస్థాన్ పోస్టులను తాలిబన్లు స్వాధీనం చేసుకున్నారు. కునార్, నంగర్హార్, హెల్మాండ్ ప్రాంతాల్లో భీకర కాల్పులు జరుగుతున్నట్లు సమాచారం.

**రంగంలోకి ఇరాన్:** పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్ మధ్య ఘర్షణలను నిలువరించేందుకు ఇరాన్ రంగంలోకి దిగింది. ఇరువర్గాలు శాంతిని పాటించాలని పిలుపునిచ్చింది. ఘర్షణలను తగ్గించేందుకు తమ వంతు కృషి చేస్తామని ప్రకటించింది. సౌదీ అరేబియా, ఖతార్ కూడా ఇరుదేశాలు సంయమనం పాటించాలని కోరాయి. నిజానికి ఆఫ్ఘనిస్థాన్ అంతర్జాతీయంగా ఒంటరిగా ఉంది. కేవలం రష్యా మాత్రమే తాలిబన్ల అధికారాన్ని, ప్రభుత్వాన్ని గుర్తించింది.

## చీరాలలో విషాదం..

**సముద్రంలో ఐదుగురు గల్లంతు**

**చీరాల(జనంసాక్షి):** బాపట్ల జిల్లా చీరాల మండలం వాడరేవు తీరంలో విషాదం నెలకొంది. సముద్రంలో స్నానానికి దిగిన ఐదుగురు అలల తాకిడికి గల్లంతయ్యారు. వారిలో ముగ్గురి మృతదేహాలు లభ్యమయ్యాయి. మరో ఇద్దరి కోసం గాలిస్తున్నారు. సెలవు రోజుల్లో సరదాగా గడిపేందుకు సందర్శకులు సూర్యలంక బీచ్‌తో పాటు, వాడరేవు సముద్ర తీరానికి వస్తుంటారు. ఈ క్రమంలో అమరావతిలోని విట్ యూనివర్సిటీ నుంచి కొందరు విద్యార్థులు బృందంగా వాడరేవు వచ్చారు. వారిలో సాకేత్, సాయి మణిదీప్, జీవన్ సాత్విక్‌లు అలల తాకిడికి కొట్టుకుపోయారు. స్థానికంగా ఉన్న మత్స్యకారులు, గజ ఈతగాళ్లు వారిని కాపాడేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. గల్లంతైన కాసేపటికి మృతదేహాలు ఒడ్డుకు కొట్టుకొచ్చాయి. మరో విద్యార్థి సోమేష్‌తోపాటు చీరాలకు చెందిన గౌతమ్ సముద్రంలో గల్లంతయ్యారు. వీరి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.




## రాజన్న ఆలయంలో భక్తులకు
# దర్శనాలు యథావిధిగా కొనసాగించాలి

- ఆలయ అభివృద్ధి పేరిట దర్శనాలు నిలిపివేస్తే ఊరుకోం.
- ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం చేసిన బిజెపి నాయకులు.
- భక్తులకు ఇబ్బందులు కలగకూడదని భీమేశ్వర ఆలయంలో దర్శనాలు ఈవో

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి అక్టోబర్ 12 (జనంసాక్షి) :** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పేరిట భక్తులకు దర్శనాలు నిలిపివేస్తే చూస్తూ ఊరుకోమని బిజెపి జిల్లా అధ్యక్షుడు రెడ్డవేణి గోపి వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చెన్నమనేని వికాస్ రావు, వేములవాడ పట్టణ అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్ స్పష్టం చేశారు. ఆదివారము పట్టణ అధ్యక్షులు శ్రీధర్ ఆధ్వర్యంలో బిజెపి నాయకులు,కార్యకర్తలతో కలిసి వేములవాడ రాజన్న ఆలయం వద్ద ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. అనంతరం ప్రభుత్వానికి, ఆలయ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామికి మొక్కులు చెల్లించాల్సిన భక్తులు భీమేశ్వరాలయంలో ఎలా చెల్లిస్తారని ప్రశ్నించారు. శనివారం రోజున ఈవో పేరిట విడుదలైన రేఖపై స్పష్టత ఇవ్వాలని ఈవో రావాలంటూ డిమాండ్ చేశారు. ఎలాంటి శాంతిభద్రతలకు విగాథం కలగకుండా ఏఎస్పి శేషాద్రిని రెడ్డి పట్టణ సిఐ వీరప్రసాద్ ఆధ్వర్యంలో ముందస్తుగా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ ఈవో ఎల్ రమాదేవి ఆలయం ఎదుటకు చేరుకొని బిజెపి నాయకులతో మాట్లాడారు. ఆలయ అభివృద్ధి పనులు చేపడుతున్నందున భక్తులకు ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా భీమేశ్వర ఆలయంలో దర్శనాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పనులు జరుగుతున్న సమయంలో భక్తులకు ఏమైనా అయితే ఎలా అన్నారు.స్పందించిన భాజపా నాయకులు భక్తుల దర్శనాల సమయంలో పనులు నిలిపివేయాలన్నారు.భక్తులకు సమయం కేటాయించి దర్శనాలు కల్పించాలన్నారు.కోడె మొక్కులు రాజన్న ఆలయంలోనే చెల్లించుకునే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. అందరితో కలిసి పున సమీక్ష చేస్తామని ఈవో చెప్పారు. అభివృద్ధి పనుల పేరుతో దర్శనాలు నిలిపివేస్తే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని బిజెపి నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భాజపా నాయకులు బండ మల్లేశం యాదవ్, గోపు బాలరాజు,రేగుల సంతోష్ బాబు, లింగంపల్లి శంకర్,ఏరెడ్డి రాజిరెడ్డి, నామాల శేఖర్, పిన్నింటి హనుమాన్లతో పలువురు పాల్గొన్నారు.

## వైద్య ఆరోగ్య ఉద్యోగుల సమస్యలు
# పరిష్కరించకుంటే.. ఉద్యమం తప్పదు
### రాష్ట్ర గౌరవ అధ్యక్షులు భూపాల్




**కామారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 12 (జనం సాక్షి) :** తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ కామారెడ్డి జిల్లా మహాసభ ఆదివారం కామారెడ్డి పట్టణంలో జరిగింది.ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు భూపాల్ హాజరయ్యారు..సిఐటియు జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ మహాసభకు జిల్లాలోని ఏఎన్ఎంలు, ఫార్మాసిస్టులు, ల్యాబ్టెక్నిషన్ లు ఆరోగ్య మిత్రలు, 104 ఎంప్లాయిస్ హాజరయ్యారు.31 మంది తో జిల్లా కమిటీ వేశారు. గౌరవ అధ్యక్షులు గా చంద్రశేఖర్, సిఐటియు, యూనియన్ జిల్లా అధ్యక్షురాలు జ్యోత్స్నదేవి, జిల్లా కార్యదర్శి అల్లాఉద్దీన్, లతో పాటు 11 మంది ఆఫీస్ బేరర్స్ ఎన్నిక అయ్యారు.ఈ సందర్భంగా రాష్ట్ర గౌరవ అధ్యక్షులు భూపాల్ మాట్లాడుతూ మెడికల్ డిపార్ట్మెంట్లోని కాంట్రాక్టర్ సోర్సింగ్ ఎంప్లాయిస్ అందరికి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని ఏఎన్ఎంల పని భారం తగ్గించాలని,1930 ఏఎన్ఎం పోస్టులు, 2300 నర్సింగ్ ఆఫీసర్స్, 1284 ఎల్టి, 735 ఫార్మసిస్ట్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ కోసం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనాలు చెల్లించాలని కోరారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఆరోగ్య శ్రీ మిత్రల వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. 104 ఉద్యోగులందరికీ జీతాలు ఇవ్వాలని, స్వంతజిల్లాలో నియమించాలని కోరారు. కామారెడ్డి జిల్లా లోని ఔట్ సోర్సింగ్ ఏఎన్ఎం, ఫార్మసిస్టలను కాంట్రాక్టు పద్ధతిలో మార్చాలని కోరారు. ప్రభుత్వం వెంటనే జనరల్ హాస్పిటల్లో 8 మంది డిఈఓ లను తొలగించడం అన్యాయం అన్నారు. వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఉద్యమం చేస్తామన్నారు. వచ్చే నెల నవంబర్ 9న రాష్ట్ర మహాసభ సంగారెడ్డిలో ఉంటుందని ఉద్యోగులందరూ జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో సిఐటియు నాయకులు కొల్లాపురం బాబు, జోత్స్న, సావిత్రి, అల్లాఉద్దీన్, స్వామి, గంగాధర్, అన్నపూర్ణ, కవిత, సుజాత, కళ్యాణి, అమీనుద్దీన్, వీరేష్, ప్రభాకర్, దేవలక్ష్మి, వాణి, సుశీల, శోభ, సంగీత, మాధవి, రాజమణి, రాధిక, సునీత, బాల మణి, ప్రవీణ, శ్రీలత, ఇమ్రాన్ రాథోడ్ నాయక్, శ్రీనివాస్, మల్లికార్జున్, శ్రీనివాస్, డీఈవో పాల్గొన్నారు.



## గఫూర్ శిక్షక్‌ను అభినందించిన
# నలిమెల భాస్కర్

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (జనం సాక్షి) :** తెలంగాణ రచయితల వేదిక కామారెడ్డి జిల్లా అధ్యక్షులు ప్రముఖ కవి రచయిత గఫూర్ శిక్షక్ రచనలు చాలా బాగుంటాయని,సమాజానికి అవసరమైన కవిత్వాన్ని గఫూర్ శిక్షక్ రాస్తున్నాడని, కవిత్వంలో నిండైన భావనలు లోతైన ఆలోచనలు దూరదృష్టి కలిగిన రచనలు ఎంతో ఆకట్టుకుంటాయని, జనం కోసం ప్రజల సమస్యల పరిష్కార దిశలో తన రచనలు సాగుతుంటాయని, మంచి రచనలు చేసే గఫూర్ శిక్షక్ కవిత్వం ఎంతో ఆలోచింప జేస్తుందని, మరిన్ని మేటి రచనలు సమాజానికి అందించాలని, కేంద్ర సాహిత్య అకాడమీ చైర్మన్ అవార్డు. బహుభాషా వేత్త సుప్రసిద్ధ రచయిత అనువాదకులు డాక్టర్ నలిమెల భాస్కర్ అన్నారు. కరీంనగర్‌లో జరిగిన సాహితీ సమావేశంలో గఫూర్ శిక్షక్ నలిమెల భాస్కర్ ను కలిసి తన పుస్తకాలు ధైర్య కవచం యుద్ధ గీతం దీర్ఘ కవిత పుస్తకాలను నలిమెల భాస్కర్ కు అందజేశారు. ఈ సందర్భంగా గఫూర్ శిక్షక్ ను ఆయన అభినందించారు.యుద్ధ గీతం దీర్ఘ కవిత చాలా ఆలోచింపజేసేదిగా ఉన్నదని అన్నారు.

# పద్మశాలీలు అన్ని రంగాల్లో ఎదగాలి

- పట్టణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో అలయ్ బలయ్.
- ముఖ్యఅతిథిగా హాజరైన ఈఆర్ ఫౌండేషన్ చైర్మన్, సిఏ ఈరావత్రి రాజశేఖర్



**ఆర్మూర్, అక్టోబర్ 12 (జనంసాక్షి):** ఆర్మూరు పట్టణంలోని క్షత్రియ ఫంక్షన్ హాల్లో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అలయ్ బలయ్ కార్యక్రమం ఆదివారం విజయవంతంగా జరిగింది. పద్మశాలీల ఐక్యతను చాటేందుకు పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు మ్యాక మోహన్ దాస్, కార్యదర్శి కొక్కుల రమాకాంత్, కార్యవర్గం సభ్యులు ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఈఆర్ ఫౌండేషన్ చైర్మన్, సీఏ ఈరావత్రి రాజశేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులు, ఇంజనీరింగ్, ఎంబీబీఎస్‌లో సీట్లు సాధించిన విద్యార్థులు, నృత్యంలో ప్రతిభ కనబరిచిన వారిని సత్కరించారు. బతుకమ్మ పోటీల్లో పాల్గొన్న మహిళలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈరావత్రి రాజశేఖర్ మాట్లాడుతూ, పద్మశాలీలు ఉన్నత విద్యావంతులుగా, డాక్టర్లు, ఇంజనీర్లుగా వివిధ రంగాల్లో ముందున్నారని, రాజకీయాల్లోనూ తమ వంతు పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. బీసీలు శ్రమ, వృత్తి, సమాజాన్ని నమ్ముకుని ముందుకు సాగుతుండగా, ఉన్నత వర్గాలు రాజకీయాల ద్వారా అణచివేతకు గురి చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రెండో అతిపెద్ద సామాజిక వర్గంగా పద్మశాలీలు ఉన్నప్పటికీ, కేవలం ఒక్క ఎమ్మెల్యే మాత్రమే ఉండడం దురదృష్టకరమన్నారు. జనాభాకు తగిన వాటా కోసం పోరాడాలని, రానున్న ఎన్నికల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీల భాగస్వామ్యం ఉండాలని కోరారు. పట్టణ పద్మశాలీల ఐక్యతను చాటేందుకు అలయ్ బలయ్ కార్యక్రమానికి మహిళలు పెద్ద ఎత్తున హాజరవడం శుభపరిణామమని పేర్కొన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం గళమెత్తేందుకు, పోరాడేందుకు సిద్ధంగా ఉంటామని, రాజ్యాధికారం దిశగా అడుగులు వేస్తామని, భవిష్యత్తులో రాజకీయంగా తన వంతు పాత్ర పోషిస్తానని హామీ ఇచ్చారు. బీసీలను అణచివేసేందుకు కొందరు కుట్రపూరిత రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి బత్తుల భాస్కర్, ఉపాధ్యక్షులు ఘణపురం సంతోష్ కుమార్, ప్రోగ్రాం కన్వీనర్ కొక్కుల విద్యాసాగర్, సర్వసమాజ్ ప్రతినిధి ఎలిగేటి చక్రధర్, తర్ప సంఘాల అధ్యక్షులు అంబటి కృష్ణహరి, బండి అనంత్ రావు, రుద్ర రాజేశ్వర్, సైబ సుధాకర్, వేముల ప్రకాష్, సదమస్తుల గణపతి, రాక్సీ రమేష్, జిందం నరహరి, మహిళ సంఘం ప్రెసిడెంట్ మ్యాక హేమలత, ప్రధాన కార్యదర్శి కొక్కుల వసంతలక్ష్మీ, కోశాధికారి ఈరవత్రి సునీత, పెర్కిట్ సంఘం ప్రెసిడెంట్ మానేటి లింబాద్రి, మండల సంఘం ప్రెసిడెంట్ బొడ్డు గంగాధర్, చెన్న రవి, రవికాక తదితరులు పాల్గొన్నారు.

# ఐక్యతతోనే హక్కులను సాధించుకోవాలి

- రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ముదిరాజ్ జెండా ఎగురవేయాలి
- ముదిరాజ్ మహా సభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పర్ష హన్మండ్లు



**గంభీరావుపేట, అక్టోబర్ 12( జనం సాక్షి) :** ముదిరాజులను బిసి డి నుండి బిసి ఏలోకి మార్చాలని, ముదిరాజ్ లు అందరు ఐక్యంగా ఉండి హక్కులను సాధించుకోవాలని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో ముదిరాజుల జెండా ఎగరవేయాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పర్ష హన్మండ్లు పిలుపునిచ్చారు. ఆదివారం మండలానికి చెందిన కొత్తపల్లి గ్రామంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పెరమల్లె లింగయ్య ఆధ్వర్యంలో ముదిరాజ్ జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పర్ష హన్మండ్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముదిరాజ్‌లు ఐక్యాంగా ఉండి హక్కులను సాధించుకోవాలని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ముదిరాజ్ జెండా ఎగురవేయాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బిసిలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించడం సంతోషకరమన్నారు. అలాగే ముదిరాజ్‌ల చిరకాల కోరిక అయిన బిసిడి నుండి బిసిఏ లోకి మార్చాలంటూ చేస్తున్న విజ్ఞప్తిని కూడా పరిగణనలోకి తీసుకుని ముదిరాజ్‌ల న్యాయమైన డిమాండ్ నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు. శాత్రబోయిన లక్ష్మణ్, జిల్లా ఉపాధ్యక్షులు శివంది దేవేందర్, జిల్లా కార్యదర్శి పెరిమెల్లి రమేష్, గౌరవ అధ్యక్షుడు ఓరుగంటి నర్సింలు, మండల ఉపాధ్యక్షుడు ముచ్చ ఆనందం, మండల సంయుక్త కార్యదర్శి రంగు దేవయ్య, కోశాధికారి తోక దేవదాసు, గ్రామ కార్యదర్శి పేరిమల్లి బాలరాజు, కోశాధికారి పాల్వంచ సంతోష్‌లతోపాటు అన్ని గ్రామాల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు ఉపాధ్యక్షులు సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సబ్బు నీటితో శుభ్రంచేయ్
# అమ్మేసేయ్
### నీకింత లాభం నాకింత లాభం..




**కమ్మర్ పల్లి అక్టోబర్ 12 (జనంసాక్షి) :** ప్రభుత్వం లక్షల రూపాయలు కేటాయిస్తూ గర్భిణీలు, బాలింతలు పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించాలని ఒకవైపు పోషణ మాసం కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉండగా అంగన్వాడీ కేంద్రాల్లోని గుడ్లను పక్కదారికి మరలిస్తున్న వ్యవహారం ఆదివారం రోజున కమ్మరిపల్లి మండల కేంద్రంలో కిరణా షాప్‌లో అంగన్వాడి గుడ్లను బహిరంగంగా అమ్మకానికి ఉంచారు.ఒక వినియోగదారుడు మండల కేంద్రంలో గల ఒక కిరణా షాప్‌లో 10 కోడిగుడ్లను కొనుక్కొని ఇంటికి వెళ్లి వంట చేద్దామని చూడగా కోడిగుడ్లు కుళ్లిపోయి ఉన్నాయి.ఇదేంటని ఆ కిరాణా షాపు యజమానిని ప్రశ్నించగా ఇవి అంగన్వాడి కేంద్రానికి సంబంధించిన గుడ్లని సమాధానం ఇచ్చారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందాల్సిన అంగన్వాడీ కోడి గుడ్లు మండల కేంద్రంలోని ఒక కిరణా షాపుల్లో అమ్మకానికి పెట్టారు.

అంగనవాడీ గుడ్లను గుర్తు పట్టే విధంగా ప్రభుత్వం వాటిపై రంగులువేసి సెంటర్లకు సరఫరా చేస్తున్నారు.వాటిని గుర్తు పట్టకుండా షాపుల యజమానులు రంగులను సబ్బునీటితో శుభ్రం చేసి బహిరంగంగా విక్రయాలు చేస్తున్నారు. పిల్లలు, గర్భిణులకు అందాల్సిన గుడ్లు,పౌష్టిక ఆహారం పక్కదారి పట్టి కిరాణ షాపుల్లోకి చేరుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు క్షేత్రస్థాయి పర్యటన చేసి అంగన్వాడి కేంద్రాలలోని గుడ్లు పౌష్టికాహారం లబ్ధిదారులకు సకాలంలో అందుతున్నాయా లేవా అని వాటి నాణ్యతపై దృష్టి సాధించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## ప్రతి ఒక్కరూ పిల్లలకు
# చిన్న వయసులోనే క్రమశిక్షణ నేర్పాలి
### ఎంఎండీసీ రిటైర్డ్ ప్రిన్సిపాల్ యార్లగడ్డ శ్రీనివాస్




**నిజామాబాద్ జిల్లా బ్యూరో అక్టోబర్ 12 (జనంసాక్షి) :** ప్రతీ కుటుంబంలోని తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్న వయసులోనే క్రమశిక్షణను నేర్పాలని మధుమలంచ డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ యార్లగడ్డ శ్రీనివాస్ అన్నారు. కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండల కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆఫ్ బీర్కూర్ ఆధ్వర్యంలో ఆదివారం మెంటల్ వెల్ నెస్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అయన మహాత్మా జ్యోతిబా పులే పాఠశాలలో పిల్లలను దృష్టిలో ఉంచుకొని మాట్లాడుతూ మొక్కై వంగనిది... మానై వంగునా అన్న సామెతను గుర్తు చేశారు. పాఠశాల పిల్లల భవిష్యత్తు, కార్యాచరణ, క్రమశిక్షణ, తల్లి తండ్రి మనకోసం మన కోసం పడుతున్న కష్టం, మనం తల్లి తండ్రి కోసం చేస్తున్న పని, భవిష్యత్తులో మనం ఉండే తీరు, ఉన్నత చదువులు, ఉద్యోగాలు తదితర అంశాలపై వివరణ, అన్వేషణ మరియు ప్రయోగాలు, సమస్యల పరిష్కారం, జ్ఞానం సామర్థ్యాలు, సృజనాత్మక కృత్యాలు, నైపుణ్యాలు ఆటలు మరియు క్రీడలు తదితర విషయాలపై మెంటల్ వెల్ నెస్ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని, అనంతరం యార్లగడ్డ శ్రీనివాస్ ను లయన్స్ క్లబ్ ఆఫ్ బీర్కూర్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు సితలె రమేష్, సేకరెట్రి జెట్టి రవీందర్, ట్రెజరర్ మేకల గాలయ్య, జోన్ ఛైర్మెన్ కోట్టురి సంతోష్, సీనియర్ లయన్స్ సభ్యులు ఎం ఏ. రషిద్, కిషోర్ దాస్, మేకల విఠల్, లయన్స్ సభ్యులు కొర్రి అశోక్ యాదవ్, పెండ్యాల రమేష్, సాయికృష్ణ, సుధాకర్ రెడ్డి, బస్వంత్ పటేల్, కార్తీక్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.



# పెద్దపెల్లి జిల్లా కలెక్టర్‌పై మంత్రి వివేక్‌కు ఫిర్యాదు

**గోదావరిఖని, అక్టోబర్ 12 (జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లాలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహాల ఏర్పాటు విషయంలో అడ్డుపడుతూ కుల వివక్షతో వ్యవహరిస్తున్న జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కార్మిక గనుల శాఖ మంత్రి డాక్టర్ జి.వివేక్ వెంకటస్వామికి ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం నాయకులు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.ఆదివారం హైదరాబాదులోని మంత్రి డాక్టర్ జి.వివేక్ వెంకటస్వామి నివాసంలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షులు మామిడిపల్లి బాపయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, బొంకూరి మధు, రాష్ట్ర ఉపాధ్యక్షులు మైస రాజేష్ కలిశారు. ఈ సంవత్సరం ఐదో తేదీ నుండి 14వ తేదీ వరకు జరిగిన భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతోత్సవ కార్యక్రమాల సందర్భంగా ఏర్పాట్ల విషయంలో దరఖాస్తు ఇచ్చేందుకు వెళ్లిన దళిత నాయకుల పట్ల కూడా అవహేళనతో మాట్లాడిన కలెక్టర్,జిల్లాలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాలను పెట్టకుండా 2013 అప్పటి రాష్ట్ర ప్రభుత్వం, ప్రధాన రహదారుల పైన కొత్తగా ఎలాంటి విగ్రహాలు పెట్టొద్దని తీసిన సర్క్యులర్,ను బూచిగా చూపి,పాత సర్క్యులర్ ను జిల్లా అధికారులకు పంపిస్తూ, గ్రామాలలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమిష్టి కృషితో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుంటే వాటిని పెట్టకుండా అడ్డుపడుతున్నారని అందుకు ఉదాహరణ సుల్తానాబాద్ మండలం మంచరామే ప్రధాన సాక్ష్యం అని మంత్రికి ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు, 2013 నుండి ఇప్పటివరకు రాష్ట్రంలో పెద్దపెల్లి జిల్లాలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో విగ్రహాల ఏర్పాటు విషయంలో ఎలాంటి ఆటంకాలు కలగలేదని పెద్దపెల్లి జిల్లాలో మాత్రం జిల్లా కలెక్టర్ కుల వివక్షతతోనే వ్యవహరిస్తున్నారని, తన ద్వారా కలెక్టర్ వ్యవహార తీరును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లాలని మంత్రి జి.వివేక్ వెంకటస్వామికి విజ్ఞప్తి చేశారు.

## భక్తుల ప్రజల మనోభావాలకు భంగం కలిగిస్తే చూస్తూ ఊరుకోం

- ఆలయం మూసివేస్తే పంచలు కట్టుకొని డోర్లు తెరుస్తాం
- ఫైరింగ్ చేస్తారో లాటి చార్జి చేస్తారో చూద్దాం
- బిజెపి నాయకులు కార్యకర్తల జూమ్ మీటింగ్లో కేంద్ర హెూమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి అక్టోబర్ 12 (జనంసాక్షి) :** రాజన్న మొక్కులు భీమన్నకి ఎలా చెల్లిస్తారు..?భక్తుల ప్రజల మనోభావాలకు భంగం కలిగిస్తే చూస్తూ ఊరుకోమని,ఆలయం మూసివేస్తే పంచలు కట్టుకొని డోర్లు తెరుస్తామని,ఫైరింగ్ చేస్తారో లాటి చార్జి చేస్తారో చూద్దమని బిజెపి నాయకులు కార్యకర్తల సిద్ధంగా ఉండాలని శనివారం రాత్రి జూమ్ మీటింగ్లో కేంద్ర హెూమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పిలుపు నిచ్చారు.ఈ సందర్భంగా ఆయన జూ మీటింగులో రాజన్న సిరిసిల్ల జిల్లా భాజపా నాయకులతో మాట్లాడుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. రాజన్న ఆలయ అభివృద్ధిపై ప్రభుత్వ ప్రణాళిక ఏమిటి దేశంలో ఎన్నో ఆలయాలను అభివృద్ధి చేస్తున్నాం ఎక్కడా కూడా ఆలయాలను మూసివేయడం లేదన్నారు.యాదాద్రి ఆలయంలో కూడా బాలాలయం ప్రతిష్ట చేసిన అనంతరం దర్శనాలు కల్పించి అభివృద్ధి విస్తరణ పనులు చేపట్టారు.ఆలయాన్ని ఎన్ని రోజులు మూసివేస్తారు, ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత అధికారులు, నాయకుల మీద ఉంది.బండి సంజయ్ ఇతర నాయకులు శాశ్వతం కాదు, భాజపా,కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం శాశ్వతం కాదన్నారు. శ్రీ రాజరాజేశ్వర స్వామి భక్తుల సెంటిమెంట్ గొప్పది.మేం చెప్పిందే నడుస్తుంది నేను చెప్పింది నడవాలని ఆకస్మాత్తుగా ఆలయాన్ని మూసివేస్తామంటే ఎలా ఒప్పుకుంటమన్నారు.

ప్రజలతో మాట్లాడి ప్రజలతో చర్చించి దర్శనాలు ఏ విధంగా ఇస్తారో చెప్పాలి,ప్రశ్నించేవారు ఎవరూ లేరు అనుకుంటే సరికాదన్నారు.బాజపా ద్వారా తాము తప్పకుండా ప్రశ్నిస్తామన్నారు.భాజాప నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు.భక్తుల మనోభావాలకు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకుంటే వ్యతిరేకించాల్సిందే అన్నారు.కోడె మొక్కులు రాజన్నకు మొక్కుతారు, భీమన్నకు ఎలా చెల్లిస్తారన్నారు.ప్రతి గ్రామంలో శివాలయం లేదా అక్కడే మొక్కులు చెల్లిస్తారు కదా ప్రజల సెంటిమెంటు మనోభావాలు కాపాడాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు.గ్రామాల్లో ప్రజలకు నాయకులు కార్యకర్తలు స్పష్టంగా వివరించాలని ఆయన స్పష్టం చేశారు.ఆలయం మూసివేస్తారని ఇప్పటికే చాలామంది ఏడుస్తున్నారు. రాజన్న చూడకుండా ఎలా ఉంటామని భక్తులు ఆవేదన చెందుతున్నారన్నారు. సమ్మక్క సారలమ్మ, మహా శివరాత్రి జాతర రాబోతుంది,కావాలని పేరు ప్రతిష్టల కోసం ప్రణాలిక ప్రకారం ఇదంతా చేస్తున్నారన్నారు. అభివృద్ధిని స్వాగతిస్తాం..సహకరిస్తాం ఇది బిజెపి బీఆర్ఎస్ కాంగ్రెస్ కొట్లాట కాదు ... ప్రజల మనోభావాలకు సంబంధించిన కొట్లాట అన్నారు.ప్రభుత్వం తర్వాత నిధులు ఇస్తుందో ఇవ్వదో తెలియదు.రాజన్న సిరిసిల్ల జిల్లా ఒకటే కాదు ఉమ్మడి కరీంనగర్, నిజమాబాద్, మెదక్ నుంచి కూడా భాజపా కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివస్తారు.. తరలిద్దమన్నారు.రాజన్న సిరిసిల్ల జిల్లా భాజపా నాయకులు కార్యకర్తలు సిద్ధంగా ఉండడానికి సమాచారం ఇస్తున్నమని మంత్రి తెలిపారు.

బాజాపా జిల్లా అధ్యక్షుడు రెడ్డవేణి గోపి, ప్రతాప రామకృష్ణ ఎప్పటికప్పుడు కార్యకర్తలు నాయకులకు సమాచారం ఇస్తారు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు.భాజపా సీనియర్ నాయకుడు ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ ఆలయాన్ని మూసివేత ఎట్టి పరిస్థితిలో ఒప్పుకోమని మొదట నుంచి చెబుతున్నామన్నారు.రాత్రి సమయంలో పనులు కొనసాగించుకుంటూ ఉదయం భక్తులకు దర్శనాలు చేసుకోవడానికి అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తున్నట్లు అయన చెప్పారు.నాయకులు,కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసి కార్యచరణ ప్రకటిస్తామన్నారు.

### నేడు మంథనిలో మంత్రి శ్రీధర్ బాబు పర్యటన

**మంథని, (జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా మంథని నియోజకవర్గ కేంద్రంలో ఆదివారం రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు పర్యటించ నున్నారు. ఇందులో భాగంగా ఉదయం 9.30ని.లకు మంథని రామగిరి కమాన్పూర్ ముత్తారం సంబంధించిన 87 సిఎంఆర్ఎఫ్ చెక్కులు, మంథని 26, రామగిరి 6, కమాన్పూర్ 4, ముత్తారం 2 కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు చెక్కులను మంత్రి చేతుల మీదుగా మంథనిలోని క్యాంప్ కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేయనున్నారు. అనంతరం మంథని మండలం పుట్టపాకలో నిర్మించిన మంథని పిఎస్‌సిఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్మించిన శ్రీపాద స్మారక బస్టాండ్‌ను ప్రారంభోత్సవం చేయనున్నారు.

# భక్తుల విశ్వాసానికి అనుగుణంగా పనిచేస్తాం

- ఇల్లు నిర్మాణం జరిగేటప్పుడు ఇంట్లోనే ఉంటామా... అలోచన చేయండి




**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి అక్టోబర్ 12 (జనంసాక్షి) :** శృంగేరి పీఠాదిపతులు,ఆగమ శాస్త్ర ప్రకారం రాజన్న ఆలయ అభివృద్ధి జరుగుతుందని,భక్తుల విశ్వాసానికి అనుగుణంగా పనిచేస్తామని,ఇల్లు నిర్మాణం జరిగేటప్పుడు ఇంట్లోనే ఉంటామా...అలోచన చేయాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఆలయ చైర్మన్ ఛాంబర్ లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వేములవాడ పట్టణ,ఆలయ అభివృద్ధి కోసం సీఎం రేవంత్ రెడ్డి కృషితో రూ 150 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు.ఆలయ విస్తరణ సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భీమేశ్వర ఆలయంలో దర్శనాలు ఆర్జిత సేవలు, ఏర్పాటు చేశామన్నారు.శృంగేరి పీఠాధిపతి సూచనలు ఆగమశాస్త్రం ప్రకారం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు.పట్టణ ప్రజలు, కేంద్రమంత్రి బండి సంజయ్, ఆలయ పరిరక్షణ సమితి సభ్యులు ఇచ్చిన సూచనలు,సలహాలు ఇది వరకే తీసుకున్నామని చెప్పారు.వారు సూచించిన అంశాలను కూడా పరిగణలోకి తీసుకుంటామన్నారు. రాజన్న ఆలయంలో సుమారు 64 నుండి 70 పిల్లర్లతో మండపాల నిర్మాణం వస్తుందన్నారు. ఈ క్రమంలో పెద్ద పెద్ద మిషన్స్ ద్వారా బారీ పిల్లర్ గుంతలు తీయాల్సి ఉంటుందని, పనుల జరుగుతున్న సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా భీమేశ్వర స్వామి ఆలయంలో దర్శనాలు ఏర్పాటు చేశామన్నారు.భక్తుల కోసం ఎవరు ఎలాంటి సూచనలు చేసిన తప్పకుండా గౌరవిస్తామని స్పష్టం చేశారు.పనులు జరిగే క్రమంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బీమేశ్వర ఆలయంలో దర్శనాలు ఏర్పాటు చేశామని భక్తులు గమనించాలనీ అయన కోరారు.రాజన్న ఆలయం బంద్ అనేది అవాస్తవం...స్వామి వారికి జరిగే నిత్యపూజలు ఏకాంతగా జరుగుతాయాని తెలిపారు. ఆలయంలో పనులు జరిగే క్రమంలో మాత్రం భక్తుల సేఫ్టీ కోసం మాత్రం ప్రత్యామ్నాయంగా భీమేశ్వర ఆలయంలో దర్శనాలు ఏర్పాటు చేశామని చెప్పారు. ఆయన వెంట ఆలయ ఈవో రమాదేవి,ఏఎస్పీ శేషాద్రి రెడ్డి పాల్గొన్నారు.

## కొడుకుకు వరల్డ్ కప్ సెంచరీ అంకితం!

లండన్: ఇటీవలి కాలంలో స్వలింగ వివాహాలకు అనేక దేశాలు అనుమతి ఇస్తున్నాయి. దీంతో చాలామంది తమకు నచ్చిన మరో మహిళతో జీవితం పంచుకోవాలని నిర్ణయిస్తున్నారు. ముఖ్యంగా క్రికెటర్లలో ఈ ధోరణి ఎక్కువగా కనిపిస్తోంది. ఇంగ్లండ్ మహిళల క్రికెట్ జట్టులో స్వలింగ జంటలు ఉన్నాయి. నాట్ సీవర్ బ్రంట్, క్యాథరీన్ బ్రంట్ జోడీ కూడా అలాంటిదే. జాతీయ జట్టుకు ఆడుతున్న సమయంలోనే ఒకరినొకరు ఇష్టపడ్డారు. 2017లో వన్డే వరల్డ్ కప్ గెలిచిన తర్వాత తమ సంబంధాన్ని మరో స్థాయికి తీసుకెళ్లి 2018లో నిశ్చితార్థం చేసుకున్నారు. నాలుగేళ్ల తర్వాత 2022 మేలో సన్నిహితుల సమక్షంలో క్యాథరీన్, నాట్ సీవర్ పెళ్లి చేసుకున్నారు. తమ అనుబంధానికి గుర్తుగా ఒక బిడ్డను కనాలని అనుకున్నారు. అనుకున్నట్టుగానే ఈ ఏడాది మార్చిలో బ్రంట్ జంట మగబిడ్డకు జన్మనిచ్చింది. ఈ విషయాన్ని ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకుంటూ మేము కుటుంబ జీవితాన్ని మొదలుపెట్టాలని అనుకుంటున్నాం. పేరంటింగ్ బాధ్యతలు చూసుకుంటూనే క్రికెటర్‌గా రాణిస్తానని క్యాథరీన్ చెప్పింది. సంతానం కలగాలంటే స్త్రీ, పురుషులు మాత్రమే అయి ఉండాలి అనేది ఒకప్పటి మాట. సాంకేతికతలో కృత్రిమ గర్భధారణ విధానం అందుబాటులోకి వచ్చాక పురుషుల ప్రత్యక్ష ప్రమేయం బిడ్డను కనే అవకాశం వచ్చింది. ఈ పద్ధతిలో భాగస్వాముల్లో ఒకరు అండాలను దానం చేస్తే మరొకరు గర్భం దాల్చేందుకు సిద్ధమవుతారు. అనంతరం వీర్య దాతగా ఆరోగ్యవంతుడైన వ్యక్తిని ఎంపిక చేసుకుంటారు. ఈ ప్రక్రియ పూర్తయ్యాక వైద్యులు దాత వీర్యాన్ని అండంతో ఫలదీకరణం చేసి బిడ్డను మోయాలనుకున్న మహిళ గర్భాశయంలోకి ప్రవేశపెడతారు. ఈ రెండు విధానాల్లో స్వలింగ జంటలు తల్లిదండ్రులవుతారు. నాట్ సీవర్ క్యాథరీన్ జంట కూడా ఇలానే మగబిడ్డను కన్నది.

## అభిషేక్‌పై ఇహ్సానుల్లా సవాల్

- ‘3-6 బంతుల్లోనే ఔట్‌గా చేస్తా!’
- ఆసియా కప్‌లో పంజాబ్ బాంబర్ దండయాత్ర
- 152 కేఎంపీహెచ్ వేగంతో పాక్ పేసర్ అత్మవిశ్వాసం
- భారత్-పాక్ రివాలరీలో మరో ఉత్కంఠకర సంగతి



**లాహోర్, అక్టోబర్ 12 (జనంసాక్షి) :** ఆసియా కప్ 2025లో పాకిస్తాన్ బౌలర్లను చెల్లచెదురు చేసి టోర్నీ టాప్ స్కోరర్‌గా మారిన భారత ఓపెనర్ అభిషేక్ శర్మపై పాకిస్తాన్ పేసర్ ఇహ్సానుల్లా తీవ్ర సవాలు విసిరాడు. 7 మ్యాచ్‌ల్లో 314 పరుగులు (స్ట్రైక్ రేట్ 198.73) చేసి, మూడు అర్ధసంతకాలతో భారత్ టైటిల్ విజయానికి కీలకమైన పంజాబ్ బ్యాటర్ అభిషేక్, పాక్ పేసర్ షాహిన్ అఫ్రిదీ, హారిస్ రౌఫ్‌లను ధూళిలో కల్పించాడు. గ్రూప్ స్టేజ్‌లో పాక్‌పై 31 (13 బంతులు), సూపర్ ఫోర్‌లో 74 (39 బంతులు) చేసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అయ్యాడు. ఈ నేపథ్యంలో, పాక్ పేసర్ ఇహ్సానుల్లా ఒక వైరల్ వీడియోలో అత్మవిశ్వాసంగా మాట్లాడుతూ, “భారత్‌తో ఆడటానికి అవకాశం వస్తే, అభిషేక్ శర్మను 3 నుంచి 6 బంతుల్లోనే ఔట్ చేస్తాను. నా 140 కేఎంపీహెచ్ వేగం అతనికి 160లా అనిపిస్తుంది. అతడు ఇన్‌స్వింగర్లకు బలహీనుడు, బౌన్సర్లు అతన్ని ఇబ్బంది పెడతాయి” అని సవాలు విసిరాడు. 22 ఏళ్ల ఇహ్సానుల్లా, 2023 పాకిస్తాన్ సూపర్ లీగ్‌లో 152.65 కేఎంపీహెచ్ వేగంతో బంతి విసిరి అందరినీ ఆకట్టుకున్నాడు. మల్టాన్ సుల్తాన్స్‌కు గణనీయమైన ఫైవర్ తీసి, ప్రపంచ నంబర్ వన్ బ్యాటర్లను కూడా ఇబ్బంది పెట్టిన ఈ పేసర్, ఎల్బో గాయంతో ఆసియా కప్ మిస్ అయ్యాడు. ఈ ఏడాది జనవరిలో 22 ఏళ్ల వయసులో క్రికెట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించి, 24 గంటల్లోనే తిరిగి వచ్చిన ఇహ్సానుల్లా, ఇప్పుడు నేషనల్ టీ20 కప్‌లో పీషావర్‌కు ఆడుతూ ఫామ్ తిరిగి పొందుతున్నాడు. ఈ సవాలు సోషల్ మీడియాలో తీవ్ర చర్చనీయాంశమైంది. భారత అభిమానులు “ఆసియా కప్‌లో పాక్ సీనియర్ పేసర్లు కూడా అభిషేక్‌ను ఆపలేకపోయారు, ఇహ్సానుల్లా ఏమి చేస్తాడు?” అంటూ ట్రోల్ చేస్తున్నారు. అభిషేక్, టీ20ల్లో వరల్డ్ నంబర్ వన్ బ్యాటర్‌గా బ్రియాన్ లారా ప్రశంసలు అందుకున్నాడు. ఈ రివాలరీ, రానున్న ఇండియా-పాక్ మ్యాచ్‌లకు మరింత ఉత్కంఠాన్ని జోడిస్తోంది.

## ఆసీస్ విజయం

### హీలీ హవా.. 3 వికెట్లతో భారత్‌పై గెలుపు!



- మాంధనా-రావల్ సెంచరీ ఓపెనింగ్ వృథా
- సదర్‌ల్యాండ్ ఫైవర్‌తో భారత్ కుప్పకూలి
- హీలీ సెంచరీ, పెర్రీ ఫినిషింగ్‌తో మెరిసిన ఆస్ట్రేలియా



**విశాఖపట్నం, అక్టోబర్ 12 (జనంసాక్షి) :** విశాఖపట్నంలోని డా. వై.ఎస్. రాజశేఖర రెడ్డి ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో జరిగిన మహిళల వన్డే వరల్డ్ కప్ 2025 13వ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా మహిళలు భారత్‌పై 3 వికెట్ల తేడాతో (6 బంతులు మిగిలి) రికార్డు చేజ్‌తో గెలుపొందారు. భారత్ నిర్దేశించిన 331 పరుగుల భారీ లక్ష్యాన్ని ఆస్ట్రేలియా 49 ఓవర్లలో 334/7తో అధిగమించి, మహిళల వన్డేల్లో అత్యధిక చేజ్ రికార్డు నమోదు చేసింది. కెప్టెన్ అలిస్సా హీలీ (111, 86 బంతులు, 13 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీతో జట్టును ముందుంచగా, గాయంతో రిటైర్ హర్ట్ అయిన ఎల్లీస్ పెర్రీ (42, 35 బంతులు) ఫినిషింగ్ టచ్‌తో గెలిపించింది. భారత్ మొదట బ్యాటింగ్ చేసి 48.5 ఓవర్లలో 330/10 స్కోరు చేసింది. స్మృతి మాంధనా (80, 66 బంతులు, 10 ఫోర్లు, 1 సిక్స్) రికార్డు 5000 వన్డే పరుగులు, 2025లో 1000 పరుగుల మైలురాయి దాటి ఆస్ట్రేలియాపై 5వ 50 స్కోరుతో రాణించింది. ప్రతికా రావల్ (75, 98 బంతులు)తో కలిసి 155 రన్స్ ఓపెనింగ్ భాగస్వామ్యం నమోదు చేసింది. 30 ఓవర్లకు 192/1తో బలంగా కనిపించిన భారత్, చివరి 18.5 ఓవర్లలో 6 వికెట్లు 36 పరుగులకు కోల్పోయి కుప్పకూలింది. ఆస్ట్రేలియా పేసర్ అన్నబెల్ సదర్‌ల్యాండ్ (5/40) మెయిడెన్ వన్డే ఫైవర్‌తో హర్మన్‌ప్రీత్ కౌర్ (45), రిద్ధిమా భండారి (30) వంటి కీలక బ్యాటర్లను పెవిలియన్‌కు చేర్చింది. ఆస్ట్రేలియా చేజ్‌లో హీలీ ఫిబీ లిచ్‌ఫీల్డ్ (35)తో 80 రన్స్ ఓపెనింగ్ భాగస్వామ్యం, బెత్ మూనీ (25)తో 60 రన్స్ జోడించి దూకుడుగా ఆడింది. భారత స్పిన్నర్ శ్రీ చారణి (2/29) రెండు వికెట్లు తీసినా, కృష్ణమ్మ గౌడ్ (0/64) ఖరీదైన బౌలింగ్ భారత్‌ను దెబ్బతీసింది. 45 ఓవర్లలో 290/5తో కొంచెం కష్టంలో పడిన ఆస్ట్రేలియాను పెర్రీ, ఆష్లీ గార్డ్‌నర్ (14) గెలిపించారు. భారత జట్టు బ్యాటింగ్ బ్యాలెన్స్‌పై ప్రశ్నలు మిగిలాయి. మాంధనా, రావల్ ఓపెనింగ్ జోరు వృథా కాగా, బౌలింగ్‌లో స్పిన్ దాడి ఫలించలేదు. ఈ ఓటమితో భారత్ సెమీస్ ఆశలపై ఒత్తిడి పెరిగింది. 26,000 సామర్థ్యం ఉన్న స్టేడియంలో 15,087 టికెట్లు అమ్ముడై, మిథాలీ రాజ్, రవి కల్పనల పేరిట ట్రిబ్యూన్లలో జనం ఉత్సాహంగా ఆటను ఆస్వాదించారు. “మా బ్యాటింగ్ బాగున్నా, చివరి ఓవర్లలో కుప్పకూలాం. బౌలింగ్‌లో మెరుగ్గా చేయాలి” అని హర్మన్‌ప్రీత్ వ్యాఖ్యానించింది. హీలీ మాట్లాడుతూ, “ఇది జట్టుగా మా బెస్ట్ చేజ్. పెర్రీ ఫినిషింగ్ అద్భుతం” అని ప్రశంసించింది.

## యశస్వి శతక జాతకం



- గావస్కర్ ‘గ్రాండ్డీ’ సూచనతో జైస్వాల్ జోరు!
- డబుల్ సెంచరీ అవకాశం.. రనౌట్ రూపంలో అగ్గిపుల్ల!
- భారత ఓపెనర్ బ్యాటింగ్‌తో టీమిండియా డామినేషన్

**ఢిల్లీ, అక్టోబర్ 12 (జనంసాక్షి) :**

ఢిల్లీలో వెస్టిండీస్‌తో జరుగుతున్న రెండో టెస్టులో భారత యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ భారీ శతకంతో చెలరేగాడు. అరుణ్‌జైట్లీ స్టేడియంలో డబుల్ సెంచరీ దిశగా సాగుతున్న జైస్వాల్ (171, 209 బంతులు, 18 ఫోర్లు, 3 సిక్సర్లు) రనౌట్ రూపంలో పెవిలియన్‌కు చేరాడు. ఈ ఇన్నింగ్స్‌తో అభిమానులను అలరించిన ఈ 23 ఏళ్ల బ్యాటర్, “ఆటలో ఇలాంటివి జరుగుతాయి. నా బ్యాటింగ్‌ను ఆస్వాదించాను, మళ్లీ ఇలాంటి ఇన్నింగ్స్ ఆడతాను” అని ధీమా వ్యక్తం చేశాడు. రెండో రోజు ఆట ముగిసిన తర్వాత క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్‌తో చిట్‌చాట్‌లో యశస్వికి కీలక సూచన వచ్చింది. “నీ ఆట అద్భుతం, అందరూ ఆస్వాదించాం. ఇన్నింగ్స్ ఎలా ముగిసినా పట్టించుకోవద్దు. సెంచరీలు కొట్టు, వాటిని డాడీ హండ్రెడ్స్‌గా మార్చు. నేనిప్పుడు గ్రాండ్‌ఫాదర్‌ని (నవ్వుతూ), కాబట్టి నీవి గ్రాండ్డీ హండ్రెడ్స్ అవుతాయి” అని గావస్కర్ సరదాగా సూచించాడు. దీనికి జైస్వాల్ “థాంక్యూ సర్” అంటూ నవ్వేశాడు. క్రికెట్ వ్యాఖ్యాత హర్షా భోగ్లే కూడా “నీ బ్యాటింగ్ చూడటం ఆనందంగా ఉంది” అని ప్రశంసించాడు. భారత మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్ యశస్వి గణాంకాలను మెచ్చుకుంటూ, “26 టెస్టుల్లోనే 1800 పరుగులు (ఆవరేజ్ 55.50, 6 శతకాలు) చేసిన జైస్వాల్, సచిన్, విరాట్‌లను మించిన ప్రదర్శన చేస్తున్నాడు. 85 స్ట్రైకరేట్‌తో పరుగులు రాబడుతూ భారత విజయాలను సులభతరం చేస్తున్నాడు. సెహ్వాగ్ 300 రికార్డును ఈ యువ బ్యాటర్ బద్దలు కొడతాడు” అని సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. ఈ మ్యాచ్‌లో భారత్ మొదటి ఇన్నింగ్స్‌లో 518/5తో డిక్లేర్ చేయగా, జైస్వాల్ శతకం జట్టు ఆధిపత్యానికి కీలకమైంది. కేఎల్ రాహుల్ (50), షుభ్మన్ గిల్ (100)లతో కలిసి రెండో వికెట్‌కు 150 రన్స్ భాగస్వామ్యం నెలకొల్పిన జైస్వాల్, వెస్టిండీస్ బౌలర్లను చెల్లాచెదురు చేశాడు. అల్జారీ జోసెఫ్, జైడెన్ సీల్స్‌లను ధాటిగా ఎదుర్కొన్న అతడు, 18 ఫోర్లతో అభిమానులను అలరించాడు. వెస్టిండీస్ బౌలర్ సీల్స్ రనౌట్ ప్రయత్నంలో బంతిని జైస్వాల్ ప్యాడ్లపై విసరడంతో %×జజ% అతడికి 25% మ్యాచ్‌ఫీ కోత, ఒక డీమరిట్ పాయింట్ విధించింది. ఈ ఘటన జైస్వాల్ ఆటపై ప్రభావం చూపలేదు. గత ఏడాది ఆస్ట్రేలియాతో సిరీస్‌లో 171, ఇంగ్లండ్‌తో 209 చేసిన జైస్వాల్, ఈ శతకంతో టెస్టుల్లో తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకున్నాడు. “గావస్కర్ సలహా ఎప్పటికీ గుర్తుంటుంది. భారీ ఇన్నింగ్స్‌లపై ఫోకస్ చేస్తా” అని జైస్వాల్ తెలిపాడు. కెప్టెన్ షుభ్మన్ గిల్ కూడా “యశస్వి ఆటతో జట్టు బలం పెరిగింది. క్లీన్‌స్వీప్‌పై దృష్టి ఉంది” అని చెప్పాడు.

# టెస్టుల్లో కుల్దీప్ ‘హవా’



### వెస్టిండీస్‌పై ఫైవర్‌తో వరల్డ్ రికార్డు

- ఢిల్లీ టెస్టులో చైనామన్ మాయాజాలం
- కుల్దీప్ ఫీట్‌తో వార్డిల్ రికార్డు బద్దలు
- ఫాలోఆన్ దిశగా విండీస్ కుప్పకూలి
- సీల్స్‌కు ఐసిసి షాక్: మ్యాచ్‌ఫీ 25% కట్
- హోప్-క్యాంప్‌బెల్ 138 రన్స్ భాగస్వామ్యం
- రెండో ఇన్నింగ్స్‌లో విండీస్ పోరాటం
- భారత్ క్లీన్‌స్వీప్ ఛాన్స్.. నాలుగో రోజు కీలకం
- కుల్దీప్ ఫార్మ్‌తో టీమిండియా డామినేషన్

**ఆసియా కప్‌లో వికెట్ల వేట కొనసాగించి ‘హవా’ సృష్టించిన భారత చైనామన్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ టెస్టుల్లోనూ చెలరేగిపోతున్నాడు. అరుణ్‌జైలీ స్టేడియంలో జరుగుతున్న రెండో టెస్టులో వెస్టిండీస్‌పై అద్భుత 5 వికెట్లు (5/82) సాధించి ఐదోసారి ఫైవర్ నమోదు చేసి చరిత్ర సృష్టించాడు. తక్కువ ఇన్నింగ్సుల్లోనే ఈ ఫీట్ పూర్తి చేసి లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్లలో వరల్డ్ రికార్డు నెలకొల్పాడు. ఇంగ్లండ్ మాజీ బౌలర్ జానీ వార్డిల్ (28 ఇన్నింగ్సులు) రికార్డును బద్దలకొట్టి కుల్దీప్ (15 ఇన్నింగ్సులు) మొదటి స్థానానికి ఎదిగాడు. దక్షిణాఫ్రికా పాల్ ఆడమ్స్ (45 ఇన్నింగ్సులు) మూడో స్థానంలో ఉంటూ, కుల్దీప్ జోరు క్రికెట్ ప్రపంచాన్ని ఆకట్టుకుంటోంది. భారత్ మొదటి ఇన్నింగ్స్‌లో 518/5తో డిక్లేర్ చేసిన తర్వాత విండీస్‌ను 248కు ఆలౌట్ చేసి ఫాలోఆన్ విధించింది. రెండో ఇన్నింగ్స్‌లో 173/2తో ఆట ముగిసినా, 97 రన్నులు వెనుకబడి ఉన్న వెస్టిండీస్‌పై భారత్ క్లీన్‌స్వీప్ దిశగా ముందుంది. ఈ మ్యాచ్‌లో ఐసిసి కోడ్ ఉల్లంఘనకు విండీస్ పేసర్ జైడెన్ సీల్స్‌కు 25 శాతం మ్యాచ్‌ఫీ కోత, ఒక డీమరిట్ పాయింట్ పరిణతమైంది. ఓపెనర్ యశస్వీ జైస్వాల్‌పై బంతి విసరడంపై ఈ శిక్ష విధించారు. షై హోప్ (66లి, 80 బంతులు) అర్ధస్తకంతో, జాన్ క్యాంప్‌బెల్ (87లి, 69 బంతులు) కెరీర్ బెస్ట్‌తో 138 రన్స్ అజేయ భాగస్వామ్యం నెలకొల్పి పోరాడుతున్నారు. కానీ, స్పిన్ అనుకూల పిచ్‌పై భారత స్పిన్ దాడి (జడేజా 3/37, వాషింగ్టన్ సుందర్ 1/20) మరోసారి విండీస్‌ను కుంగదీస్తుందని క్రీడా విశ్లేషకులు అంచనా. షుభ్మన్ గిల్ కెప్టెన్సీలో టీమ్‌ఇండియా డామినేషన్ కొనసాగుతోంది.**

**ఢిల్లీ, అక్టోబర్ 12 (జనంసాక్షి) :** ఆసియా కప్‌లో 10 వికెట్లతో ఆకట్టుకున్న కుల్దీప్ యాదవ్ ఢిల్లీ టెస్టులో మరో అద్భుతాన్ని నమోదు చేశాడు. మూడో రోజు ఓవర్‌నైట్ 140/4తో ఆరంభించిన వెస్టిండీస్ ఇన్నింగ్స్‌ను తిప్పేసి 248కు కుప్పకూల్చాడు. షై హోప్ (36)ను మొదట్లో బాక్స్‌లో ట్రప్ చేసి లబ్బుకొట్టాడు. తెవిన్ ఇంమ్లాచ్ (21)ను ఎల్బీగా, జస్టిన్ గ్రీవ్స్ (17)ను స్లిప్‌లో క్యాచ్ తీసేసి హ్యాట్రిక్ ఆటలు చేశాడు. జొమెల్ వారికన్ (0)ను మహ్మద్ సిరాజ్ బౌల్డ్ చేసినా, ఖారీ పియెర్ (23)ను జస్ప్రిత్ బుమ్రా బౌల్డ్‌గా పంపాడు. చివరికి జైడెన్ సీల్స్ (13)ను క్రాస్-సీమ్ డెలివరీతో ఎల్బీగా ఔట్ చేసి ఐదో వికెట్ సాధించాడు. ఈ ఫీట్‌తో కుల్దీప్ టెస్టుల్లో 65 వికెట్లు 21.09 ఆవరేజ్‌తో తీసుకుని, లెగ్ స్పిన్నర్లలో బెస్ట్ స్ట్రైక్ రేట్ రికార్డు కూడా నమోదు చేశాడు. రవీంద్ర జడేజా మరో మూడు వికెట్లతో మద్దతు ఇచ్చాడు. 270 రన్నుల తేడాతో వెనుకబడిన విండీస్‌కు ఫాలోఆన్ తప్పలేదు. రెండో ఇన్నింగ్స్‌లో తగినరైన్ చాండర్‌పాల్ (10)ను మహ్మద్ సిరాజ్, అలిక్ అథనాజ్ (7)ను వాషింగ్టన్ సుందర్ తీసేసి 35/2కి దిగింది. కానీ, జాన్ క్యాంప్‌బెల్ (87, 10 ఫోర్లు) అర్ధస్తకంతో, షై హోప్ (66, 6 ఫోర్లు)తో 138 రన్స్ అజేయ భాగస్వామ్యం నెలకొల్పి పోరాడారు. 49 ఓవర్లలో 173/2 స్కోరు చేసిన వారు, ఇంకా 97 రన్నులు వెనుకబడి నాలుగో రోజు ఎంత పట్టుదల చూపిస్తారో చూడాలి. భారత బౌలర్లు 75.2 ఓవర్లలో కేవలం రెండు వికెట్లు మాత్రమే తీసుకున్నా, స్పిన్ మాయాజాలం కొనసాగుతుందని గిల్ ధృవీకరించాడు. మొదటి ఇన్నింగ్స్‌లో యశస్వీ జైస్వాల్ (70), కేఎల్ రాహుల్ (50), షుభ్మన్ గిల్ (100)లు చేసిన భారీ స్కోర్‌తో టీమిండియా డామినేట్ అయింది. ఈ సిరీస్‌లో అహ్మదాబాద్‌లో మొదటి టెస్టును ఇన్నింగ్స్ తేడాతో గెలిచిన భారత్, ఢిల్లీలో క్లీన్‌స్వీప్‌కు సిద్ధమవుతోంది. మరోవైపు, విండీస్ పేసర్ జైడెన్ సీల్స్‌కు ఐసిసి తీవ్ర గుర్తింపు ఇచ్చింది. మొదటి రోజు 29వ ఓవర్‌లో తన బౌలింగ్ ఫాలో-థ్రూ తర్వాత బంతిని జైస్వాల్ వైపు వేగంగా విసిరి ప్యాడ్లపై తగిలించాడు. రిఫరీ ఆండీ పైక్రాఫ్ట్ రిప్లేలు చూసి ‘అన్‌నెసెసరీ అండ్ ఇన్‌అప్రాప్రియేట్’ అని తీర్పు ఇచ్చి, ఆర్టికల్ 2.9 (బంతిని అప్రాప్రియేట్‌గా విసరడం) ఉల్లంఘనకు ఐసిసికు నివేదించాడు. సీల్స్ ‘రన్‌ఔట్ ప్రయత్నమే’ అని వాదించినా, రిఫరీ ‘క్రీజ్‌లో ఉన్న బ్యాటర్‌పై ఉద్దేశపూర్వకంగా విసిరాడు’ అని నిర్ధారించాడు. దీంతో 25 శాతం మ్యాచ్‌ఫీ కోత, ఒక డీమరిట్ పాయింట్ (మొత్తం 2) విధించారు. డిసెంబర్ 2024లో బంగ్లాదేశ్ మ్యాచ్‌లో మరో డీమరిట్ పాయింట్ పొందిన సీల్స్‌కు ఇది మరో హెచ్చరిక. ఈ ఘటన క్రికెట్ స్పిరిట్‌ను గుర్తు చేస్తూ, భారత-విండీస్ మ్యాచ్‌ను మరింత ఉత్కంఠభరితం చేసింది. కుల్దీప్ మాట్లాడుతూ, “ప్లాన్ వెల్ అమెయిల్ అయింది. స్పిన్‌కు సపోర్ట్ లేని పిచ్‌పై స్టంప్స్ టార్గెట్ చేశాం. టీమ్ ఎనర్జీ అద్భుతం” అన్నాడు. గిల్ కెప్టెన్సీలో భారత్ ఈ సిరీస్‌ను బలంగా ముగించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

*దిల్లీ: భారత్తో జరిగిన తొలి టెస్టులో విఫలమైన విండీస్ బ్యాటర్లు.. అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా జరుగుతున్న రెండో టెస్టులో కాస్త పుంజుకున్నారు. జట్టును ఇన్నింగ్స్ ఓటమి నుంచి తప్పించేందుకు పోరాడుతున్నారు. నాలుగో రోజు కూడా భారత బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొని ఎక్కువసేపు క్రీజులో నిలిస్తే టీమిండియాకు కొంత లక్ష్యాన్ని నిర్దేశించే అవకాశముంది. తొలి ఇన్నింగ్స్ 140/4తో మూడో రోజు ఆటను కొనసాగించిన కరేబియన్ జట్టు.. కుల్దీప్ యాదవ్ (5/82) దెబ్బకు కుదేలై 248 పరుగులకు ఆలౌటైంది. దీంతో 270 పరుగులు వెనుకబడి ‘ఫాలో ఆన్’ నుంచి తప్పించుకోలేకపోయింది. త్యాగ్నారాయణ్ చందర్పాల్ (10), అదనాజ్ (7) విఫలమవడంతో వెస్టిండీస్ ఫాలో ఆన్లోనూ 35 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయింది.*

**వెస్టిండీస్‌తో జరిగిన రెండో టెస్ట్‌మ్యాచ్‌లో రెండో రోజు ఆట ముగిసిన తర్వాత మైదానంలో ఓ సరదా సన్నివేశం చోటుచేసుకుంది. కరేబియన్ జట్టు క్రికెట్ దిగ్గజం బ్రియాన్ లారా నేరుగా యశస్వి జైస్వాల్ వద్దకు వెళ్లి.. అతని ప్రశంసించాడు. ఆ తర్వాత నవ్వుతూ..’ మా బౌలర్లను అంత దారుణంగా కొట్టొద్దు’ అని సరదాగా స్పెషల్ రిక్వెస్ట్ చేశాడు. లారా వంటి లెజెండ్ నుంచి వచ్చిన ఈ ప్రశంసకు, సరదా వ్యాఖ్యకు జైస్వాల్ కూడా నవ్వుతూ రిప్లయ్ ఇచ్చాడు. ఈ అందమైన క్షణాలకు సంబంధించిన వీడియోను బీసీసీఐ తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ లో షేర్ చేయగా.. వైరల్‌గా మారింది**



## 400మీ.లో దీప్తికి పసిడి స్వర్ణం

- తెలుగమ్మాయి అద్భుత ప్రదర్శన
- భారత్ పారా క్రీడల్లో మరో మైలురాయి

**బ్రిస్బేన్, అక్టోబర్ 12 :** ఆస్ట్రేలియాలోని బ్రిస్బేన్ వేదికగా జరుగుతున్న వరల్డ్ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2025లో తెలుగమ్మాయి జీవాంజి దీప్తి మరోసారి ప్రపంచస్థాయిలో అదరగొట్టింది. మహిళల టీ20 విభాగం 400 మీటర్ల పరుగులో 55.92 సెకన్ల సమయంతో స్వర్ణ పతకాన్ని సాధించి, భారత్‌కు గర్వకారణమైంది. ఈ ప్రదర్శనతో ఆసియా రికార్డు నమోదు చేసిన దీప్తి, పోర్చుగల్, ఆస్ట్రేలియా అథ్లెట్లను వెనుక్కొట్టి మొదటి స్థానాన్ని ఖాతాగా బంధించుకుంది. ఇటీవల ఢిల్లీలో జరిగిన ప్రపంచ పారా అథ్లెటిక్స్‌లో రజత పతకం సాధించిన దీప్తి, ఈసారి పసిడితో తన ప్రతిభను మరింత మెరిగించింది. 22 ఏళ్ల వయసులో ఇంటెలెక్చువల్ డిసేబిలిటీతో టీ20 క్లాస్‌లో పోటీపడుతున్న ఈ వరంగల్‌కు చెందిన అథ్లెట్, పారాలింపిక్ బ్రోంజ్ విన్నర్‌గా ఇప్పటికే దేశానికి గర్వకారణమైంది. హంగజౌ ఆసియా పారా గేమ్స్‌లో కూడా స్వర్ణం, ఆసియా రికార్డు సాధించిన దీప్తి, ఈ విజయంతో 2028 లాస్ ఏంజిల్స్ పారాలింపిక్స్‌కు మరింత బలమైంది. తెలంగాణ క్రీడా విభాగం నుంచి బయలుదేరిన ఈ యువతీ, కష్టాలను అధిగమించి ప్రపంచవేదికపై తెలుగు గొప్పను చాటుకుంది. భారత పారా క్రీడల్లో మరో మైలురాయి నెలకొల్పిన ఈ విజయం, దేశవ్యాప్తంగా ఆనందాగారంలో మునిగిపోయింది.

65 YEARS


భారత్, వెస్టిండీస్ మధ్య ఢిల్లీ వేదికగా రెండో టెస్టు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ మ్యాచ్ తో టెస్ట్ క్రికెట్ లో టీమిండియా చరిత్ర సృష్టించింది. అంతేకాక 65 ఏళ్ల తర్వాత తొలిసారి వెస్టిండిస్ పై వరుసగా ఐదు వికెట్లకు 50ం భాగస్వామ్యాలను నెలకొల్పిన జట్టుగా భారత్ అరుదైన రికార్డును క్రియేట్ చేసింది. టెస్ట్ క్రికెట్‌లో టీమిండియా చరిత్ర సృష్టించింది. 65 ఏళ్ల తర్వాత వెస్టిండీస్‌పై వరుసగా ఐదు వికెట్లకు 50 ప్లస్ భాగస్వామ్యాలను నమోదు చేసిన జట్టుగా భారత్ అరుదైన రికార్డ్ నమోదు చేసింది. విండీస్ తో జరుగుతున్న ఈ టెస్టు మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో టీమిండియా టాప్-5 బ్యాటర్లు యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్, శుభ్‌మన్ గిల్, నితీష్ కుమార్ రెడ్డి, ధృవ్ జురెల్ వరుసగా ఐదు వికెట్లకు 50 ప్లస్ పరుగుల పార్ట్‌నర్‌షిప్స్ అందించారు. మొదటి వికెట్‌కు రాహుల్-జైస్వాల్ 58, రెండో వికెట్‌కు జైస్వాల్-సాయి సుదర్శన్ 193, మూడో వికెట్‌కు జైస్వాల్-శుభ్‌మన్ గిల్ 69, నాలుగో వికెట్‌కు గిల్-నితీష్ కుమార్ రెడ్డి 91, ఐదో వికెట్‌కు శుభ్‌మన్ గిల్- జురెల్ 102 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. 1960 తర్వాత కరేబియన్ జట్టుపై ఒక టీమ్ వరుసగా ఐదు వికెట్లకు 50 ప్లస్ రన్స్ భాగస్వామ్యం నమోదవ్వడం ఇదే తొలిసారి. గతంలో ఈ రికార్డ్‌ను వెస్టిండీస్‌పై ఆస్ట్రేలియా నమోదు చేసింది. 1960లో బ్రిస్బేన్ వేదికగా జరిగిన గబ్బా టెస్ట్‌లో ఆసీస్ ఈ ఫీట్ సాధించింది.

93 ఏళ్ల భారత టెస్ట్ క్రికెట్ చరిత్రలో టీమిండియా ఈ ఫీట్ సాధించడం మూడో సారి. 1993లో తొలిసారి ఇంగ్లాండ్‌పై ముంబై వేదికగా వరుసగా 5 వికెట్లకు 50 ప్లస్ రన్స్ భాగస్వామ్యాలను భారత్ నమోదు చేసింది. అనంతరం 2023లో ఆస్ట్రేలియాపై అహ్మదాబాద్ వేదికగా రెండో సారి ఈ ఫీట్ ను భారత్ అందుకుంది. తాజాగా విండీస్ పై ముచ్చటగా మూడోసారి ఈ ఫీట్ టీమిండియా అందుకుంది.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
13 అక్టోబర్ 2025

# ధీరోదాత్తుడు రాంరెడ్డి దామోదర్‌రెడ్డి

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు



హైదరాబాద్ (జనంసాక్షి) : నేను అంటే కాంగ్రెస్.. కాంగ్రెస్ అంటే నేను అని నిలబడి కొట్లాడిన ధీరోదాత్తుడు రాంరెడ్డి దామోదర్ రెడ్డి అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఆదివారం తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రము లో ఏర్పాటు చేసిన దివంగత నేత రాంరెడ్డి దామోదర్ రెడ్డి సంస్మరణ సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రసంగించారు. తాను చదువుకునే రోజుల్లోనే దామోదర్ రెడ్డి ప్రజల్లో ఆదర్శ నాయకునిగా గుర్తింపు సాధించారని అన్నారు. 1985లో ఒక పార్టీ హవా నడిచింది ఎవరు గెలవలేని సందర్భంలో కూడా ఆనాడు గెలిచి కాంగ్రెస్ జెండాను దామోదర్ రెడ్డి రెపరెప లాడించారు అన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల కోసం, పేదల సంక్షేమం కోసం దామోదర్ రెడ్డి పోరాడిన సంఘటనలు కో కొల్లలుగా ఉన్నాయని అన్నారు. తుంగతుర్తి నియోజకవర్గంలో ఇతర పార్టీలతో రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ కాంగ్రెస్ పార్టీ శాసనసభ్యులుగా, మంత్రిగా ఉమ్మడి నల్లగొండ జిల్లాతో పాటు రాష్ట్ర అభివృద్ధికి దామోదర్ రెడ్డి కృషి చేశారని తెలిపారు. యువత రాజకీయాల్లో రావడానికి స్ఫూర్తిదాయక జీవితం గడపడానికి దామోదర్ రెడ్డి ఆదర్శంగా నిలిచారు అన్నారు. రాష్ట్రంలో ఒక దశాబ్దం పాటు వేరే రాజకీయ పార్టీ ఉన్నప్పటికీ ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా కాంగ్రెస్ లోనే కొనసాగిన ధీరోదాత్తుడు దామోదర్ రెడ్డి అని డిప్యూటీ సీఎం తెలిపారు. నీలాంటి రాజకీయ నాయకుడు మా పార్టీకి అవసరమని ఎన్నో పార్టీల పెద్దలు ఒత్తిడి చేసిన దామోదర్ రెడ్డి లొంగకుండా కాంగ్రెస్ సిద్ధాంతానికి కట్టుబడి ఉన్నారని డిప్యూటీ సీఎం తెలిపారు. ఎన్నికల ముందు తాను చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర ఉమ్మడి నల్లగొండ జిల్లా మీదుగా వెళుతున్న సందర్భంలో తన వయసును కూడా లెక్కచేయకుండా నా అడుగులో అడుగు వేసిన గొప్ప సోదరుడు దామోదర్ రెడ్డి మన మధ్య లేకపోవడం దురదృష్టకరం అన్నారు. తన జీవితం మొత్తం ప్రజలకే అంకితమై అధికారంలో ఏ ప్రభుత్వం ఉన్నప్పటికీ వారితో మాట్లాడుతూ ప్రజలకు సంక్షేమం కోసం తపించారని గుర్తు చేశారు. ఎప్పుడు ప్రత్యేక తెలంగాణ కోసం నేను ఉన్న అని మాట్లాడిన ఈరోజు అతడు దామోదర్ రెడ్డి అన్నారు. దామోదర్ రెడ్డి నమ్మిన ఆశయాలను, సిద్ధాంతాలను, ఆలోచనలను ప్రజా ప్రభుత్వం ముందుకు తీసుకుపోతుం దని వారికి ఘనమైన నివాళులు అర్పిస్తుందని డిప్యూటీ సీఎం తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు.

### నేడు చండీఘడ్ కు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

డీజీపీ సహా 8 మంది సీనియర్ ఐపీఎస్ అధికారుల కుల ఆధారిత వివక్ష, బహిరంగ అవమానాలు భరించలేక తుపాకితో కాల్చుకొని ఆత్మహత్య కు పాల్పడిన ఐపీఎస్ అధికారి పూరన్ కుమార్ మృతదేహానికి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు నేడు సాయంత్రం చండీఘడ్ కు వెళుతున్నారు. హైదరాబాద్ నగరం లోని బర్కత్ పుర కు చెందిన పూరన్ కుమార్ ఐపీఎస్ ఆత్మహత్య దేశవాసులను దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. బీజేపీ పాలనలో దేశం లోని అత్యున్నత సర్వీసులో అదనపు డిజి స్థాయి లో ఉన్న వారికి కూడా సామాజిక న్యాయం అందడం లేదంటే ఇక సామాన్య పౌరుని పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అనడానికి పూరన్ కుమార్ ఆత్మహత్య ఒక ఉదాహరణ అన్నారు.

# ఎన్నికల వ్యయ పర్యవేక్షకుడిగా సంజీవ్‌కుమార్‌లాల్

హైదరాబాద్, అక్టోబర్ 12 (జనంసాక్షి) : జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నికల సందర్భంగా ఎన్నికల కమిషన్ ఆఫ్ ఇండియా (ఈసీఐ) ఐఆర్ఎస్ అధికారి సంజీవ్ కుమార్ లాల్ (2014 బ్యాచ్) ను ఎన్నికల వ్యయ పర్యవేక్షకుడిగా నియమించింది. ఎన్నికల వ్యయ పర్యవేక్షకులు ఎన్నికల ఖర్చుల పర్యవేక్షణలో భాగంగా అన్ని కార్యకలాపాలను సమీక్షించడంతో పాటు, ఎన్నికల వ్యయంపై కట్టుదిట్టమైన పర్యవేక్షణను కొనసాగిస్తారు. ఉప ఎన్నికలలో పారదర్శకతను కాపాడడమే కాకుండా, డబ్బు ప్రలోభాల ప్రభావాన్ని అరికట్టే దిశగా పర్యవేక్షకులు చర్యలు తీసుకుంటారు.

# నటుడు శ్రీకాంత్ అయ్యంగార్‌పై 'మా'కు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఫిర్యాదు



హైదరాబాద్ (జనంసాక్షి) : మహాత్మా గాంధీపై నటుడు శ్రీకాంత్ అయ్యంగార్ అనుచిత వ్యాఖ్యలు చేసిన వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అయింది. దీనిపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ విషయంపై మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా) కి బల్మూరి వెంకట్ ఫిర్యాదు చేశారు. ఈ కంప్లైంట్ లో నటుడు శ్రీకాంత్‌పై చర్యలు తీసుకోవాలని, అతడి అసోసియేషన్ సభ్యత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఫిర్యాదును మా అధ్యక్షుడు మంచు విష్ణుకు అందించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మీడియాతో మాట్లాడుతూ.. శ్రీకాంత్ అయ్యంగార్ వ్యాఖ్యలతో ప్రజల మనోభావాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, ఈ వ్యాఖ్యలతో సమాజంలో విభజనలు, ఘర్షణలు రావొచ్చని హెచ్చరించారు. "పెద్ద హీరోలు కూడా ఈ అంశంపై స్పందించాలని కోరారు. ఆయనపై చర్యలు తీసుకోకపోతే, మేము కఠిన చర్యలు తీసుకునేలా చెస్తామని పేర్కొన్నారు. మరోవైపు, మా జనరల్ సెక్రటరీ శివ బాలాజీ స్పందిస్తూ.. "మాకు డిసిప్లినరీ కమిటీ ఉంది.. ఈ విషయాన్ని చర్చించి తగిన చర్యలు తీసుకుంటాం.. త్వరలో మీటింగ్ పెట్టి అవసరమైన చర్యలు చేపడతాం అన్నారు.

# జవాబుదారీతనం, పారదర్శకత కోసమే స.హ చట్టం

- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జి.చిన్నారెడ్డి



హైదరాబాద్ (జనంసాక్షి) : జవాబుదారీతనం, పారదర్శకత కోసమే అప్పటి యూపీఏ ప్రభుత్వం సమాచార హక్కు(స.హ) చట్టాన్ని తీసుకొచ్చిదని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జి.చిన్నారెడ్డి తెలిపారు. సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టం 20వ ఆవిర్భావ దినోత్సవాన్ని హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఆదివారం హైదరాబాద్లోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ జాతీయ చైర్మెన్ డాక్టర్ బొమ్మర బోయిన కేశవులు ముదిరాజ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డా.జీ.చిన్నారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాలనలో జవాబుదారీ తనం పారదర్శకత కోసం సమాచార హక్కు చట్టాన్ని యుపీఏ ప్రభుత్వం తీసుకొచ్చిందని చెప్పారు. పౌరులకు మెరుగైన సేవలు అందించేందుకు తెచ్చిన ఈ చట్టం ద్వారా సమాచారం సులువుగా తెలుసుకోవచ్చని వివరించారు. ఎంతో విలువైన ఈ సమాచార హక్కు చట్టం ద్వారా స్వీకరించవచ్చన్నారు. సమాచార హక్కు చట్టంపై 2009 నుంచి విస్తృతంగా అవగాహన అల్పిస్తున్న సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ జాతీయ చైర్మెన్ డా.బొమ్మర బోయిన కేశవులు ముదిరాజ్ ను అభినందించారు. ఈ కార్యక్రమానికి మరో ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ మాజీ చైర్మెన్ డా. జీ. చంద్రయ్య మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం అనేది పాలనలో జవాబుదారీ తనం కోసం తెచ్చిన చట్టం అని వివరించారు. ఎవ్వరైనా ఈ చట్టం ద్వారా సమాచారం అడిగే హక్కు ఉందని స్పష్టం చేశారు. సమాచారహక్కు చట్టంపై గత 16 సంవత్సరాలుగా డా.కేశవులు ముదిరాజ్ చేస్తున్న కృషిని అభినందించారు. మరో అతిథి ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం పౌరులకోసం తెచ్చిన మంచి చట్టం అని తెలిపారు. సమాచార హక్కు చట్టం పై, ఎన్నికలపై ఎలక్షన్ వాచ్ కమిటీ ద్వారా ప్రచారం చేసి ఓటరు చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. ఎస్‌హెచ్ పీ ఎస్, వారి సభ్యులు చేస్తున్న కార్యక్రమాలను గుర్తు చేసుకుంటూ అభినందనలు తెలిపారు. సమాచార హక్కు పరిరక్షణ సమితి ఎలక్షన్ వాచ్ కమిటీ జాతీయ చైర్మెన్ డా. బొమ్మర బోయిన కేశవులు ముదిరాజ్ మాట్లాడుతూ యూపీఏ ప్రభుత్వం 2005 లో సమాచార హక్కు చట్టం తెచ్చిందన్నారు. సమాచార హక్కు చట్టం పై అవగాహన కల్పించేందుకు 2009లో సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీనీ స్థాపించినట్లు చెప్పారు. ఈ చట్టం పై గ్రామ స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు వివిధ సందర్భాలలో అవగాహన సదస్సులు, ర్యాలీలు, సదస్సులు నిర్వహించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా సమాచార హక్కు చట్టం పుస్తకాలను, కరపత్రాన్ని అతిథులు ఆవిష్కరించారు. సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ 2024 – 2025 వార్షిక నివేదికను సమాచార హక్కు పరిరక్షణ సమితి తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ కన్నెబోయిన ఉషారాణి చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో జలసాధన సమితి జాతీయ అధ్యక్షులు దుష్యర్ల సత్యనారాయణ, విశ్రాంత ఐఎఎస్ అధికారి లక్ష్మీ కాంతం, కామినేని హాస్పిటల్ ప్రిన్సిపల్ డా.రంగారావు, తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివయ్య ముదిరాజ్, ఎస్ హెచ్ పీ ఎస్ కోశాధికారి రేఖా రజని, సభ్యులు మేఖల శ్రీవారి, ఎరుకల నరహరి, మెట్టు మధు, కలువాల హరికృష్ణ, మెడి యాదయ్య, పగిడిమర్రి బ్రహ్మాచారి, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ విధానాల వల్లే దేశంలో కులవివక్ష

- సుప్రీం సీజే గవాయ్‌పై బూట్ విసరడం దేనికి సంకేతం?
- హర్యానా దళిత ఐపిఎస్ ఆత్మహత్య కారణమేంటి?
- దళితులు జీవించే హక్కు లేదా?
- ప్రపంచ దేశాల ముందు భారత్ పరువు తీస్తున్నారు
- దళితులు.. ఆత్మగౌరవం కోసం తిరగబడండి
- బీజేపీకి కేంద్రంలో అధికారంలో కొనసాగే నైతిక హక్కు లేదు
- నాగర్ కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి



నాగర్ కర్నూల్ (జనంసాక్షి) : కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపి అనుసరిస్తున్న విధానాలతో దేశంలో కుల వివక్ష పెరిగిపోతోందని నాగర్ కర్నూల్ ఎంపీ డా.మల్లు రవి ఆందోళన వ్యక్తం చేశారు. నోటితో ఆదర్శాలు వల్లించే బీజేపి నాయకులు చేతల్లో దళితులు, నిమ్న వర్గాలను లక్ష్యంగా చేసుకుని దాడులకు పాల్పడుతున్నారని, బలవంతపు చావులకు ప్రేరేపిస్తున్నారని ఆరోపించారు. దళితుల జీవించే హక్కు కాలరాస్తున్న బీజేపికి కేంద్రంలో అధికారంలో కొనసాగే నైతిక హక్కు కోల్పోయారన్న ఆయన హిందువులందరు ఒక్కటే అని చెప్పే ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ బాగవత్ దేశంలో జరుగుతున్న సంఘటనలపై ఎందుకు నోరు విప్పడం లేదని ప్రశ్నించారు.సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ గవాయ్పై ఓపెన్ కోర్టులో బూటు విసిరిన ఘటనపై ప్రధాని మోదీ స్పందించిన తీరు దేశంలోని దళితులను తీవ్ర నిరాశకు గురిచేసిందన్న ఎంపీ పార్లమెంట్లో తాము దిష్టిబొమ్మల్లా చేతులకు కట్టుకుని కూర్చోలేమని స్పష్టం చేశారు. రాజ్యాంగ వేదికలపై దళితులపై జరుగుతున్న దాడులను నిలదీస్తునే ఉంటామన్నారు. ఆదివారం కల్వకుర్తి ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో కల్వకుర్తి,అచ్చంపేట ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణ రెడ్డి,డా.వంశీకృష్ణ,డిసిసిబి చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్ రెడ్డి,కల్వకుర్తి మాజీ సర్పంచ్ ఆనంద్ కుమార్‌తో కలిసి ప్రెస్‌మీట్ నిర్వహించారు. దేశంలో కుల వివక్షను పెంచిపోషిస్తున్న బీజేపి విధానాల కారణంగా హర్యానాలో దళిత ఐపిఎస్ సూసైడ్ చేసుకున్నారని ఆరోపించారు.తనపై అధికారుల వేధింపులను మూడు పేజీల మరణ వాంగ్మూలంలో ప్రస్తావించిన హర్యానాలోని బీజేపి ప్రభుత్వం,ఐపిఎస్ల వ్యవహారాలను పర్యవేక్షించే కేంద్రంలోని బీజేపి ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఆత్మహత్యకు పాల్పడిన ఐపిఎస్ అధికారి భార్య ఐఏఎస్ అధికారిణి అయినప్పటికి తన భర్త చావుకు కారణమైన దోషులకు శిక్షలు పడేలాచూడాలని అర్థించే దుస్థితి నెలకొందన్నారు. తన ప్రతిభతో సుప్రీం చీఫ్ జస్టిస్ వరకు ఎదిగిన జస్టిస్ గవాయ్‌పై కోర్టులో బూటు విసిరిన ఘటనతో ప్రపంచ దేశాల ముందు భారత్ తలదించుకోవాల్సిన దుస్థితి కల్పించారని అన్నారు. ఈ ఘటనలపై ప్రధాని మోదీ ఎందుకు స్పందించలేదని నిలదీశారు.తనను తాను చాయ్వాలాగా,బీసీల బిడ్డగా చెప్పుకునే ప్రధాని మోదీ ఈ ఘటనలను బహిరంగంగా ఖండించి ఎందుకు మద్దతుగా నిలవలేదని ప్రశ్నించారు. దళితులు ఐఏఎస్‌లు, ఐపిఎస్‌లు, జడ్జీలుగా ఎదిగితే బీజెపి నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్య దేశంలో దళిత ఐఏఎస్, ఐపిఎస్, జడ్జీలకే రక్షణ లేకపోతే సామాన్య దళితుల పరిస్థితి ఏమిటని ఆందోళన వ్యక్తం చేశారు.జస్టిస్ గవాయ్పై జరిగిన దాడిపై కె.ఎ. పాల్ కేసు వేసే వరకు కేంద్ర ప్రభుత్వం మొద్దునిద్ర వీడలేదని విమర్శించారు.దళితులు జీవించే హక్కును కాలరాస్తున్న బీజేపి ప్రభుత్వాన్నీ ప్రజలు గద్దె దించుతారని హెచ్చరించారు.

### ఆత్మహత్మలు కాదు తిరగబడండి...

ఉన్నత చదువులతో ఎదుగుతున్న దళితులు అవమానాలు, వివక్షకు గురై ఆత్మనూన్యతతో ఆత్మహత్మలకు పాల్పడటం పరిష్కారం కాదన్న మల్లు రవి తిరగబడాలని పిలుపునిచ్చారు.దళితులకు చావాల్సిన పరిస్థితులే ఎదురైతే దీనికి కారణమైన వారిని చంపిన తర్వాతే తమ చావు గురించి ఆలోచించాలన్నారు. రాజ్యసభలో మాట్లాడిన హోం మంత్రి అమిత్ షా పదే పదే అంబేద్కర్ పేరు తలిస్తే ఏమొస్తుందని వెటకారం చేస్తు దేవుడిని తలుచుకుంటే పుణ్యమొస్తుందని అనడం దుర్మార్గమన్నారు. అయోధ్యలో రాముడి గుడి కట్టించిన బీజేపి రాముడి ఆదర్శాలను భూస్థాపితం చేసిందన్నారు. దేశంలో దళితులు,నిమ్న వర్గాలను తుడిచేయడం రామ రాజ్యమా అని ప్రశ్నించారు.మర్యాద పురుషోత్తముడైన రాముడి పేరుతో రాజకీయాలు చేసే బీజేపికి ఆయన పేరు ఎత్తే యోగ్యత లేదన్నారు.

### దళితుల హక్కుల రక్షణకై సంస్థ ఏర్పాటు

దళితుల హక్కులు, భవిష్యత్, రక్షణ తదితర అంశాలపై త్వరలో ఒక సంస్థను ఏర్పాటు చేయనున్నట్లు మల్లు రవి ప్రకటించారు.జాతీయ ఎస్సీ కమీషన్లో దాఖలైన కేసుల సంఖ్య పెరిగిందని వాటిని మూసేయాలని కేంద్రం ఆదేశించడం దిగజారుడుతనానికి పరాకాష్టగా అభివర్ణించారు. సుప్రీం కోర్టు,హైకోర్టులలో కేసుల సంఖ్య పెరిగితే విచారణ లేకుండా వాటిని కూడా మూసేస్తారా అని ప్రశ్నించారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ దళితులు, నిమ్నవర్గాల జాతుల సంరక్షణకు అభయమిస్తే బీజేపి ప్రధాని నరేంద్ర మోదీ ఏం చేస్తున్నారో దేశమంతా గమనిస్తుందన్నారు.


# టీ-చిప్ పథకానికి కేంద్రస్థాయిలో మద్దతిస్తాం

- మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ హామీ
- తెలంగాణలో సెమీకండక్టర్ రంగం అభివృద్ధికి ప్రభుత్వ సహకారం : మంత్రి వాకిటి శ్రీహరి



హైదరాబాద్ (జనంసాక్షి) : టీ-చిప్ పథకానికి కేంద్రస్థాయిలో మద్దతు ఇస్తామని మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ హామీ ఇచ్చారు. భారతదేశంలో సెమీకండక్టర్ రంగానికి కొత్త దిశ చూపే చారిత్రాత్మక అడుగుగా, దేశంలోనే తొలి 'సెమీకండక్టర్ ఇన్నోవేషన్ మ్యూజియం' హైదరాబాద్‌లో ఘనంగా ప్రారంభమైంది. టెక్నాలజీ చిప్ ఇన్నోవేషన్ ప్రోగ్రామ్ (టీ-చిప్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ మ్యూజియం ప్రారంభోత్సవ కార్యక్రమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కీలక నాయకులు, పారిశ్రామిక వేత్తలు, అకాడమియా, పెట్టుబడిదారులు, ప్రజలు విస్తృతంగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, రాష్ట్ర క్రీడలు, యువజన శాఖ మంత్రి శ్రీ వాకిటి శ్రీహరి, పార్లమెంట్ సభ్యుడు కొండ విశ్వేశ్వర్ రెడ్డి, మాజీ ఐటీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య పాల్గొన్నారు. ముఖ్యమంత్రి సోదరుడు అనుముల తిరుపతి రెడ్డి హాజరై సభకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ మాట్లాడుతూ సెమీకండక్టర్ రంగం దేశ ప్రాధాన్య రంగంగా మారిందన్నారు. 'సెమీకాన్ ఇండియా', 'డిజిటల్ ఇండియా', 'మేక్ ఇన్ ఇండియా' వంటి కేంద్ర ప్రభుత్వ పథకాల దిశగా టీ-చిప్ చేస్తున్న పని ప్రశంసనీయమన్నారు. దేశ వ్యాప్తంగా ఈ రంగం అభివృద్ధి చెందేందుకు అవసరమైన అన్ని విధాలా మద్దతు ఇవ్వడానికి నేను కేంద్ర స్థాయిలో కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ తెలంగాణా ఎప్పుడూ సాంకేతిక మార్పులలో ముందంజలో ఉంటుందన్నారు. ఈ రంగం కోసం రాష్ట్ర ప్రభుత్వం విధానపరమైన మద్దతు, మౌలిక వసతులు, ప్రతిభా వికాసం వంటి అన్ని అంశాల్లో సహకరిస్తుందన్నారు. ఈ మ్యూజియం విద్యార్థులకు ప్రేరణగా, స్టార్టప్‌లకు వేదికగా, పరిశోధనకు ప్రయోగశాలగా మారనుందని తెలిపారు.



టీ-చిప్ ఛైర్మన్ సందీప్ కుమార్ మక్తాల మాట్లాడుతూ ఇది కేవలం ప్రదర్శన స్థలం మాత్రమే కాదని, ఇది పరిశోధన, పరిశ్రమ, సమాజం మధ్య వారధిగా నిలుస్తుందన్నారు. తెలంగాణా మన ప్రారంభ వేదిక అని, ప్రపంచ స్థాయి సెమీకండక్టర్ ఎకోసిస్టమ్‌ను నిర్మించడమే లక్ష్యమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమానికి విధాననిర్మాతలు, పెట్టుబడిదారులు, పరిశ్రమ నాయకులు, వందలాది మంది ప్రజలు హాజరై ఆసక్తిగా సాంకేతిక ప్రదర్శనలను వీక్షించారు. ఈ మ్యూజియం ప్రతి నెలా డెమో డేస్, ఇన్వెస్టర్ మీట్స్, గ్లోబల్ షోకేస్‌లు వంటి అనేక కార్యక్రమాలకు వేదిక కానుంది. త్వరలో దేశవ్యాప్తంగా ఉన్న విశ్వవిద్యాలయాలు, ఐటీ పార్కులు, పరిశోధనా కేంద్రాల్లో కూడా ఈ మోడల్‌ను విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

# పెళ్లైన 13 రోజులకే గర్భం దాల్చిన యువతి

- భర్త నిలదీయడంతో వెలుగులోకి అసలు నిజం

సిద్దిపేట (జనంసాక్షి) : సిద్దిపేట జిల్లా ములుగులో దారుణం వెలుగుచూసింది. పెళ్లైన 13 రోజులకే ఓ యువతి గర్భం దాల్చింది. భర్త నిలదీయడంతో అసలు విషయం వెలుగుచూసింది. ఘటనలో సినిమా రేంజ్ ట్విస్ట్ చోటుచేసుకుంది. ఆ యువతికి పెళ్లికి ముందే ఉదయ్ కిరణ్ అనే యువకుడితో ప్రేమ వ్యవహారం ఉంది. ప్రేమ పేరుతో యువతిని శారీరకంగా లొంగదీసుకున్నాడు. ఈ విషయం తెలిసిన మరో యువకుడు పవన్ కళ్యాణ్ యువతిని బెదిరించి అత్యాచారానికి పాల్పడ్డాడు.

ఈ విషయం యువతి తల్లిదండ్రులకు తెలిసింది. విషయం దాచిపెట్టి గత నెలలో మరో యువకుడికి ఇచ్చి పెళ్లి చేశారు. అయితే ఈ నెల 8న యువతికి కడుపునొప్పి రావడంతో యువతి భర్త ఆస్పత్రికి తీసుకెళ్లాడు. పరీక్షించిన వైద్యులు ఆ యువతి అప్పటికే గర్భవతి అని నిర్ధారించారు. దీంతో భర్త షాక్ కు గురయ్యాడు. అసలు ఏం జరిగిందని భార్యను అక్కడికక్కడే నిలదీశాడు. తనపై జరిగిన ఘోరాన్ని భర్తకు చెప్పింది. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# నాపై కుట్రలు జరుగుతున్నాయి

- మంత్రి వివేక్ సంచలన వ్యాఖ్యలు



హైదరాబాద్ (జనంసాక్షి) : తెలంగాణ రాజకీయాల్లో కొత్త వివాదం చెలరేగింది. మంత్రి వివేక్ బహిరంగంగా చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. సహ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌పై ఆయన చేసిన విమర్శలు సంచలనంగా నిలిచాయి. నిజామాబాద్‌లో మీడియాతో మంత్రి వివేక్ మాట్లాడుతూ.. 'నేను కష్టపడి పనిచేస్తున్నా, నాపై కుట్రలు జరుగుతున్నాయి. కొందరు నన్ను టార్గెట్ చేస్తున్నారు. ఈ కుట్రల వెనుక ఎవరో నాకు తెలుసు' అని వ్యాఖ్యానించారు. 'మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను రెచ్చగొట్టి నాపై విమర్శలు చేయిస్తున్నారు. లక్ష్మణ్ నాపై ఎందుకు ఇలా మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదు. నేను ఆయనపై ఎప్పుడూ తప్పుగా మాట్లాడలేదు. రాజకీయాల్లో లక్ష్మణ్‌ను ప్రోత్సహించింది మా నాన్నగారే," అని వివేక్ చెప్పారు. తనపై వస్తున్న వదంతులపై మంత్రి వివేక్ స్పష్టతనిచ్చారు. "లక్ష్మణ్ వస్తే నేను వెళ్లిపోతాననేది పూర్తిగా అబద్ధం. అలాంటి వ్యాఖ్య నేను ఎప్పుడూ చేయలేదు. నన్ను తప్పుగా చూపించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారు," అని వివేక్ చెప్పారు. "నాది మాల జాతి అని విమర్శించడం చాలా బాధాకరం. జాతి పేరుతో రాజకీయాలు చేయడం తగదు. మనం ప్రజాసేవ కోసం ఉన్నాం, విభజన కోసం కాదు," అని మంత్రి వివేక్ అన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370